వార్త – తెలుగు జాతీయ దినపత్రిక

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

విజయవాడ : fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

17-3-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 44 పేజీలు: 10+4 వెల: 6.50


సునీతా విలియమ్స్ 19న భూమిపైకి రాక 5లో

నైట్ క్లబ్‌లో అగ్నిప్రమాదం.. 50 మందిపైగా సజీవ దహనం

## వచ్చే 2 రోజుల్లో వడగాడ్పులు



### ఎండ వేడిమి మరింత పెరిగే సూచన

**విజయవాడ,మార్చి16,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో రాగల రెండురోజుల్లో తీవ్ర ఎండ వేడిమి,వడగాల్పులు ఉండే అవకాశం ఉందని, ఆ దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది, సోమవారం శ్రీకాకుళం జిల్లా 8 విజయనగరం జిల్లా 15 పార్వతీపురం మన్యం జిల్లా 12 మండలాల్లో తీవ్రవడగాల్పులు ప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. ఇక సోమవారం వడగాల్పులు వీచే అవకాశం ఉన్న మండలాలల్లో శ్రీకాకుళం జిల్లా16, విజయనగరం10, పార్వతీపురం మన్యం3, అల్లూరి సీతారామరాజు9, విశాఖపట్నం 2, అనకాపల్లి16, కాకినాడ15, కోనసీమ9 మండలాలు ఉన్నాయి. వీటితో పాటు తూర్పుగోదావరి 19, పశ్చిమగోదావరి3, ఏలూరు13, కృష్ణా10, ఎన్టీఆర్8, గుంటూరు14, బాపట్ల1, పల్నాడు 19 మండలాల్లో వడగాల్పులు ప్రభావం చూపనున్నట్లు తెలిపారు. మంగళవారం 25 మండలాల్లో తీవ్రవడగాల్పులు,89 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందన్నారు. ఆదివారం అనకాపల్లి జిల్లా నాతవరంలో $42.1^0$, నంద్యాల జిల్లా రుద్రవరం, విజయనగరం జిల్లా పెదనదిపల్లిలో $41.8^0$, ప్రకాశం జిల్లా గొల్లవిడిపి, కర్నూలు జిల్లా లద్దగిరిలో $41.4^0$, పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మరియు అప్పయ్యపేటలో $41^0$ అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. అలాగే 14 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 56 మండలాల్లో వడగాల్పులు వీచాయన్నారు.ఎండదెబ్బ తగలకుండా టోపీ, గొడుగు, టవల్, కాటన్ దుస్తులు ఉపయోగించాలి. వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలి. గుండె సంబంధిత వ్యాధులు, షుగర్, బిపి ఉన్నవారు ఎండలో తిరగకూడదని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి కూర్మనాథ్ సూచించారు.

## పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో

# 2047కు ఎపి నం.1

### అమరావతిలో 'అమరజీవి' 58 అడుగుల విగ్రహం

### యేడాదిలోగా పార్కు నిర్మాణం చేపడతాం

### శ్రీరాములు ఇల్లు మ్యూజియంగా అభివృద్ధి

### 12 నెలలు అమరజీవి 125వ జయంతి ఉత్సవాలు

### శ్రీరాములు జయంతి వేడుకల్లో సిఎం చంద్రబాబు



ఆదివారం పొట్టి శ్రీరాములు విగ్రహంవద్ద నివాళులర్పిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

**విజయవాడ,మార్చి16,ప్రభాతవార్తప్రతినిధి:** పొట్టి శ్రీరాములుస్వగ్రామాన్ని అభివృద్ధిచేస్తాం... ఆయన నివాసం ఉన్న ఇంటిని ప్రభుత్వమే కొని.. మ్యూజియంగా అభివృద్ధి చేస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఆదివారం ఉండవల్లిలో పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమం జరిగింది. పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలవేసి సిఎం చంద్రబాబు, మంత్రి నారాయణ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు మాట్లాడారు.పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించుకున్నామని సిఎం చంద్రబాబు అన్నారు. మొన్నే ఆత్మార్పణ దినోత్సవాన్ని కూడా పెద్ద ఎత్తున చేసుకున్నామని సిఎం చంద్రబాబు గుర్తుచేశారు. జనం కోసం, తెలుగు జాతి కోసం పొట్టి శ్రీరాములు బతికారు. భూమిపై ఎంతోమంది పుడతారు కానీ కొందరే చరిత్రలో నిలిచిపోతారు. తెలుగువారి చరిత్ర ఉన్నంత వరకు పొట్టి శ్రీరాములు గుర్తుంటారు. ఆయన చేసిన త్యాగ ఫలితమే భాషా ప్రాయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు నాంది. బ్రిటిష్ వారు ప్రజలను ఇబ్బందులు పెట్టి, ఇక్కడి సంపదనంతా వారి దేశానికి తరలించుకుపోయారు. బ్రిటిష్ వారు పాలనా సౌలభ్యంకోసం కొన్ని ప్రెసిడెన్సీలను ఏర్పాటుచేశారు. స్వాతంత్రం వచ్చాక >>2

## అమరావతికి రూ. 11వేల కోట్లు

### చంద్రబాబు సమక్షంలో హడ్కో -సిఆర్డీఎ మధ్య కుదిరిన ఒప్పందం

**విజయవాడ,మార్చి16,ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో హడ్కో -సిఆర్డిఎ మధ్య ఒప్పందం జరిగింది. ఉండవల్లి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణ, హడ్కో సిఎండి సంజయ్ కుల్ శ్రేష్ఠ, మునిసిపల్ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ ఒప్పందం మేరకు రాజధాని నిర్మాణాలకు హడ్కో రూ.11,000 కోట్లు రుణంగా అందించనుంది. జనవరి 22న ముంబైలో జరిగిన హడ్కో బోర్డు సమావేశంలో నిధులు మంజూరుకు అంగీకారం తెలిపారు. ఈ మేరకు నేడు సిఆర్డిఎతో ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు మాట్లాడుతూ అమరావతి పునర్ నిర్మాణం, అభివృద్ధి పనుల్లో గుర్తుండి పోయే ఘట్టమన్నారు. నిర్దేశిత లక్ష్యంలో అమరావతి అభివృద్ధిని చేపట్టామన్నారు. ఆ దిశలో >>2

## రేపటి నుంచి ఎమ్మెల్యేల క్రీడాపోటీలు

**విజయవాడ,మార్చి16,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర విభజన తర్వాత ఎపి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్రీడలను పకడ్బందీగా నిర్వహించేందుకు పక్కా ప్రణాళికలతో ఏర్పాట్లు చేస్తున్నామని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు.ఈ పోటీల కోసం అనుభవజ్ఞులైన రీఫరీలు,అంపైర్లును ఏర్పాటు చేసామన్నారు. ప్రేక్షక వీక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు చేసామన్నారు. ఈ నెల 18, 19, 20 తేదీల్లో విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం, ఇండోర్ స్టేడియాల్లో జరిగే క్రీడలకు సంబంధించి చేపడుతున్న >>2



## నేటి నుండి టెన్త్ పరీక్షలు

### 3450 కేంద్రాలు ఏర్పాటు

**విజయవాడ,మార్చి16,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా నేటి నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఈ నెల 31వ తేదీ వరకు 3,450 కేంద్రాల్లో 6,49,884విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పాఠశాల విద్యలో తీసుకొచ్చిన సంస్కరణల్లో భాగంగా తొలిసారి ఆంగ్ల మాధ్యమం, ఎన్‌సిఆర్‌టి సిలబస్‌తో కలిపి విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆంగ్ల మాధ్యమంలో 5,64,064 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా తెలుగులో మాధ్యమంలో 51,000ల మంది పరీక్షలకు హాజరుకానున్నారు.ఉదయం 9:30 గంటలనుంచీ మధ్యాహ్నం 12:45 గంటల వరకూ పరీక్షలు నిర్వహించనున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బం >>2






ఆదివారం చంద్రబాబు సమక్షంలో హడ్కో -సిఆర్డీఏ మధ్య ఒప్పందం చేసుకుంటున్న దృశ్యం

# అమరావతికి రూ. 11వేల కోట్లు

>> పనులు వేగవంతంగా ముందుకు అడుగులు పడుతున్నాయన్నారు. అమరావతి నిర్మాణ పనులకు హడ్కో సహకారం నిలవడం, రూ.1100 కోట్లు రుణంగా అందించనుండటంతో ఎంతో సంతోషదాయమన్నారు. ఇప్పటికే అమరావతి నిర్మాణపనులు చేపట్టామన్నారు. 73 పనులకు సిఆర్‌డిఎ నుంచి అనుమతి తీసుకున్నామని మరో 19 పనులు పెండింగ్‌లో ఉండగా వాటికి త్వరలో టెండర్లు పిలుస్తామని మంత్రి వెల్లడించారు. 31 సంస్థలకు ఇచ్చిన భూముల కేటాయింపునకు సిఆర్‌డిఎ అనుమతి వచ్చిందని, ఇంకో రెండు సంస్థలకు కేటాయించిన భూములను మార్చినట్లు తెలిపారు.అమరావతి నిర్మాణ పనులకు ప్రజాధనం ఖర్చు పెట్టదని స్పష్టం చేశారు. రూ.64 వేల కోట్ల పనులకు ప్రభుత్వం ఏమీ ఖర్చు పెట్టదని వివిధ రకాల ఆదాయ మార్గాల ద్వారా అమరావతి పనులు జరుగుతాయని వెల్లడించారు.

# ఎమ్మెల్యేల క్రీడాపోటీలు

>> ఏర్పాట్లను శాప్, వీఎంసీ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. మున్సిపల్ స్టేడియంలో నిర్వహించే క్రికెట్, వాలీబాల్, టెన్ని కాయిట్, త్రోబాల్, టెన్నిస్, కబడ్డీ, థగ్‌ఆఫ్‌వార్, అథ్లెటిక్స్ 100 మీటర్ల కోర్టులను పరిశీలించారు.ఇండోర్ స్టేడియంలో నిర్వహించే షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ కోర్టులను తనిఖీ చేశారు.క్రీడల నిర్వహణపై అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారన్నారని, ఆయన అధికారులకు తెలియజేశారు. ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చక్కని ఏర్పాట్లతో సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారని తెలిపారు. శాప్, వీఎంసీ అధికారులు సమన్వయం చేసుకుని ఏర్పాట్లను పూర్తి చేయాలని రవినాయుడు వారికి పలు సూచనలు చేశారు.

# రోదసిలో ఉన్నందుకు అదనపుభత్యాలు అతితక్కువే!

## సునీతా విలియమ్స్, బుచ్‌విల్మోర్లకు ఫెడరల్ ఉద్యోగుల జీతాలే...!



**న్యూయార్క్ మార్చి 16:** అంతరాతీయ అంతరిక్ష కేంద్రా నికి ఎనిమిది రోజుల పర్యటనకు వెళ్లిన సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లు సుమారు తొమ్మిదినెలలు అక్కడే గడిపిన సంగతి తెలిసిందే. సుదీర్ఘకాలం అంతరిక్షంలోనే ఉండిపోయి నందుకు నాసా వీరికి అదనపు చెల్లింపులు చేస్తుందా అన్న అంశం ఆసక్తికరంగా ఉంది. అంతరిక్షంలో నిర్దేశిత సమయం కంటే ఎక్కువకాలం పనిచేసిన ఈ వ్యోమగాములకు అదనంగా ఎలాంటి చెల్లింపులు ఉండవని నాసా విశ్రాంత వ్యోమగామి క్యాడీకోల్‌మాన్ అన్నారు. ఫెడరల్ ఉద్యోగులు కావడంతో అంతరిక్షంలో ఉన్నా భూమ్మీద పర్యటనచేసినట్లుగానే పరిగణిస్తామన్నారు. సాధారణజీతంతోపాటు ఐఎస్ఎస్‌లో ఆహారం, బస ఖర్చులు నాసా భర్తిస్తుంది. అదనంగా రోజుకు నాలుగు డాలర్లు మాత్రమే ఇస్తారు. 2010-11 మిషన్‌లోభాగంగా 159 రోజులుఐఎస్ఎస్‌లో ఉన్న తనకు మొత్తంగా 636 డాలర్లు అదనంగా వచ్చిందన్నారు. ఇదే లెక్కన సునీతా విలియమ్స్, బుచ్‌విల్మోర్‌లకు తొమ్మిదినెలలకుగాను 1100 డాలర్లు అంటే భారతీయ కరెన్సీలో సుమారు లక్షమాత్రమే అదనంగా పొందే అవకాశం ఉంది. నాసా ఉద్యోగులకు అమెరికా ప్రభుత్వ ఉద్యోగుల జీతాలే ఉంటాయి. వ్యోమగాములకు జనరల్‌షెడ్యూల్ జిఎస్13, జిఎస్15 కింద చెల్లింపులు ఉంటాయి. వీరిద్దరికి అత్యధిక గ్రేడ్ జిఎస్15 గ్రేడ్‌పే జీతం అందుకుంటున్నారు. వార్షిక వేతనం 1,24,133 డాలర్లనుంచి 1,62,672 డాలర్లుగా ఉంది. అంటే రూ.1.08 కోట్లనుంచి రూ.1.41 కోట్లవరకూ ఉంటుందని అంచనా. సుదీర్ఘకాలం రోదసిలో గడిపిన వీరిద్దరూ ఎట్టకేలకు ఈనెల 20వ తేదీకల్లా భూమిమీదకు తిరిగివచ్చేందుకు స్పేస్‌ఎక్స్ రాకెట్‌ను అంతరిక్షంలోకి పంపించిన సంగతి తెలిసిందే.



ఆదివారం న్యూఢిల్లీలో భారత్, న్యూజిలాండ్ ప్రతినిధులు సమావేశమైన దృశ్యం

# దేశాభివృద్ధికి అన్ని పార్టీలు ముందుకు రావాలి

## బిజెపి జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా



**విజయవాడ మార్చి 16 ప్రభాతవార్త ప్రతినిధి:** జమిలి ఎన్నికలు అన్ని విధాలుగా అందరికీ మేలన్న విషయం గ్రహించాలని బిజెపి జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా హితవు పలికారు. సోషల్ మీడియా ఇన్ఫ్లెలెన్సర్స్ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని షెహజాద్ పూనావాలా ప్రసంగించారు. విజయవాడ నక్షత్ర హోటల్లో జరిగిన సమావేశంలో పూనావాలా మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి దేశానికి ఒకే ఎన్నిక ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. రాజకీయపార్టీలకు కూడా ఎంతో మేలు అన్నారు. వృధా కు కళ్ళెం వేసి ప్రగతి కి బీజం పడుతుందన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నిక కొత్త కాదు స్వాతంత్రం వచ్చిన తరువాత మూడు పర్యాయాలు దేశమంతా ఒకేసారి ఎన్నికలు జరిగాయి. స్వీడన్ తో సహా పలు దేశాల్లో ఒకేసారి ఎన్నికలు జరుగుతున్నాయి. 1983లో ఎన్నికల కమిషన్ వన్ నేషన్ వన్ ఎలక్షన్ ప్రతిపాదన లు తీసుకొచ్చిన విషయాన్ని ఆయన వివరించారు ఆ తర్వాత సుమారు ఆరు నివేదికలు జాతీయ స్థాయిలో ఒకే సారి ఎన్నికలను నిర్వహించాలని ప్రతి పాదనలు వస్తే ఎందుకు ఎవరూ విభేదించలేదని ఆయన ప్రశ్నించారు. దేశాభివృద్ధి విషయం లో రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు ఈ విషయంలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తమిళనాడు ప్రభుత్వం హిందీ భాష వివాదం విషయంలో సోషల్ మీడియా సభ్యులు ప్రశ్నలకు సమాధానం గా షెహజాద్ పూనావాలా మాట్లాడుతూ స్టాలిన్ కేవలం రాజకీయ పరమైన విమర్శలు చేస్తున్నారు. స్టాలిన్ పేరు రష్యా స్థానికతను సూచిస్తుందని తమిళిసై, అన్నామలై పేర్లు తమిళనాడు స్థానికతను సూచిస్తుందని చెబుతూ కాంగ్రెస్‌తో అంటకాగుతున్న డిఎంకె కేవలం హిందీ విషయాన్ని రాజకీయం చేస్తుందన్నారు. 2011లో హిందీ భాష పైన వేసి నా కమిటీ పై కరుణానిధి సమర్థత తెలియచేస్తే తాజాగా స్టాలిన్ అభ్యంతరం ఎలా తెలియ చేస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ నిర్ణయం తీసుకున్నప్పుడు డిఎంకె చెవులు మూసుకుని ఇప్పుడు అరిస్తే లాభం ఏంటని ప్రశ్నించారు. 2010లో రూపీ సింబల్ తమిళనాడుకు చెందిన వ్యక్తి రూపొందించిన విషయం స్టాలిన్ మరిచారు అంటూ విమర్శలు వర్షం కురిపించారు. అతిథిలను బిజెపి సోషల్ మీడియా ఇంఛార్జి సంజయ్ ఆహ్వానించారు.సభకు సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ అడుసుమిల్లి కేశవ్ కాంత్ అధ్యక్షత వహించారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ రాష్ట్ర కన్వీనర్ వేటుకూరి సూర్య నారాయణ రాజు,కో కన్వీనర్ నాగోతు రమేష్ నాయుడు, రాజకీయ విశ్లేషకులు దుగ్గరాజు శ్రీ నివాస్, బిజెపి రాష్ట్ర మీడియా ఇంఛార్జి పాతూరి నాగభూషణం, బిజెపి అధికార ప్రతినిధి యామినీ శర్మ, సోషల్ మీడియా కో కన్వీనర్ లు సతీష్ కొత్త, అభిలాష్ గుండెపల్లి, భరత్ కేంజోల్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సోషల్ మీడియా ఇన్ఫ్లెలెన్సర్స్ హాజరయ్యారు.

# నేటి నుండి టెన్త్ పరీక్షలు

>> దులూ కలగకుండా కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించారు. అలాగే మాస్ కాపీయింగ్ వంటివి జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. తొలిసారి ఏడు పేపర్ల విధానంలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. సామాన్యశాస్త్రంలో భౌతిక, రసాయనశాస్త్రాలు కలిపి ఒక పేపర్‌గా జీవశాస్త్రం మరో పేపర్‌గా ఎగ్జామ్ నిర్వహించనున్నారు. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు ఇవి జరగనున్నాయి. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఏపీఎస్‌ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు ఆర్టీసీ పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ సర్వీసుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు అధికారులు వీలు కల్పించారు. కేవలం హాల్ టికెట్ ఉంటే చాలని స్పష్టం చేశారు. సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారులతో మాట్లాడి, వివిధ మార్గాల్లో విద్యార్థుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపేలా ఏర్పాట్లు చేయాలని ఆర్టీసీ యాజమాన్యం అధికారులను ఆదేశించింది.

వాట్సప్ ద్వారా హాల్ టికెట్లు

ఇప్పటికే పదో తరగతి పరీక్షల హాల్ టికెట్లు విడుదలయ్యాయి. విద్యార్థులు ప్రభుత్వ వాట్సప్ సర్వీస్ నెంబర్ 9552300009 ద్వారా హాల్ టికెట్లను డౌన్ లోడ్ చేసుకోవచ్చు. విద్యార్థులు ఆ నెంబర్‌కి ఫోన్ ద్వారా హాయ్ అని వాట్సప్‌లో మెసేజ్ చేస్తే, సేవను ఎంచుకోండి అని ఒక లింక్ వస్తుంది. ఆ లింక్‌పై క్లిక్ చేసిన తరువాత సేవల లిస్ట్‌లో మనకు అవసరమైన విద్య సేవలు అనే ఆప్షన్‌ను సెలక్ట్ చేసుకుని, ఎస్ఎస్‌సీ హాల్ టికెట్ అనే ఆప్షన్‌పై క్లిక్ చేస్తే, విద్యార్థి అప్లికేషన్ నెంబర్ లేదా గుర్తింపు సంఖ్యతో పాటు డేట్ ఆఫ్ బర్త్ ఎంటర్ చేయాలి. వాటిని ఎంటర్ చేసిన తరువాత స్ట్రీమ్‌ను ఎంచుకోవాలి. అందులో రెగ్యులర్, ప్రైవేట్, ఓఎస్ఎస్‌సీ రెగ్యులర్, ఓఎస్ఎస్‌సీ ప్రైవేట్, ఒకేషనల్ అనే పలు ఆప్షన్లు కనిపిస్తాయి. అందులో మీరు రెగ్యులర్ అయితే దానిని సెలక్ట్ చేసుకుని నిర్ధారించాలి. వివరాలు ఎంటర్ చేయగానే కొద్ది నిమిషాల్లోనే వాట్సప్‌కు మీ హాల్‌టికెట్ వస్తుంది. హాల్ టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ప్రింట్ తీసుకుంటే సరిపోతుంది.

**టెన్త్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు విద్యాశాఖ మంత్రి లోకేశ్ శుభాకాంక్షలు**

పదవ తరగతి రాస్తున్న విద్యార్దులకు రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు తెలిపారు.విద్యార్దులు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. సకాలంలో ఎగ్జామ్ సెంటర్స్ చేరుకోవాలని పేర్కొన్నారు. సమయాన్ని సద్వినియోగం చేసుకొని పరీక్షలు పూర్తి చేయాలని లోకేశ్ వివరించారు.ప్రతి ఉన్నత పాఠశాలలోను విద్యార్దులు నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధిస్తారనే ఆశాభావం వ్యక్తం చేసారు.ఎలాంటి ఒత్తిడికీ గురి కాకుండా ఎగ్జామ్స్ రాయాలని సూచించారు. సంవత్సరం పాటు పడిన కష్టానికి సరైన ప్రతిఫలం వచ్చే సమయం ఇదేనని అన్నారు. ప్రశాంతంగా ఉండాలని, పరీక్ష కేంద్రాల్లో సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని లోకేశ్ చెప్పారు. సమయాన్ని వృథా కాకుండా టైమ్ మేనేజ్మెంట్ చేయాలని, సకాలంలో అన్ని ప్రశ్నలకూ సమాధానాలు రాసేలా దాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కేంద్రాల్లో ఇప్పటికే అన్నీ సౌకర్యాలు కల్పించామని, ఎండాకాలం నేపథ్యంలో మంచినీరు సహా ఇతర సౌకర్యాలు కల్పించినట్లు మంత్రి లోకేశ్ తెలిపారు.

**సమయానికి పరీక్షా కేంద్రాలు చేరుకోవాలి: మంత్రి మండిపల్లి**

పదవ తరగతి పబ్లిక్ ఎగ్జామ్స్ రాస్తున్న విద్యార్దులకు రవాణాశాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. పరీక్షా కేంద్రానికి సమయానికి చేరుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు పదవ తరగతి విద్యార్దులకు ఉచితంగా ఆర్టీసి బస్సుల ప్రయాణ సదుపాయం ఏర్పాటు చేశాం. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ముందుగా చేరుకో వాలి. విద్యార్థులు జయప్రదంగా పదో తరగతి పరీక్షలు రాయాలి. తల్లితండ్రుల ఆశలు నెరవేర్చే దిశగా అడుగులు వేస్తూ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలి.

# ఎపి పబ్లిక్ సర్వీసెస్ డెలివరీ గ్యారంటీ రూల్స్‌ను సవరిస్తూ నోటిఫికేషన్ జారీ

**విజయవాడ,మార్చి 16,ప్రభాతవార్త ప్రతినిధి:** స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా ఎపి పబ్లిక్ సర్వీసెస్ డెలివరీ గ్యారంటీ రూల్స్‌ను సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్‌ను జారీ చేసింది. 2018లో తీసుకొచ్చిన ఎపి పబ్లిక్ సర్వీసెస్ డెలివరీ గ్యారంటీ రూల్స్‌ను సవరిస్తున్నట్లు పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ నోటిఫికేషన్‌ను జారీ చేశారు. లిఫ్టులు, ఎస్కలేటర్ల ఉత్పత్తి,ఏర్పాటు లైసెనుసలను 15-21 రోజుల్లోగా జారీ చేసేలా సర్వీస్ డెలివరీ గ్యారంటీ రూల్స్‌లో మార్పులు చేస్తూ ఆదేశాలిచ్చారు. పారిశ్రామిక,వాణిజ్య నిర్మాణాల్లో వినియోగించే లిఫ్టులు,ఎస్కరేటర్ల ఉత్పత్తి,బిగింపు,లైసెన్సుల జారీ,రెన్యువల తదితర అనుమతుల కోసం ఈ సవరణ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ అంశానికి సంబంధించిన బిల్లును ఇటీవలే ఏపీ శాసన సభ కూడ ఆమోదించింది.

## వారం - వర్జ్యం

తేది : 17-03-2025, సోమవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, కృష్ణపక్షం,
తదియ రా.7.34
చిత్త మ.2.46
వర్జ్యం రా.9.05-10.54
దు.ము.12.49-1.37,
2) మ.3.14-4.01
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** బంధువుల నుండి ఆహ్వానాలు అందుకుంటారు. ఆర్థిక లాభాలు లాభసాటిగా సాగుతాయి.

**వృషభం:** పాతమిత్రులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు. సంఘంలో గౌరవం పొందుతారు.

**మిథునం:** పనులలో విజయం సాధిస్తారు. కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం.

**కర్కాటకం :** కుటుంబంలో చికాకులు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు. రుణబాధలు తప్పవు.

**సింహం:** ఆర్థిక ఇబ్బందులు ఎదురైన సమర్థవంతంగా ఎదురుకుంటారు. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం.

**కన్య :** పనులలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

**తుల :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం లభిస్తుంది.

**వృశ్చికం:** దూరప్రాంతాల నుండి వచ్చిన ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. నూతన మిత్రుల పరిచయాలు.

**ధనుస్సు:** ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. ఆకస్మిక ప్రయాణాలు.

**మకరం:** సోదరుల నుండి శుభవార్తలు అందుకుంటారు. నూతన వస్తువులు కొనుగోలు చేస్తారు.

**కుంభం:** శుభకార్యాలలో చురుకుగా పాల్గొంటారు. రుణవత్తిడులు తొలగుతాయి.

**మీనం :** కుటుంబసమస్యల నుండి బయటపడతారు. పాతమిత్రుల నుండి శుభవార్తలు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 2047కు ఎపి నం.1

>> ప్రజల్లో ప్రగాఢమైన ఆత్మాభిమానం వచ్చింది. పొట్టి శ్రీరాములు1901 మార్చి 16న మద్రాసులో పుట్టారు. పుట్టింది మద్రాసులోనైనా వారి కుటుంబం మొదట నెల్లూరులోనే ఉంది. ఏ భాష మాట్లాడేవారిని ఆ భాష వారే పాలించుకునే అవకాశం రావాలని పొట్టి శ్రీరాములు కోరుకున్నారు. తెలుగు భాష మాట్లాడేవారికి ప్రత్యేకంగా ఒక రాష్ట్రం కావాలని పోరాడి ఆత్మార్పణ చేశారు. ఆయన పోరాటం చేసే సమయంలో ప్రజలు పెద్దగా ముందుకురాలేదు. ఆ సమయంలో కేంద్రం కూడా దిగిరాలేదు. అయినా 58 రోజుల పాటు కఠోర దీక్షచేసి 1952 డిసెంబర్ 15న ఆత్మబలిదానం చేశారు. పొట్టిశ్రీరాములు చనిపోయిన తర్వాత ప్రజల్లో ఆగ్రహావేశాలు రేకెత్తాయి. దీంతో ప్రత్యేక రాష్ట్రం ఇస్తున్నామని 1952 డిసెంబర్ 19న పార్లమెంట్‌లో నెహ్రూ ప్రకటించారు. 1953 అక్టోబర్ 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయనున్నట్లు ఆ ఏడాది మార్చి 25న నాటి ప్రధాని నెహ్రూ ప్రకటించారు. అక్టోబర్ 1న ఆంధ్రరాష్ట్రం స్వపరిపాలనలోకి వచ్చింది. తర్వాత తెలంగాణలో కలిసిపోవడం, మళ్లీ 2014లో రెండు రాష్ట్రాలుగా విడిపోడం జరిగిపోయింది. అందుకే ఆయన ఆత్మబలిదానంను డిసెంబర్ 15ను ఘనంగా నిర్వహించాం అని సిఎం అన్నారు. కర్నూలుతో ప్రారంభమైన తెలుగు రాష్ట్రం.. పెద్ద మనుషుల ఒప్పందంతో కలిశారని తెలిపారు. ఆ తర్వాత హైదరాబాద్‌ను రాజధానిగా మార్చగా.. 11ఏళ్ల క్రితం జూన్ 2వ తేదీన మళ్లీ ఎపి విభజన జరిగిందని గుర్తుచేశారు. ఎపి ఏర్పాటుకు చాలా తేదీలు వచ్చినా.. డిసెంబర్ 15వ తేదీన పొట్టి శ్రీరాములు ఆత్మ బలిదానం చేసిన రోజు కాబట్టి.. ఆరోజునే పొట్టి శ్రీరాములను మనం స్మరించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. పొట్టి శ్రీరాములు త్యాగాలను నేటి తరానికి తెలియ చెప్పేలా కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. జనం కోసం, తెలుగు జాతి కోసం బతికిన వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అని సీఎం చంద్రబాబు ఉద్ఘాటించారు. నెల్లూరు జిల్లాకు ఆయన పేరు కూడా మేమే పెట్టాం. ఆయన త్యాగానికి స్ఫూర్తిగా రాజధాని అమరావతిలో 58 అడుగుల విగ్రహం ఏర్పాటు చేస్తాం. ఏడాది లోపు పార్కు కూడా ఒకటి నిర్మాణం చేసి ప్రారంభిస్తాం. ఎంతోమంది పుట్టినా.. కొందరే చరిత్రలో మిగిలిపోతారు.. తెలుగువారి చరిత్ర ఉన్నంతవరకు పొట్టి శ్రీరాములు గుర్తుంటారు. ఆయన కృషి వల్ల భాషా ప్రయుక్త రాష్ట్రాలకు నాంది పలికింది. తెలుగు భాష మాట్లాడేవారికి ఒక రాష్ట్రం కావాలని భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ చేసుకున్నారు. పొట్టి శ్రీరాములు జయంతి ఉత్సవాలను ఈ ఏడాది మొత్తం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈరోజు నుంచి ప్రారంభమయ్యే ఈ ఉత్సవాలు ఏడాది పాటు చేసిన తర్వాత వచ్చే మార్చికి ముగింపు సభ పెడతాం అని సిఎం చంద్రబాబు వెల్లడించారు.

పొట్టి శ్రీరాములు వంటి తాగ్యధనుల స్ఫూర్తిగా వారి గౌరవాన్ని నిలిపే విధంగా తమ ప్రభుత్వ పాలన జరుగుతుందన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి విధ్వంసాన్ని గురైన రాష్ట్రాన్ని పునర్ నిర్మిస్తున్నామన్నారు.అన్ని వ్యవస్థలను గాడిలో పెడుతున్నామన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక తలసరి ఆదాయం పెరిగిందని చెప్పారు. అవకాశాలిస్తే ప్రతి ఒక్కరూ మెరుగైన సేవలు అందిస్తారని అన్నారు. 2047 నాటికి స్వర్ణాంధ్ర కలను సాకారం చేస్తామని వెల్లడించారు. ప్రతినెలా 1వ తేదీనే ఇంటికి వెళ్లి పింఛన్లు అందిస్తున్నామని, పేద విద్యార్థులకు ఉపకారవేతనాలు అందిస్తున్నామని అన్నారు. విద్య, వైద్యం, మౌలికవసతులపై ప్రత్యేక దృష్టి సారించామన్న ముఖ్యమంత్రి. బిసి వర్గాలు సమాజానికి వెన్నెముక అని వారికోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. స్థానికసంస్థలు, నామినేటెడ్ పోస్టుల్లో బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు కేటాయించినట్లు గుర్తు చేశారు. తలసరి ఆదాయం కూడా రూ.2.68 లక్షలకు పెరిగిందని, వ్యవసాయం, పరిశ్రమలు, సేవల రంగాలు వృద్ధి చెందాయని అన్నారు. ప్రతి వ్యక్తిలో ప్రతిభ ఉంటుందని, అవకాశమిస్తే బయటకు వస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు. తమ ప్రభుత్వం స్వర్ణాంధ్ర 2047 దిశగా వెళ్తోందని, సమాజ అభివృద్ధికి సంక్షేమం, అభివృద్ధి కలిసికట్టుగా వెళ్లాలని ముఖ్యమంత్రి సూచించారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉండాలనేదే తమ విధానమని స్పష్టంచేశారు. ఉమ్మడి రాష్ట్రంలోనే ఐటీ విప్లవానికి సిఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారని కొనియాడారు. అమెరికాలోని ప్రవాస తెలుగువాళ్ల తలసరి ఆదాయం ఎక్కువని తెలిపారు. ప్రస్తుతం ఎపి మరో విప్లవానికి నాయకత్వం వహిస్తోందని, పరిపాలన, పరిశ్రమలు, ఆర్థిక వృద్ధిలో ఏఐను వినియోగిస్తున్నామని చెప్పారు. రూ.2,488 కోట్ల ఆర్థికసంఘం గ్రాంట్‌తో స్థానిక పాలన బలోపేతం చేశామని గవర్నర్ నజీర్ తెలిపారు. పోలవరం, అమరావతి ప్రాజెక్టులను మళ్లీ పట్టాలెక్కించామని, విశాఖ ఉక్కు పరిరక్షణ, రైల్వే జోన్ ఏర్పాటు హామీలు నెరవేర్చామని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. సుస్థిర వృద్ధికి దోహదపడే 22 కొత్త విధానాల ద్వారా బలమైన పునాది వేశామన్న ముఖ్యమంత్రి. గూగుల్, ఆర్సెలర్ మిట్టల్, టాటా పవర్ కంపెనీలను ఆకర్షించినట్లు తెలిపారు. గ్రీన్‌కో గ్రూప్, బిపిసిఎల్, టిసిఎస్ కంపెనీలను ఆకర్షించామని, ఇన్వెస్టర్లు ఇప్పటివరకు రూ.6.5 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టినట్లు వెల్లడించారు. ఆయా పెట్టుబడుల ద్వారా 4 లక్షల మందికి ఉపాధి అవకాశాలు పెరిగాయని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ రూ.16 లక్షల కోట్లకు విస్తరించిందని అన్నారు. ఈ రోజుకు,అమరజీవి 125వ జయంతి వేడుకల్లోకి అడుగుపెట్టాం. వచ్చే ఏడాది మార్చి 16 వరకు ప్రతినెలా ఒకటి చొప్పున 12 రకాల కార్యక్రమాలు చేపడతాం. అప్పటికి 125వ జయంతి ఉత్సవాలు పూర్తవుతాయి. ఈ ఉగాది నుంచి పి4 విధానాన్ని అమలు చేస్తున్నాం. ఇది జయప్రదం చేస్తే సమాజంలో సుస్థిరత ఉంటుంది. పెద్దపెద్ద భవనాలు కడుతున్నాం.... కానీ పక్కనే ఉన్నవారికి కనీసం ఇల్లు కూడా ఉండటం లేదు. అందరం సమానంగానే పుడతాం. కానీ చదువుకుని కొందరు అవకాశాలు ఉపయోగించుకుని ఇంకొందరు ఊహించని స్థాయికి వెళ్లిపోతారు. ఊర్లో ఉండేవారు అక్కడే ఉండిపోతారు. అందుకే పేదలను పైకి తీసుకురావాలి. రాబోయే 5 ఏళ్లలో పేదరిక నిర్మూలనకు ప్రతివ్యక్తి జీవన ప్రమాణాలను పెంచేందుకు ఇబ్బందిలేకుండా ప్రభుత్వం చొరవ తీసుకుంటుంది. వైశ్యుల్లోనూ పేదలు ఉన్నారు. సమాజహితం కోసం అందరూ పని చేయాలి. పొట్టి శ్రీరాములు స్ఫూర్తిని మనం ముందుకు తీసుకెళ్లాలి. తెలుగు రాష్ట్రం కోసం ఆయన ఆత్మబలిదానం చేశారు. కనీసం తెలుగుజాతి కోసం మీరు పదిమందిని పైకి తీసుకురావాలి... పదిమందికి ఆయన త్యాగాలను వివరించి స్ఫూర్తి రావాలి, అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగూరు నారాయణ, ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ పారేపల్లి (డూండీ) రాకేష్, వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారు.



ఆదివారంపొట్టిశ్రీరాములు జయంతి సందర్భంగా కరీంనగర్‌లో ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

# తెలుగు వర్సిటీకి పేరు మార్పెందుకు?

## పొట్టి శ్రీరాములు గొప్ప దేశభక్తుడు

## ఆయన పేరు తొలగింపు అవమానించడమే

## కాంగ్రెస్ తీరుపై కేంద్రమంత్రి బండిసంజయ్ ఆగ్రహం

**కరీంనగర్,మార్చి 16, ప్రభాతవార్త:** పొట్టి శ్రీరాములు పేరిటనున్న తెలుగు విశ్వవిద్యాలయానికి ఆ పేరును తొలగిస్తూ అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టడంపట్ల కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పొట్టిశ్రీరాములు గొప్ప దేశభక్తుడు, గాంధేయవాది, స్వాతంత్ర్య సమరయోధుడు, ఆర్యవైశ్యుల ఆరాధ్య నేత అని కొనియాడారు. అట్లాంటి గొప్ప నేత పేరును మార్చాల్సిన అవసరం ఏముందని మండిపడ్డారు. 'సురవరం ప్రతాపరెడ్డి అంటే మాకు గౌరవముంది. తెలుగు భాష ఉన్నతికి కృషి చేశారు. తెలుగు భాషాభివృద్ధికి ప్రభుత్వం చేసే కార్యక్రమాలకు ఆయన పేరును పెట్టుకుంటే అభ్యంతరంలేదు. కానీ పొట్టి శ్రీరాములు తొలగించి అవమానించడం కరెక్ట్ కాదు'అన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని కరీంనగర్ పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి ఆయన నివాళులు అర్పించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును మార్చడంపట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తూ బండి సంజయ్ కు వినతి పత్రం అందజేశారు. సిపిఐ నాయకులు ప్రతిపాదిస్తే, సిఎం రేవంత్ రెడ్డి తన కులాభిమానంతోనే పొట్టి శ్రీరాములు పేరును తొలగించి సురవరం ప్రతాపరెడ్డి పేరును ప్రతిపాదించారని వాపోయారు. సిఎం తీరు దేశభక్తులు, స్వాతంత్ర్య సమరయోధులతోపాటు ఆర్యవైశ్యుల మనోభావాలను దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. బండి సంజయ్ మాట్లాడుతూ 'పొట్టి శ్రీరాములంటే... ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకోసం ఆమరణ నిరాహారదీక్ష ప్రాణాలర్పించిన అమరజీవి మాత్రమే కాదు..గొప్ప దేశభక్తుడ న్నారు. "పొట్టి శ్రీరాములు లాంటోళ్లు నావద్ద 10 మంది ఉంటే చాలు,ఎప్పుడో భారతదేశానికి స్వాతంత్ర్యం తెచ్చేటోడిని"అని మహాత్మాగాంధీ బహిరంగంగానే చెప్పారంటే ఆయన ఎంత గొప్పవాడో అర్థం చేసుకోవాలని తెలిపారు. అట్లాంటి మహనీయుడు పేరును తొలగించి తీరని అవమానం చేయడమేంది?"అని మండిపడ్డారు.ప్రత్యేక రాష్ట్రంకోసం ఆమరణ దీక్షచేసిన పొట్టి శ్రీరాము లును కూడా పిచ్చివాడిగా ముద్ర వేయాలని చూసిందన్నారు.

ఆంధ్రా మూలాలు న్నాయని పొట్టి శ్రీరాములు పేరును తొలగించిన కాంగ్రెస్ ప్రభుత్వం,ఎన్టీఆర్ పార్క్‌కు ఆయన పేరును తొలగించే దమ్ముందా? కాసు బ్రహ్మానందరెడ్డి, నీలం సంజీవరెడ్డి పేరిట ఉన్న పార్కులకు వాళ్ల పేర్లను తొలగించే దమ్ముందా? అంతేందుకు ట్యాంక్ బండ్ పై అనేక మంది ఆంధ్రుల విగ్రహా లున్నాయన్నారు. వాటిని కూడా తొలగిస్తారా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన తప్పిదాలను సరిదిద్దుకుని పొట్టి శ్రీరామలు పేరును యధాతథంగా తెలుగు విశ్వవిద్యాలయానికి కొనసాగించాలని డిమాండ్ చేశారు.

**VIJAYAWADA MUNICIPAL CORPORATION**
E Procurement Notice No.45/VMC/CDB/2024-25, Dt.15-03-2025
Roads, Drain, Culvert, repairs, Fire Fighting System, Summer Action plan works(Total 108 works)-Est. Amount Rs.1939.56 Lakhs.
All rights are reserved to the Commissioner to Cancel or Reject the tenders without assigning any reasons there of
Further details and any corrigendum can be seen@www.tender.apeprocurement.gov.in.
S/d-
For COMMISSIONER

# వైకుంఠం క్యూలైన్లలో భక్తులకు సాఫీగా అనుమతి

**తిరుమల,మార్చి 16ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో వైకుంఠమ్ క్యూలైన్ల ద్వారా ఆలయంలోనికి భక్తులను అనుమతిస్తున్న విధానం బావుందని, ఆలయంలోపల తోపులాట లేకుండా చూస్తుండటం సిబ్బంది పనితీరు పట్ల హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, తొక్కిసలాటఘటన న్యాయవిచారణ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ సత్యనారాయణమూర్తి సదభిప్రాయం వ్యక్తమైంది. మహద్వారం గేట్ వద్ద భక్తులను నియంత్రించి,రద్దీని కట్టడిచేస్తూ ఆలయంలోపలకు సామాన్యభక్తులను అనుమతించే విధానం ఆదివారం ఆయన పరిశీలించారు. కొంతసమయం మహద్వారం వద్ద, అనంతరం ధ్వజస్తంభం, వెండివాకిలివద్ద నిరీక్షించి భక్తుల క్యూలైన్ నిర్వహణ ప్రత్యేకంగా పరిశీలించారు. ఏమాత్రం తోపులాటకు తావులేకుండా సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ భక్తులను లోనికి అనుమతించడం గమనించారు. కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనంకోసం వస్తున్న వేలాదిమందిభక్తులను ఆలయంలోనికి అనుమతించి,క్యూలైన్లలో పంపుతున్న విధానం, దర్శనమ్ చేయిస్తున్న తీరు బావుందని జస్టిస్ సత్యనారాయణమూర్తి అభిప్రాయం వ్యక్తం చేశారు. తిరుమలలో భక్తుల క్యూలైన్ల నిర్వహణ, వైకుంతమ్ కంపార్టుమెంట్లలో నిరీక్షణ, నిరంతరాయంగా సిసికెమెరాల ద్వారా పర్యవేక్షణ ,సాఫీగా దర్శనమ్ చేసుకుంటున్నారా అనే అంశాలపై రెండురోజుల పరిశీలనలో బాగంగా ఆదివారం ఉదయం కూడా ఆలయంలోపల క్యూలైన్లను ఆయన తనిఖీ చేశారు. లక్షమందికిపైగా భక్తులు తిరుమలకు చేరుకున్నా టిటిడి అనుసరిస్తున్న విధానం, సౌకర్యాల కల్పనపై నివేదికలను ప్రభు త్వానికి అందజే యనున్నారు. ఇక సోమవారం (నేడు)తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లోని ఆయన ప్రత్యేక

- ఆలయం లోపల క్యూలైన్ల నిర్వహణ బావుంది
- తిరుమలలో జస్టిస్ సత్యనారాయణ మూర్తి పరిశీలన



ఛాంబర్‌లో జనవరి 8వతేదీ రాత్రి చోటుచేసుకున్న తొక్కిసలాట, తోపులాట ఘటనకు కారణాలపై, బందోబస్తు సిబ్బంది నిర్లక్ష్యం, భక్తులకు సౌకర్యాలు తదితర అంశాలపై టిటిడి ఇఒ,తిరుపతి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, అదనపు ఎస్పీలు, కొందరు ప్రత్యక్ష సాక్షులైన బాధిత భక్తులను తుదివిచారణ చేయనున్నారు. ఈ విచారణలో ఆయన గత రెండు రోజులు గమనించిన విషయాలపై సమాధానాలు రాబట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రమైన వైకుంఠద్వార దర్శనాలకు జనవరి 8వతేదీ రమ్మని లక్షలాదిమంది భక్తులను పిలిచి తొక్కిసలాట ఘటనకు కారణాలపై న్యాయవిచారణ సాగుతున్న విషయం తెలిసిందే. ఈ విచారణలో రెండు విడతలుగా అనేక కోణాల్లో పలు అంశాలపై సమాధానాలు రాబట్టారు. ఇప్పుడు తిరుపతిలో ఘటనకు మరింతమంది బాధ్యులె వరనేది ఆయన నివేదికలో ప్రభుత్వానికి అందజేస్తే తదుపరి పోలీసుశాఖ, రెవెన్యూ, విజిలెన్స్,టిటిడి ఉద్యోగులపై వేటు పడే సూచనలు ఉన్నాయి. తిరుపతి టిటిడి జెఇఒ , జిల్లా కలెక్టర్, తిరుపతిలో అదనపు ఎస్పీలపై వేటు పడే సూచనలు లేకపోలేదనేది సమాచారం. జనవరిలో వైకుంఠ ద్వార దర్శనాలకు 24గంటలు ముందుగానే తిరుపతికి చేరుకున్న తెలుగురాష్ట్రాలు, తమిళనాడు, కర్నాటక, కేరళ, మహారాష్ట్ర, ఒరిస్సా ప్రాంతాల భక్తులకు అవసరమైన మేరకు కొన్ని కేంద్రాల్లో సరైన ఏర్పాట్లుపై, సౌకర్యాల కల్పనలో టిటిడి, పోలీసు,జిల్లాయంత్రాంగం ఘోరవైఫల్యం చెంది ఆరుగురు ప్రాణాలు బలికి బాధ్యులనేది నిర్ధారణకు వచ్చారు. తొక్కిసలాట ఘటనపై నారాయణవనం, బాలాయపల్లి తాశీల్దార్లు ఫిర్యాదు మేరకు పోలీసు కేసులు నమోదైన విషయం విదితమే. జనవరి 9వతేదీనే టిటిడి జెఇఒ గౌతమి, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, ఈస్టు డిఎస్పీ వెంకటనారాయణపై బదిలీ వేటు వేయగా తిరుపతి క్రైమ్ డిఎస్పీ రమణకుమార్, ఎస్వీగోశాల డైరెక్టర్ డాక్టర్ హరనాధరెడ్డిని సస్పెన్షన్ చేసిన సంగతి తెలిసిందే. ఇంకా ఈ ఘటనలో కొందరు సిఐలు, ఎస్ఐలు, పోలీసులపై ఇప్పుడు తాజాగా వేటుపడే సూచనలు ఉన్నాయి. ఈ కేసులపై సమగ్ర విచారణలో భాగంగా నేడు తుదిదశ విచారణ జరగనుంది.

## రంజాన్ ఉపవాసదీక్షలు: ఇఫ్తార్ విందులు

**శ్రీకాళహస్తి,మార్చి 16 ప్రభాతవార్త** ముస్లింలు పవిత్రంగా భావించి ఆచరించే రంజాన్ మాసం కొనసాగుతుంది. ఈ మాసంలో ఒక దానానికి 70రెట్లు పుణ్యం అదనంగా



జామియా మస్‌జిద్‌లో ఇప్తార్ విందు దృశ్యం

వస్తుందని చెబుతారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో హిందూ ముస్లింలు పరస్పరం సహాకరించుకుంటూ అన్నద మ్ముల్లా జీవనం గడుపుతున్నారు. ఆదివారం జామియా మస్‌జిద్ ముతవల్లి తనకల్ అక్రం సాహెబ్ వందలాది ముస్లింలకు 'ఇఫ్తార్ విందు' ఏర్పాటు చేసారు. మసీదులోనే వంటలు చేసి చక్కటి చికెన్ బిరియాని అందించారు. ఈ దివ్యక్షేత్రంలో రంజాన్‌మాసంలో ముస్లిం లకు ఇఫ్తార్ విందు ఇచ్చే సత్ సంప్రదాయాన్ని 1995 లో అప్పటి శాసన సభ్యుడు బొజ్జల గోపాల కృష్ణారెడ్డి ప్రారం భించారు. ఆయన పుణ్య క్షేత్రంలో అన్ని మతాల వారు అన్న దమ్ముల్లా మెలగాలనే లక్ష్యంతో ఈ కార్యక్ర మానికి శ్రీకారం చుట్టారు. గత ఏడాది ఆయన తనయుడు ప్రస్తుత శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన తన మత సామరస్యాన్ని చాటుకున్నారు. శ్రీకాళ హస్తిలో 22 మసీదులున్నాయి. రంజాన్ మాసంలో మసీదులు కిట కిట లాడు తాయి.ఈ నేపథ్యంలో ప్రతి మసీదులోనూ సాయం త్రం ఉపవాసదీక్షలు విరమణ సందర్భంగా ఆష్ అనే పదార్థాన్ని అందిస్తారు. సులభంగా జీర్ణమయ్యే ఈ పిండి పదార్థాని ప్రతి మసీదులోనూ అందిస్తారు. ఇందుకు ఆయా కమీటీలు ప్రణాళికా బద్ధంగా ఆచరిస్తారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కూడా మసీదులు కిట కిట లాడు తున్నాయి. ఆదివారం జామియా మస్‌జిద్ లో ముతవల్లి తనకల్ అక్రమ్‌సాహెబ్ 'ఇస్తార్' విందును ఏర్పాటు చేసారు. అంతేకాక మసీదు వద్దకు వచ్చిన వారికి కుల మతాలతో సంబంధం లేకుండా బిరియాని పాకెట్లను అందించారు. ముస్లిం అభివృద్ధిని కాంక్షించి శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి శాసనసభలో కూడా మసీదులు, ఈద్‌గాహ్‌ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు అందించాలని కోరారు. ఆయన స్వతహాగా ఈగుల గుంట ఈద్‌గాహ్ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించారు. అలాగే షాదీమహల్ మరమ్మత్తులకు నిధులు అందించారు.కార్యక్రమాల్లో మసీదు పేష్ ఇమాం హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్, మసీదు కమిటి పెద్దలు ఖలీల్ హుసేని,పఠాన్ నూరుల్లా ఖాన్ చాన్‌బాషా, అంజద్ సాహెబ్, తాజుద్దీన్, హమీద్, మౌజన్ సాహెబ్ మహబూబ్‌బాషా, ముస్లిం యువత సహాకరించారు.



భారీ ఉపగ్రహ ప్రయోగ వాహక నౌక ఎల్‌విఎం3-ఎం5లో ఉపయోగించే క్రయోజనిక్ ఇంజన్ దశ

## అత్యంత భారీ రాకెట్ ఎల్‌విఎం3-ఎం5కు సరికొత్త క్రయోజనిక్ ఇంజిన్

**- మహేంద్రగిరి నుంచి శ్రీహరికోటకు తరలిస్తున్న ఇస్రో**

**శ్రీహరికోట (తడ), మార్చి 16 ప్రభాతవార్త** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఎప్పటికప్పుడు ఉపగ్రహ ప్రయోగాల కోసం రాకెట్ నిర్మాణాలను అభివృద్ధి చేస్తోంది. ఇప్పటిదాకా జిఎస్‌ఎల్‌వి మార్క్3 రాకెట్‌ను వివిధ రూపాల్లో అభివృద్ధి చేసి ఎక్కువ బరువు గల ఉపగ్రహాలను సతీష్‌ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ప్రయోగించారు. ఇప్పుడు ఎల్‌విఎం3ని 5వ ఆపరేషనల్ మిషన్ కోసం మరింత అభివృద్ధి చేశారు. ఎల్‌విఎం3-ఎం5 పేరుతో భారీ రాకెట్ ప్రయోగం శ్రీహరికోట నుంచి జరుపుతున్నారు. మహేంద్రగిరిలోని ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్ నుంచి శ్రీహరికోటలోని రాకెట్ ప్రయోగ వేదికకు ఈ దశ ఇంజన్‌ను తరలిస్తున్నారు. ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ ఆధ్వర్యంలో ఐపిఆర్‌సి డైరెక్టర్ ఎ.భాగ్యరాజ్, ఎల్‌పిఎస్‌సి డైరెక్టర్ ఎం.మోహన్, షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్‌లు మహేంద్రగిరిలో జెండా ఊపి ఈ కార్యక్రమానికి శ్రీకారంచుట్టారు. మహేంద్రగిరిలోని ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో రూపొందించిన ఈ కీలక దశ ఎన్‌ఎస్‌ఐఎల్ మరియు ఎఎస్‌టి అండ్ సైన్స్ ఎల్‌ఎల్‌పి మధ్య వారి బ్లూబర్డ్ బ్లాక్2 ఉపగ్రహాన్ని ప్రయోగించడానికి ఉపయోగిస్తారు. ఇప్పటికే ఇందుకోసం వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఈ ఇంజన్ రాకెట్‌లోని క్రయోజనిక్ అప్పర్ స్టేజిలో ఉపయోగిస్తారు. 28.5 టన్నుల ఇంధనాన్ని నింపి రాకెట్ ప్రయోగ సమయంలో అతిపెద్ద ఉపగ్రహాలను వడివడిగా అంతరిక్షంలోకి మోసుకెళ్లడానికి ఉపయోగపడుతుంది.

## డ్రోన్ సిటీగా ఓర్వకల్

**సర్వీస్ సెక్టార్‌గా డ్రోన్, అభివృద్ధి చేసేందుకు టెండర్లు పిలిచిన ఎపిడిసి**



**రాజంపేట అర్బన్ మార్చి 16 ప్రభాతవార్త** దేశంలోనే ప్రప్రథమంగా రాష్ట్రంలోని కర్నూలు జిల్లా ఓర్వకల్లో డ్రోన్ సిటీ ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గత ఎడాది అక్టోబర్ 22 22న విజయవాడ పున్నమి ఘాట్లో నిర్వహించిన రెండు రోజుల డ్రోన్స్ సమ్మిట్ విజయవంతం నేపథ్యంలో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ తో దేశమంతా రాష్ట్రం వైపు చూసేలా చేసింది. అదే వేగంతో దేశంలో డ్రోన్స్ హబ్ గా ఓర్వకల్లును తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఒక అడుగు ముందుకు వేసింది. అందులో భాగంగా ఓర్వకల్ ను డ్రోన్ సిటీగా అభివృద్ధి చేయాలని ఆసక్తి గల సంస్థలు ప్రతిపాదనలు అందించాలని ఏపీ డ్రోన్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ టెండర్లను ఆ హ్వా నించింది. సర్వీస్ రంగంలోకి డ్రోన్ ను తీసుకువచ్చేందుకు నిర్ణయించింది. వివిధ రంగాల్లో డ్రోన్ సేవలను విస్తరించేందుకు టారిఫ్ కూడా సిద్ధం చేయాలని టెండర్లలో పేర్కొంది. సుమారు 5500 డ్రోన్లను ఒకే చోట ఎగురవేసి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్ సృష్టించిన ఆంధ్రప్రదేశ్ మరోసారి 300 ఎకరాల్లో డ్రోన్ సిటీని డెవలప్ చేసేందుకు నిర్ణయించింది. తద్వారా కనీసం 35,000 మందిని డ్రోన్ పైలెట్స్ గా శిక్షణ ఇచ్చి సిద్ధం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. సమ్మిట్ లో ముఖ్యమంత్రి ప్రకటించారు.



## పురమిత్ర యాప్‌తో గుడ్ గవర్నెన్స్

**- సిఎం చంద్రబాబు నాయుడు**

**విజయవాడ మార్చి 16 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏఐ సాంకేతికతతో రూపొందించిన పురమిత్ర యాప్‌ను ఏపీ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు "ఎక్స్" వేదికగా వెల్లడించారు.. ఈ యాప్ పట్టణ సేవలను ఫోన్‌లోనే అందించి, పౌరులకు స్మార్ట్ అర్బన్ గుడ్ గవర్నెన్స్ అనుభవాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. నీటి సరఫరా టౌన్ ప్లానింగ్ ఆస్తిపన్ను పురపాలక ఇంజినీరింగ్ వీధి దీపాలు ప్రజారోగ్యం, పరిశుభ్రత వంటి సమస్యలపై ఫిర్యాదులను ఈ యాప్‌లో అందించవచ్చు. ఆ ఫిర్యాదులు సంబంధిత అధికారుల దగ్గరకు వెళ్లిన తర్వాత నిర్దిష్ట సమయంలో పరిష్కరిస్తారు. సమస్య పరిష్కారమైంది, ఏ స్థాయిలో ఉందనేది తెలుస్తుంది.

## వేద వర్సిటీలో దక్షిణాది రాష్ట్రాల వేద సమ్మేళనం

**తిరుపతి విద్య మార్చి 16 ప్రభాత వార్త** భారత కేంద్ర ప్రభుత్వ పరిధిలో కల మహర్షి సాందీపని రాష్ట్రీయ వేద విద్యా ప్రతిష్ఠానం, శిక్షణా మంత్రాలయ సంస్థ ఉజ్జయిని వారు, శ్రీ వేంకటేశ్వర వేద వర్సిటీ తిరుపతి వారి సంయుక్త ఆధ్వర్యంలో రేపటి నుండి మూడు రోజులపాటు ప్రతిష్ఠాత్మకంగా దక్షిణ భారత వేద సమ్మేళనం వేద విశ్వవిద్యాలయ ప్రాంగణంలో జరగనున్నది. సోమవారం ఉదయం 8 గంటలకు వేదపండితులు వేదవిద్యార్థుల శోభా యాత్రతో కార్యక్రమం ప్రారంభం కానున్నది అనంతరం వేద విశ్వవిద్యాలయ కులపతులు ఆచార్య రాణీ సదాశివమూర్తి అధ్యక్షతన ఉదయం 10 గంటలకు జరగనున్న ప్రారంభ సమావేశానికి ముఖ్యాతిథులుగా కంచి కామకోటి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి అనుగ్రహ భాషణం అంతర్జాల మాధ్యమం ద్వారాజరుగుతుంది. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం కులపతులు ఆచార్య జి.ఎస్.ఆర్.కృష్ణమూర్తి, ఉజ్జయినికి చెందిన మహర్షి సాందీపని రాష్ట్రీయ వేద విద్యా ప్రతిష్ఠానం సెక్రటరీ ఆచార్య విరూపాక్ష జడ్డీపాల్, ఆం.ప్ర. బయోడైవర్సిటీ బోర్డ్ ఛైర్మన్ ఎన్.విజయకుమార్ పాల్గొన నున్నారు. ఈ మూడు రోజులలో ఆంధ్ర,కర్ణాటక,కేరళ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రముల నుండి సుప్రసిద్ధులైన వేద విద్వాంసులచే ఎనిమిది వేదశాఖలకు సంబంధించిన వేదమంత్రములను పఠనం చేయుట,వాటి వైశిష్ట్యమును వివరించుట, వేద, శాస్త్రాలలో నిష్ణాతులైన పండితులతో ప్రసంగములు, ప్రసిద్ధ కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి అని అన్నారు.ముగింపు సమావేశానికి అతిథులుగా కంచికి చెందిన చంద్రశేఖరేంద్ర విశ్వ విద్యాలయ కులపతులు జి.శ్రీనివాస్, జి.భానుప్రకాష్ రెడ్డి పాల్గొననున్నారు.

## పవన్ భాజపా స్క్రిప్టు చదివారు

**- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ**

**విజయవాడ మార్చి 16 ప్రభాతవార్త ప్రతినిధి:** జనసేన ఆవిర్భావ సభలో ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ప్రసంగం బిజెపి స్క్రిప్టులా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. త్రిభాషా విధానం అమలు చేయడాన్ని ఎవరూ వ్యతిరేకించడం లేదు. కానీ బలవంతంగా హిందీ భాషను రుద్దడాన్ని వ్యతిరేకిస్తున్నారు. దీన్ని గమనించకుండా పవన్‌కల్యాణ్ భారతీయజనతా పార్టీ నేతలా మాట్లాడటం తగదు అని అన్నారు. ఆయన సైద్ధాంతిక విలువలు ఎంటీ,ఆయన పార్టీ ఇజం ఏమిటనే పరిస్థితులపై స్వయం స్పష్టతను కలిగి ఉండాలన్నారు.

## రైల్వే మెకానికల్ సిబ్బంది యూనిఫారం మార్పు

**- జూలై నుంచి వర్తింపు - ఆదేశాలు జారీ చేసిన రైల్వే బోర్డు**

**గుంతకల్లు రైల్వే,మార్చి 16,ప్రభాతవార్త** రైల్వేలో అత్యంత ప్రధానమైన యాంత్రిక (మెకానికల్) విభాగంలో కీలకమైన బోగీలు, వాగన్ల మరమత్తుల నిర్వహణ (సిఅండ్‌డబ్ల్యూ) విభాగం సిబ్బంది యూనిఫామ్ కలర్‌ను మార్పు చేస్తూ రైల్వే బోర్డు యాజమాన్యం(సంక్షేమం) విభాగం డిప్యూటీ సంచాలకులు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాది జూలై1 నుంచి దేశవ్యాప్తంగా అమలులోకి రానున్న ఈ నూతన విధానంలో రైల్వే యాంత్రిక(మెకానికల్) క్యారేజ్ అండ్ వాగన్(సిఅండ్‌డబ్ల్యూ) విభాగంలో పనిచేస్తున్న సిబ్బందికి స్కైబ్లూ కలర్ షర్ట్, నేవీ బ్లూ కలర్ ప్యాంటులను యూనిఫాంగా నిర్ణయించింది. నూతన యూనిఫాం కొనుగోలుకు సంబంధించిన అలవెన్సును సదరు విభాగం సిబ్బంది జూలై వేతనంలో జమ చేయనున్నట్లు రైల్వే బోర్డు తన ఆదేశాల్లో పేర్కొంది.

# తిరుమల సమాచారం

## రాజధాని అమరావతిలో శ్రీనివాస కల్యాణం విజయవంతం



**తిరుమల,మార్చి 16ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి సమీపంలో వెంకటపాళెంలో ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఉత్స వమూర్తులతో శ్రీనివాసకల్యాణం అంగరంగవైభవంగా జరిపించడం, పూర్తిస్థాయిలో విజయవంతం చేయడంతో టిటిడి అధికారులు, పాలకమండలి ఆనందం వ్యక్తం చేసింది. అందుకు అవసరమైన పూర్తిస్థాయి ఏర్పాట్లు తిరుమల,తిరుపతి నుండి ఆలయ అర్చకులు, టిటిడి అధికారులు, ఉద్యోగులు ఏకంగా పదిరోజులు అక్కడే ఉండి స్వయంగా ఏర్పాట్లుచేయడంలో తలమునకలయ్యారు. సాధారణంగా దేశవిదేశాల్లోనూ శ్రీనివాసకల్యాణాలు టిటిడి అక్కడి నిర్వాహకుల సహకారంతో,సహాయంతోజరిపించడం జరుగుతుంది. అయితే అందుకు భిన్నంగా రాజధాని నగరం అమరావతినే కేంద్రంగా చేసుకుని శనివారం నిర్వహించిన శ్రీనివాసకల్యాణం అద్భుతఘట్టం ఆ ప్రాంతంలోని అనేక మండలాల ప్రజలతోబాటు రాజధానికి భూములిచ్చిన రైతులకు తగిన మర్యాదలతో ఆహ్వానించి , ప్రభుత్వం నుండి గవర్నర్, ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజాప్రతినిదులు, ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధులను సాదరంగా స్వాగతించి మరీ కల్యాణవేడుకలు సంతోషంగా వీక్షించేలా చూడటంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలదీక్షితులు, వందలసంఖ్యలో ఉద్యోగులు, శ్రీవారిసేవకులు ఇలా ఒకరేమిటి అందరూ సమిష్టిగా సమన్వయంతో సేవలందించడంతో 30వేలమంది భక్తులకు శ్రీనివాసకల్యాణం భాగ్యం కల్పించారు. ప్రతి భక్తుడు భక్తితో తన్మయత్వం చెందారు. భక్తులందరికీ దేవుని లడ్డూప్రసాదం,తాగునీరు. అన్నప్రసాదాలు, ఇతరత్రా ఆహారపదార్థాలు సకాలంలో అందించి అందరినీ సంతృప్తిపరచడమంటే మాటల్లో చెప్పలేనిదికాదు. మరీ స్వయంగా ఛైర్మన్ బిఆర్‌నాయుడు, బోర్డు సభ్యులు, ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ వెంకయ్యచౌదరి స్వీయ పర్యవేక్షణ, ఏర్పాట్లులో నిమగ్నమవ్వడంతో అంతా సవ్యంగా జరిగిపోయింది. ఆదివారం టిటిడి అధికారులు, ఉద్యోగులు తిరుపతికి చేరుకుని తమతమ అనుభూతి వ్యక్తం చేశారు. 30వేలమంది భక్తులు ఒకచోట చేరి ప్రశాంతంగా ఏడుకొండలస్వామి కల్యాణం వీక్షించేలా సౌకర్యాలు కల్పించి,భక్తుల పరవశం వెనుక కృషిచేసిన పోలీసు,టిటిడి,విజిలెన్స్,శ్రీవారిసేవకులు, ఆలయం ఉద్యోగుల పనితీరును ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ వెంకయ్యచౌదరి ప్రత్యేకంగా అభినందించారు. అమరావతిలో చిన్నపాటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ,పూర్తి స్థాయిలో భద్రత, అన్నప్రసాదాల పంపిణీ తదితర సేవలందించి భక్తుల మన్ననలు అందుకున్నామన్నారు.

## రూ.44లక్షలు విరాళమిస్తే దాతపేరున అన్నప్రసాదాలు వడ్డింపు



**ప్రభాతవార్తప్రతినిధి -తిరుమల:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థమ్ తిరుమలకు వస్తున్న లక్షలాదిమంది భక్తులకు రుచిగా, శుచిగా అన్నప్రసాదాలు వడ్డించేందుకు దాతలకు అవకాశం కల్పించారు. ఈ పథకం క్రింద దాత ఒకరోజుకు 44లక్షలు రూపాయలు విరాళాలిస్తే దాత స్వయంగా వచ్చి వడ్డించే అవకాశమేగాక దాత పేరు ప్రదర్శన చేస్తారు. తిరుమలకొండపై భక్తులు ఆకలి అనేది తెలియకుండా అక్షయపాత్రలా వచ్చిన ప్రతి ఒక్క భక్తుడికి రుచిగా అన్నప్రసాదాలు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం భవనంలోనేగాక మరికొన్ని ప్రాంతాల్లో అన్నప్రసాదాలు అందిస్తున్నారు. ఇందుకుగాను ఒకరోజు విరాళ పథకం ప్రారంభించి, ఉదయం అల్పాహారం కోసం 10లక్షలు రూపాయలు, మధ్యాహ్నం భోజనం కోసం 17లక్షలు, రాత్రి భోజనం కోసం 17లక్షలు రూపాయలు అందించి దాతలు స్వయంగా భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించవచ్చు. అన్నప్రసాద భవనంలో ఉదయం 8.30గంటల నుండి 10.30గంటల వరకు చట్నీతో కలిపి ఉప్మా, పొంగళి, సేమ్యా ఉప్మా అందిస్తారు. ఉదయం 11గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు ,తిరిగి సాయంత్రం 5గంటల నుండి రాత్రి 11.30గంటల వరకు చక్కెరపొంగలి, చట్నీ,అన్నం, కూర,సాంబారు,రసం,మసాలవడ మజ్జిగతో భక్తులకు వడ్డిస్తున్నారు. ఎస్వీఅన్నప్రసాదం ట్రస్ట్‌కు విరాళాలు కూడా 2,200 కోట్ల రూపాయలకు చేరిన విషయం విదితమే. ఈ ఆదాయంపై వచ్చే వడ్డీతోనే ఇప్పుడు ఎంతో నాణ్యతతో,రుచిగా అన్నప్రసాదాలు భక్తులకు వడ్డిస్తున్నారు. రోజుకు లక్షమందివరకు భక్తులు అన్నప్రసాదాలను భక్తితో స్వీకరిస్తున్నారు.

## అందరికీ శుభాలు కలగాలి: ప్రముఖులు



**తిరుమల,మార్చి 16ప్రభాత వార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలుగు ప్రజలకు శుభాలు కలగాలని వేడుకున్నట్లు ప్రముఖులు తెలిపారు. ఆదివారం ఉదయం తిరుమలేశుని చెన్నై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భవానీ సుబ్రమణ్యం, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ, పంచాయతిరాజ: కమిషనర్ కృష్ణతేజ వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు శ్రీవారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. దేవుని దర్శనం సంతోషంగా జరిగిందన్నారు.

## కూల్‌పెయింట్‌తో ఎండవేడి నుండి ఉపశమనం



**తిరుమల,మార్చి 16ప్రభాతవార్తప్రతినిధి:** వేసవి కాలం అరంభంలోనే శేషాచలంకొండల్లోని సప్తగిరులపై సూర్యుని ప్రతాపం భగభగలకు భక్తులు విలవిల్లాడిపోతున్నారు. సాధారణంగా తిరుమలకొండపై వేసవికాలంలోనూ భిన్నంగా వాతావరణం ఉంటుంది. అలాంటిది గత నాలుగేళ్ళుగా తిరుపతి ఉష్ణోగ్రతలు తిరుమలలోనూ నమోదవుతుండటం పర్యావరణ కాలుష్యం కారణంగా శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. మార్చి రెండవవారంలోనే సూర్యుని వేడి తిరుమలపై తీవ్రంగా చూపుతోంది. 40డిగ్రీలు ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతుండటంతో భక్తులకు ఎండవేడి నుంచి ఉపశమనానికి తిరుమల తిరుపతి దేవస్థానం గత పదిరోజుల నుండి రోజువారీగా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఆలయం ముందుభాగం, పరిసరాల్లో ,ఆలయ మాఢవీధుల్లో తెల్లని కూల్‌పెయింట్ వేసి భక్తులు నడిచేలా చూస్తున్నారు. ఇంకా కొన్నిచోట్ల కార్పెట్లు పరచి ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు తరచూ నీళ్ళట్యాంకర్ల పైపులతో నీటిని చల్లుతున్నారు. తిరుమలలో ఆలయం పరిసరాల్లో, మాఢవీధుల్లో భక్తులు, సిబ్బంది, ఉద్యోగులు పాదరక్షలు ధరించరు. ఇప్పుడు గదుల నుండి స్వామివారి దర్శనానికి వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్ చేరుకునే ముందు భక్తులు పాదరక్షలు లేకుండానే రావలసి ఉంది. ఆలయం వెలుపలకు వచ్చిన సమయంలోనూ ఆలయం ముందు, అఖిలాండం వద్ద, బేడి ఆంజనేయస్వామి ఆలయం పరిసరాల్లో పాదరక్షలు ధరించడానికి లేదు. ఇక్కడ భక్తులు పాదరక్షలు లేకుండా నడుస్తుండటంతో పాదాలు ఎండకు చుర్రుమంటున్నాయి. దీంతో భక్తులకు వేడి తెలియకుండా ప్రశాంతంగా ఉండేలా ఆలయం ముందు ఇంకా ఎక్కువగా కూల్‌పెయింట్ వేస్తున్నారు. నీటిని చల్లుతుండటంతో కొంత చల్లదనం కలిగిస్తున్నారు.ఇంకా రానున్న ఏప్రిల్, మేనెలలో వేసవిసెలవుల రద్దీ, భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉండటంతో భక్తులు సేదదీరేందుకు వీలుగా తాతాల్కిక చలువపందిళ్ళు ఏర్పాటుచేశారు. తిరుమలేశుని దర్శనానంతరం ఆలయం వెలుపలకు వచ్చిన భక్తులు ముఖ్యంగా మహిళలు, చంటిపిల్లల తల్లులు, వృద్ధులు పరుగులు తీస్తున్నారు. ఆలయం పరిసరాల్లో పూర్తిగా ఎండవేడిమినుంచి ఉపశమనం కలిగించేలా చూస్తుండటంతో భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వార్త


దుఃఖం అనేది శిక్ష కాదు. సంతోషం అనేది వరముకాదు. రెండూ ఫలితాలే. అవీ మన చర్యలననుసరించి మాత్రమే.

-ఆర్‌జి ఇంగర్సాల్

# పుతిన్ విఘాతం!

ఏళ్లతరబడి కొనసాగుతున్న ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర ఒక కొలిక్కి వస్తున్నదని భావిస్తున్న తరుణంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ చేసిన హెచ్చరికలు చర్చలను బేఖాతరు చేసి నట్లు కనిపిస్తోంది. రష్యా పశ్చిమప్రాంతంలోని కర్స్క్ ప్రాంతంలో సాగుతున్న ఉక్రెయిన్ సేనలు ఆక్రమించుకోవడమే పుతిన్‌చేసిన హెచ్చరికలకు కారణమని తెలియంది కాదు. వెంటనే ఆయుధాలతో లొంగిపోవాలని లేకుంటే మీ ప్రాణాలకు నేను గ్యారంటీ ఇవ్వలేనని పుతిన్ బహిరంగంగానే చెప్పారంటే శాంతి చర్చలకు ప్రయత్నిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ విజ్ఞప్తులన్నింటినీ బేఖాతరుచేసినట్లే. ఇప్పటికే అమెరికా అండతో సతమతం అవుతున్న రష్యా, ఉక్రెయిన్‌పై ఆయుధాలగాల దాడులుచేసి స్వాధీనం చేసుకోవాలనే తపన పుతిన్‌లో కనిపిస్తోంది. ఓ పక్క జెడ్డాలో అమెరికా, ఉక్రెయిన్ ప్రతినిధుల చర్చల్లో 30రోజుల తాత్కాలిక విరమణకు ఉక్రెయిన్‌ను ఒప్పించడం వంటివి జరిగాయి. ఇదే చర్చల సారాంశాన్ని పుతిన్‌కు చేరవేసేందుకు అమెరికా ప్రతినిధుబృందం కూడా ప్రయత్నాలు చేసింది. ఈలోపే లొంగిపోవాలి. లేదంటే ప్రాణాల దక్కవు అంటూ ఉక్రెయిన్ సేనలకు పుతిన్ హెచ్చరికలు చేయడం చూస్తుంటే చర్చలకు ఏ మాత్రం అంగీకరించనట్లుగానే కనిపిస్తోంది. వాస్తవానికి ట్రంప్ పాలనాపగ్గాలు చేపట్టిన వెంటనే పుతిన్‌తో సుదీర్ఘ సంభాషణ కొనసాగించారు. యుద్ధాన్ని తానే ముగిస్తానని రెండుదేశాలను ఇందుకు ఒప్పిస్తానని ప్రకటించిన ట్రంప్ ఉక్రెయిన్‌పట్ల ఆశలు రేకెత్తించారు. అందుకు తగినట్లుగానే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని శ్వేతసౌధానికి ఆహ్వానించడం ఆపై చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడి ఉక్రెయిన్ అధ్యక్షుడు అర్ధాంతరంగానే వైట్‌హౌస్ వీడివెళ్లి పోవడం వంటివి జరిగాయి. ఉక్రెయిన్‌లో ఉన్న అపారమైన ఖనిజవనరులు తప్పకుండే ఒప్పందంపై సంతకం చేయాలని అమెరికా పట్టుబడితే యుద్ధం ముగిసిన తర్వాత భవిష్యత్తులో రష్యా దాడులకు పాల్పడితే అమెరికా రక్షణసాయం అందించాలని జెలెన్‌స్కీ చేసిన డిమాండ్‌తో అగ్రరాజ్యం అధ్యక్షుడికి విపరీత ఆగ్రహం రప్పించింది. యుద్ధానికి కారణం నువ్వేనని, ఉక్రెయిన్ పౌరుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నావంటూ జెలెన్‌స్కీపై మండిపడినప్పటికీ ఆ చర్చల్లో తన దేశ ఆత్మగౌరవాన్ని, సార్వభౌమత్వాన్ని చాటిచెప్పే విధంగా జెలెన్‌స్కీ వ్యవహరించారని యూరోప్ దేశాలు ప్రశంసించాయి. ఇవన్నీ పక్కనపెడితే తాజాగా పుతిన్‌చేసిన హెచ్చరికలు ఇప్పుడు అమెరికాను సైతం ఆలోచనలో పడేసే విధంగాఉన్నాయి. చర్చలకు ఎంతమాత్రం సుముఖంగా రష్యాలేదన్నట్టుస్పష్టం అయింది. యుద్ధం కొనసాగించాలన్న లక్ష్యంతోనే ఉన్నట్లు తెలుస్తోంది. ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడుగా వచ్చిన తర్వాత ఈపరిస్థితులన్నీ తారుమారయ్యాయి. పుతిన్‌తో తనకు మంచి సంబంధాలున్నాయని, తనకు మంచి మిత్రుడని సన్నాయి నొక్కులు నొక్కుతూ చర్చలకు ఉపక్రమించినా పుతిన్‌వైఖరి చూస్తుంటే ఎంతమాత్రం అంగీకరించనట్లుగానే ఉంది. 30రోజులపాటు తాత్కాలికంగా కాల్పుల విరమణ పాటించాలి. భూభాగపరంగా, వైమానికదాడులు, జలవనరుల మీదుగా దాడులు అన్నిరకాల ప్రయోగాలను ఈ30రోజుల్లోను నిలిపివేయాలి. ఆ తర్వాత శాశ్వతప్రాతిపదికన శాంతిస్థాపనకోసం అమెరికా మధ్యవర్తిత్వంతో మళ్లీ చర్చల పునరుద్ధరణ జరుగుతుంది.అన్నీ సజావుగా సాగుతున్నాయని భావిస్తున్న తరుణంలోనే ఉక్రెయిన్ సేనలు వైదొలగకుంటే ప్రాణాలతో ఉండరంటూ చేసిన హెచ్చరికలు అటు అమెరికాతోపాటు ఇటు యూరోపియన్ దేశాలను కూడా సందిగ్ధంలో పడేసాయి. మరో పక్క అమెరికా అధ్యక్షుడు ఇచ్చిన శాంతిచర్చల పిలుపును స్వాగతిస్తున్నామని చెప్తూనే ద్వంద్వ వైఖరిని చూపించారు. యుద్ధంలో ఉక్రెయిన్ పరిస్థితి దారుణంగా ఉందని, కీవ్ సేనలను అన్నివైపుల నుంచి రష్యా దళాలు చుట్టుముట్టాయని ట్రంప్ చెప్పారు. అందుకే ఉక్రెయిన్ సైనికులపై కనికరం చూపాలని తాను పుతిన్‌కు సూచించానని, లేనిపక్షంలో రెండోప్రపంచ యుద్ధం తర్వాతజరిగే అతిదారుణమైన ఊచకోతగా మిగిలిపోతుందని ట్రంప్ అంచనా వేసారు.కాల్పుల విరమణకు సంబంధించి రష్యా నుంచి సానుకూల సంకేతాలు వస్తున్నాయని, యుద్ధం త్వరలోనే ముగించగలమన్న ధీమా తనకు ఉందంటూ అమెరికాఅధ్యక్షుడు ప్రకటించిన వెనువెంటనే కర్స్క్ వ్యవహారంలో పరిస్థితి మొత్తం మళ్లీ మొదటికి వచ్చింది. అసలు పుతిన్ అంత బలంగా పట్టుబడుతున్నదానికి కారణాలు లేకపోలేదు. యూరోప్‌లో అతిపెద్ద విస్తీర్ణం కలిగిన దేశంగా ఉన్న ఉక్రెయిన్ 1991లో స్వాతంత్ర్యం ప్రకటించుకున్నప్పటి నుంచి ఆత్మనిర్భరంతో మెలుగుతోంది. ఆదేశంలో ఉన్నఅపారమైన ఖనిజవనరులపై అగ్రదేశాల కన్నుపడింది.లక్షలకోట్ల విలువైన ఖనిజవనరులపైనే అటు రష్యాఇటు అమెరికా అభిప్రాయపడిందని దేశాలైనా ఉక్రెయిన్‌పై సానుభూతి చూపిస్తున్నాయి. మానవతాదృక్పథం పోయింది. వాణిజ్యదృక్పథంతోనే ఇప్పుడు యుద్ధాన్ని విరమింపచేస్తే ఉక్రెయిన్‌లోని విలువైన ఖనిజవనరుల అన్వేషణపొందుపరచుకోవచ్చన్నది అగ్రరాజ్యాల వ్యూహం. ఉక్రెయిన్‌కు కూడా యుద్ధం కొనసాగించే ధోరణిలేదు. తమ ప్రజలంతా సుస్థిర శాంతిని కోరుకుంటున్నారని జెలెన్‌స్కీ చెప్తునే చెప్తుతున్నారు.ఈలోపు పుతిన్ ధోరణి చూస్తుంటే అసలు చర్చలకే అడ్డంకిఏర్పడినట్లు కనిపిస్తోంది. అగ్రరాజ్యాలు మేలుకుని విరమణకు అన్ని మార్గాలను అనుసరించి పుతిన్‌ను ఒప్పించటం ద్వారా ఉక్రెయిన్ మరుభూమిగా మిగిలిపోయే ప్రమాదం కూడా లేకపోలేదు.

సర్వ ప్రపంచాన్ని సైతం శాసిస్తూ మనిషి అసంతృప్తితో బాధపడతాడు. తనను తాను సంతోషంగా ఉంచుకోవడం చేతకాకపోతే.



సెనెకా

పూర్వీకుల ఘనత మీద బతికే వారిని మృతవీరుల జాబితాలో చేర్చవచ్చు.



లాసన్

# ప్రజావాక్కు



## ప్రజాస్వామ్యమా? సామ్యవాదమా!

రెండు తెలుగు రాష్ట్రాలలో ఎమ్.ఎల్.సి. ఎన్నికలు జరుగగా అధికార పార్టీవారి అభ్యర్థులదే పైచేయి అయింది. లెజిస్లేటివ్ కౌన్సిల్ రాజకీయ పునరావాసం కోసం ఉపయోగపడుతోందేకానీ ఎక్కువగా ప్రజాసమస్యలను ప్రతిబింబించేవిగా మాత్రం లేవనే విషయం లోకవిదితమే. దీనినిఉపయోగంలేని ఆరవవేలిగా అభివర్ణించారు. ఎన్.టి. రామారావు గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ కౌన్సిల్‌వల్ల డబ్బు దండగ, ఎందుకూ కొరగానిదని రద్దు చేసారు. ఆయన తరువాత వచ్చినవారు రాజకీయావసరాల కోసం మరల పునరుద్ధరించారు. ఈ ఎమ్‌ఎల్.సి.లు ప్రజల్లోతిరగరు. ప్రజలఅవసరాలు తెలుసుకునే అవసరం కూడా లేదు. జీతాలు,ఇతర రాబడులు ఇబ్బడి ముబ్బడిగా వస్తాయి.పెరుగుతాయి మధ్య, క్రిందితరగతుల వారికి సంక్షేమ పథకాలకు డబ్బు ఉండదు. ఇది ప్రజాస్వామ్యమా, సామ్యవాదమా లేక రాచరిక సామ్యమా?

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## ఉచిత బస్ పాసులు ఇవ్వండి!

తెలంగాణ రాష్ట్రంలోని బస్సులలో మహిళలకు ఆధార్ కార్డుతో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లుగానే వికలాంగులకు కూడా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలి. మహిళలకు ఉచిత బస్సుప్రయాణ సౌకర్యం వలన చాలా మేలు జరుగుతుంది.వికలాంగులకు కూడా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించినట్లయితే మహిళలవలె ఈ సౌకర్యం వికలాంగులకు ప్రయాణపరంగా ఎంతో మేలు కలుగుతుంది. ప్రస్తుతం వికలాంగుల మహిళలు ఉచిత ప్రయాణం చేస్తున్నారు. పురుష వికలాంగులు వివిధ పనుల నిమిత్తం వివిధ ప్రాంతాలకు ప్రయాణం చేయడం సులువు అవుతుంది.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ

## అంతం కాని అవినీతి

అవినీతిని అంతం చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన పార్టీలు అవినీతిని అంతం చేయలేకపోయాయి. పైగా ఆ పార్టీ నాయకులే అవినీతి కూపంలో కూరుకుపోయారు. అవినీతి పరులతో స్నేహం చేస్తూ వారినుంచి డబ్బులు తీసుకుంటున్నారు. ఎన్నికల సమయంలో ఆ డబ్బులను వినియోగిస్తూగొప్ప విజయాలు సాధిస్తున్నారు.

- పి.రాధాకృష్ణ, ధవళేశ్వరం

## మొబైల్ న్యాయవ్యవస్థ ఏర్పాటు చేయాలి

ప్రజలకు ధరణి తీసుకొచ్చి కుటుంబాలలో సమస్యలు సృష్టించి కుటుంబాలలో భూతగాదాలు ఆర్థిక ఆస్తితాగదాలతో అల్లరలతో హత్యలకు దారి తీస్తున్నది. మనం ప్రతిరోజు అనేక పత్రికలలో చదువుతున్నాం, టివిలలో చూస్తున్నాం. ప్రభుత్వం ఇప్పటికైన సమస్య లేని భూభారతి భూముల, ఆస్తుల, ఫ్యామిలీ, అల్లార్లు లేకుండా ఫ్యామిలీ సర్టిఫికెట్స్ ఆడకుండా హత్యలకు దారిలేని పరిష్కారం చూపాలి. ఇప్పుడు ప్రతి ప్రజానీకం కుటుంబంలో తాగదాలు లేని కుటుంబం లేదు.ప్రభుత్వం ప్రజలకు కావాల్సినవి కల్పించాలి. ఉచితాలు వద్దు, ఈ అల్లార్లతో గ్రామాలలో ఉచిత సంచార మొబైల్ న్యాయ వ్యవస్థను ఏర్పాటు చెయ్యాలి.

- సింగు. లక్ష్మీనారాయణ చింతకుంట, కరీంనగర్

## ఉపాధ్యాయులకే దండన

ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్నవిద్యార్థినీవిద్యార్థులు ప్రవర్తన సరిగా ఉండడం లేదని, హోంవర్కులు చేయడం లేదని, ఎలాంటిస్కిల్స్ నేర్చుకోలేకపోతున్నారని హెడ్మాస్టర్ బాధ్యతలు ఫుల్ ఎడిషనల్ చార్జిగా నిర్వహిస్తున్న ఒకఇంగ్లీష్ టీచర్, మరో ఇంగ్లీష్‌టీచర్ గుంజీలుతీస్తూ సాష్టాంగ నమస్కారాలు పెడుతూ ,బెల్టు ట్రీట్మెంట్లు తీసుకుంటూ తమను తాము బెత్తాలతో కొట్టుకుంటూ సోషల్‌మీడియా వీడియోలలో హల్చల్ చేశారు. విద్యాహక్కుచట్టాన్ని అందులో లోపాలను ఎత్తిచూపించారు.ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు పూరెస్ట్ ఆఫ్ ద పూర్అని, ఆర్థిక స్థితిగతులు రీత్యా వారిప్రవర్తన అనైతికంగా ఉంటున్నదని చెబుతూ ఉన్నారు. నేటి తరం విద్యార్థినీ విద్యార్థులు ఏదైనా నేర్చుకోగల సమర్థులే. వారిని సరియైన మార్గంలో నడపడానికి ఉపాధ్యాయులకు చిత్తశుద్ధి కావాలి.

-వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## పక్షుల దాహార్తిని తీర్చాలి

ప్రపంచంలో ఉన్న సమస్త జీవకోటికి నీరే ప్రాణాధారం. ప్రస్తుతం వేసవికాలం ప్రారంభమైంది.బయట ఎండలు మండుతున్నాయి. భూగర్భజలాలు అడుగంటిపోయాయి. అడవిలో ఉన్న పక్షులకి,అడవి జంతువులకి దాహంతీర్చుకోవడానికి అక్కడక్కడ ఉన్న నీటికుంటలు కూడా ఎండిపోయి ఎడారిని తలపిస్తోంది. ఫలితంగా అడవిజంతువులు,పక్షులు దహించుకుపోతున్నాయి. వాటిఉనికికే ప్రమాదంఏర్పడే అవకాశంఉంది.దహనం కాకుండా అటవీశాఖ తగు చర్యలు తీసుకొని అడవిని కాపాడాలి.

-జానగొండ్ల రాజు, ధర్మవరం

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)


# సభా గౌరవాన్ని కాపాడాలి

**సభా నాయకుడితో సహా అందరూ అదే భాషను ప్రయోగించటం చట్టసభల ఔనత్యాన్ని హుందాతనాన్ని దెబ్బతీస్తున్నాయి. సభలో చర్చలో పాల్గొంటున్న గౌరవ సభ్యుడు ఇతర సభ్యులను ఉద్దేశించి మూసుకొని కూర్చో అనే పదాలు వాడటం ఎంతవరకు సబబు. మరొక సభ్యుడు గవర్నర్‌ని ఉద్దేశించి పార్టీ కార్యకర్త ప్రసంగంలాగా ఉందనే విమర్శలు ఆహ్వానించదగినవి కావు. సభలో ఒక సభ్యుడు మాట్లాడుతున్నప్పుడు ఇతర సభ్యులు రన్నింగ్ కామెంట్రీ చేయటం అవహేళనగా మాట్లాడటం మంచిది కాదు. కాబట్టి సభలో ప్రజా సమస్యల పైన ప్రభుత్వ విధాన నిర్ణయాలపైన అర్థవంతమైన చర్చ జరగాలి లేకపోతే కోట్ల రూపాయల ప్రజాధనం వృధా అవటమేకాదు దేశానికి రాష్ట్రానికి మేలు జరగదనే విషయాన్ని పార్టీలు, ప్రభుత్వాలు, సభ్యులు గుర్తిస్తే ప్రజాస్వామ్య వ్యవస్థకి మంచిది. సభలో భవిష్యత్తులో అర్థవంతమైన చర్చ జరగాలని ఆశిద్దాం.**



డాక్టర్ తిరుణహరి శేషు

చట్టసభల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ఆయా సభలకు ఎన్నిక అవుతున్న సభ్యులపైనే ఉంటుంది. సభలో సభ్యులు వ్యవహరిస్తున్న తీరు, మాట్లాడుతున్న భాష, చర్చలలో పాల్గొంటున్న విధానంతో చట్టసభల గౌరవ మర్యాదలు కాపాడబడతాయి. గత కొంతకాలంగా కేంద్ర రాష్ట్ర స్థాయిలలో చట్టసభలలోగౌరవ సభ్యులు వ్యవహరిస్తున్న తీరు వారు మాట్లాడుతున్న భాష చూస్తుంటేసభా మర్యాదలు మంట గలిసిపోతున్నాయనే భావన వ్యక్తవుతుంది. లోక్‌సభ, రాజ్యసభ, శాసనసభ, శాసనమండలిలో ప్రజా సమస్యలపైన ప్రభుత్వాల విధాన నిర్ణయాల పైన అర్థవంతమైన చర్చలు జరగకపోవటం వలన చట్టసభల ఔన్నత్యం మసకబారిపోతుంది. చట్టసభలలో ప్రజలకి బాధ్యత వహించాల్సిన ప్రజాప్రతినిధులు వ్యక్తిగత విమర్శలకి, దూషణలకి దిగటం రాజకీయ విమర్శలకు ప్రాధాన్యత ఇవ్వటం పరిపాటిగా మారిపోయిన వ్యవహారాన్ని చూస్తున్నాం. ప్రజా కేంద్రంగా ప్రజల అజెండాగా సభలో పాలకపక్షం ప్రతిపక్షం వివిధ అంశాలపై చర్చ చేయాలి కానీ ఒకరిపై మరొకరు పైచేయి సాధించడానికి తప్పు ఒప్పులను ఎంచుకోవటానికి సభను వేదికగా మార్చుకుంటున్న వైనం సభా సంప్రదాయాలను మంటగలుపుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రసంగిస్తున్న సందర్భంలో మాజీ మంత్రి బిఆర్ఎస్ నాయకులు సూర్యాపేట శాసనసభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న గుంతకండ్ల జగదీశ్వర్ రెడ్డి స్పీకర్‌నీ ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు అసెంబ్లీలో తీవ్ర దుమారాన్ని లేపటమే కాదు సభ్యుడు సస్పెన్షన్‌కి దారితీసింది. స్పీకర్ సభాధ్యక్షులుని ఉద్దేశించి సభ్యుడు చేసిన వ్యాఖ్యలు "ఈ సభ మీ సొంతం కూడా కాదు' ఇలాంటి పదాలను అధికారపక్షం, స్పీకర్ తీవ్రంగా స్పందించటం సభ్యుడిపై చర్యలు చేపట్టాలని అధికారపక్షం ఒక అడుగు ముందుకేసి సభ్యుడి ప్రవర్తనని వ్యాఖ్యలను ఎథిక్స్ కమిటీకి పంపి సభ్యుడిని అనర్హుడుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కానీ స్పీకర్ సభ్యుడిని బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు సస్పెండ్ చేయటం జరిగింది. సభని నడిపే స్పీకర్‌కి రాజ్యాంగం విశేషాధికారాలను కట్టబెట్టింది. సభ్యుడు జగదీశ్వర్ రెడ్డి కూడా ప్రభుత్వ విధానాలపై విమర్శలకు పరిమితం అయితే బాగుండేది కానీ చైర్ నీ తన అధికారాలని ప్రశ్నించకుండా ఉంటే వివాదం తలెత్తేదికాదు. సభ్యుడు స్పీకర్‌ని ప్రశ్నించాడే కానీ అసభ్య పదజాలంతో




దూషించలేదు కాబట్టి సభ్యుడు పైన అనర్హత వేటు వేయాలనే డిమాండ్ అధికారపక్షం నుండి వచ్చినా స్పీకర్ సస్పెన్షన్ తోనే సరిపెట్టారు అనే విషయాన్ని గమనించాలి. సభకు సంబంధించి ఏ నిర్ణయమైనా తీసుకునే అధికారం స్పీకర్‌కి ఉంది. కానీ స్పీకర్ సభలో అందరి సభ్యులను పాలక, ప్రతిపక్షాలను సమన్వయం చేసుకుంటూ సభని హుందాగా నడిపించే బాధ్యత కూడా స్పీకర్‌దే.ఈ క్రమంలో స్పీకర్ సభ్యులపై చర్యల కంటే సభ్యుల హక్కులను సభా హక్కులను కాపాడటానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది. స్పీకర్ స్థానం అత్యంత గౌరవనీయమైనది ప్రతి సభ్యుడు స్పీకరిని సంభోదించేటప్పుడు అధ్యక్ష మహోదయ్ అనే సంబోధించాలి. సహజంగా సభలో అధికారపక్షం బలం అధికంగా ఉంటుంది. కాబట్టి ప్రతిపక్షం హక్కులను కాపాడాల్సిన బాధ్యత కూడా స్పీకర్‌పైనే ఉంటుంది. 2018 లో తెలంగాణ రాష్ట్ర శాసనసభలో నాటి ప్రతిపక్ష సభ్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి సంపత్ కుమార్‌లు స్పీకర్ పై దాడి చేశారనే ఆరోపణలతో వారి శాసనసభా సభ్యత్వాలను రద్దు చేయడం జరిగింది. ఒక సభ్యుడు ఉద్దేశపూర్వకంగాకాకుండా అన్యాపదేశంగా స్పీకర్‌ని ప్రశ్నిస్తే అతని సభ్యత్వాన్ని రద్దు చేయాలనే ప్రతిపాదన తోటి అధికారపక్ష సభ్యుల నుండి రావటం సభ సంప్రదాయాలకు మంచిది కాదు. అధికారపక్ష సభ్యుల డిమాండ్ మేరకు స్పీకర్ సభ్యుడిపై అనర్హత వేటు వేసి ఉంటే ఆ చర్య స్పీకర్ హోదా గౌరవానికి భంగం కలిగేది. అలాగే ప్రజల నుండి సభ్యుడికి సానుభూతి పెరిగే నేపథ్యంలో అనర్హత ఫలితంగా ఆ నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరిగితే ఆ నియోజకవర్గంలో అధికార పక్షానికి ప్రతికూల ఫలితంవస్తే రాజకీయ పరిణామాలు ఒక్కసారిగామారిపోతాయనే విషయాన్ని కూడా గమనించాలి. సభలో ఒక సభ్యుడు స్పీకర్‌నీ ప్రశ్నించాడనే కారణంతో అతని సభ్యత్వాన్ని రద్దుచేస్తే పార్టీ మారిన ఎమ్మెల్యేలు సభలో స్పీకర్ కళ్ల ముందే ఉంటే వారిపై చర్యలు చేపట్టకుండా ఉన్న స్పీకర్ వ్యవహార శైలిపై కూడా ప్రజలలో చర్చజరిగే అవకాశం లేకపోలేదు. స్పీకర్ పక్షపాతంతో వ్యవహరిస్తున్నారనే అపోహ కూడా ప్రజలలో కలిగే ప్రమాదం ఉంది.సభలో వివిధ అంశాలపై చర్చ సందర్భంగా సభ్యులు వాడుతున్న భాష పట్ల కూడా అభ్యంతరాలు వ్యక్తవుతున్నాయి. సభ గౌరవాన్ని కూడా తగ్గిస్తున్నాయి. సభా నాయకుడితో సహా అందరూ అదేభాషను ప్రయోగించటం చట్టసభల ఔనత్యాన్ని హుందాతనాన్ని దెబ్బతీస్తున్నాయి. సభలో చర్చలో పాల్గొంటున్న గౌరవ సభ్యుడు ఇతర సభ్యులను ఉద్దేశించి మూసుకొని కూర్చో అనే పదాలు వాడటం ఎంతవరకు సబబు. మరొక సభ్యుడు గవర్నర్‌ని ఉద్దేశించి పార్టీ కార్యకర్త ప్రసంగంలాగా ఉందనే విమర్శలు ఆహ్వానించదగినవి కావు. సభలో ఒక సభ్యుడు మాట్లాడుతున్నప్పుడు ఇతర సభ్యులు రన్నింగ్ కామెంట్రీ చేయటం అవహేళనగా మాట్లాడటం మంచిది కాదు. కాబట్టి సభలో ప్రజా సమస్యల పైన ప్రభుత్వ విధాన నిర్ణయాల పైన అర్థవంతమైన చర్చ జరగాలి లేకపోతే కోట్ల రూపాయల ప్రజాధనం వృధా అవటమేకాదు దేశానికి రాష్ట్రానికి మేలు జరగదనే విషయాన్ని పార్టీలు ప్రభుత్వాలు సభ్యులు గుర్తిస్తే ప్రజాస్వామ్య వ్యవస్థకి మంచిది. సభలో భవిష్యత్తులో అర్థవంతమైన చర్చజరగాలని ఆశిద్దాం. ●

# ప్రైవేట్ పాఠశాలల ఫీజు నియంత్రణకు చర్యలేవి?

అప్పన్న గొనప

ఇటీవలి సంవత్సరాలలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలలు, విద్యాసంస్థలు అధిక ఫీజు వసూలు చేస్తున్న విషయం ఆందోళనకరంగా మారింది. ఇటువంటి దుష్ప్రవర్తనను అరికట్టే లక్ష్యంతో నిర్మాణాత్మక ఫీజు వ్యవస్థను అమలు చేయడానికి ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ, పాఠశాలలు నిర్దేశించిన పరిమితుల కంటే ఎక్కువ ఫీజులు వసూలుచేస్తున్నాయన్నది బహిరంగసత్యం. ఈ సమస్య తల్లిదండ్రులపై,ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థికభారంగా మారింది. విద్యాహక్కు చట్టంలో పొందుపరచబడినట్లుగా విద్య అనేది ప్రాథమిక హక్కు. అయినప్పటికీ ఉన్నతమైన నాణ్యతగల విద్యను అందిస్తున్నట్లు భావించే ప్రైవేట్ పాఠశాలలు, రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన పరిమితులను మించి అధిక ఫీజులను వసూలు చేస్తున్నాయి. ఈ రుసుములలో ట్యూషన్ ఫీజు మాత్రమే కాకుండా అదనపు ఖర్చులు, అంటే పాఠ్యేతర కార్యకలాపాలు, వార్షిక ఛార్జీలు, అభివృద్ధి రుసుములు, ట్యూషన్‌లో చేర్చవలసిన సౌకర్యాల కోసం దాచిన ఖర్చులు కూడా ఉంటాయి. విశాఖపట్నం, విజయవాడ ఇతర పట్టణ ప్రాంతాలలో, జీవన వ్యయం పెరుగుతూనే ఉంది. కుటుంబాలుతమ పిల్లల విద్య, ఆర్థిక డిమాండ్లను తీర్చడానికి ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఈ ఆర్థిక ఒత్తిడి విద్యార్థులను మాత్రమే కాకుండా కుటుంబం మొత్తం శ్రేయస్సును ప్రభావితం చేసే విధంగా తయారైంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించినరుసుము నిర్మాణాన్ని ప్రవేశపెట్టడం ద్వారా పాఠశాల రుసుములను నియంత్రించడానికి ప్రయత్నించినప్పటికీ, కఠినమైన పర్యవేక్షణ అమలు లేకపోవడం వల్ల అనేక ప్రైవేట్ పాఠశాలలు ఈ నిబంధనలను పక్కన పెట్టేశాయి. సమర్థవంతమైన పర్యవేక్షణ లేకపోవడం వలన, ప్రైవేట్ విద్యాసంస్థలు నిర్దేశించిన పరిమితుల కంటే ఎక్కువగా వసూలు చేస్తూనే ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ నిబంధనలను అమలు చేయడానికి చర్యలు తీసుకోవడం చాలాముఖ్యం. ప్రైవేట్ సంస్థల ఫీజు వసూలు పద్ధతులను క్రమం తప్పకుండా తనిఖీ చేయడానికి ఒక బలమైన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. నిర్దేశించిన ఫీజు నిర్మాణాన్ని ఉల్లంఘించిన పాఠశాలలకు భారీ జరిమానాలు లేదా వాటి నిర్వహణ లైసెన్స్‌లను రద్దుచేయడం లాంటి చర్యలు తీసుకోవాలి. ఈ




విధానం ద్వారా అనైతిక ఫీజు వసూళ్లకు పాల్పడే పాఠశాలల సంఖ్య తగ్గే అవకాశంఉంటుంది. ఫీజునియంత్రణ చర్యలు తప్పనిసరి అయినప్పటికీ, అవి మాత్రమే దీర్ఘకాలికంగా ఈ సమస్యను పరిష్కరించడంలో సరిపోవు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రైవేట్ పాఠశాలలు విద్యా సంస్థల ఫీజు నిర్మాణాలను నియంత్రించే అధికారిక చట్టాన్ని ప్రవేశపెట్టడం అత్యవసరం. అటువంటి చట్టం ఫీజువసూలు పద్ధతుల్లో పారదర్శకత, జవాబుదారీ తనం ఉండేలా చేస్తుంది. అదనంగా, అన్యాయమైన ఫీజు పెంపుదల లేదా ఫీజు సంబంధిత వివాదాలు ఏవైనా తల్లిదండ్రులు ప్రభుత్వానికి నివేదించేలా ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. పాఠశాలలు తమ ఫీజు నిర్మాణాలను తల్లిదండ్రు లకు స్పష్టంగా సులభంగా అర్థ మయ్యే విధంగా బహిర్గతం చేయమని కోరడం ద్వారా పారదర్శకత మరింత మెరుగుపడుతుంది. ఆంధ్ర ప్రదేశ్‌లో విద్యాహక్కు చట్టాన్ని పూర్తిగా అమలు చేయడం చాలా ముఖ్యం. చట్టం 6 నుండి 14 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలకు ఉచిత విద్యను తప్పనిసరి చేస్తుంది. అనేక రాష్ట్రాల్లో ఈ చట్టం అమలు చేయబడినప్పటికీ, ఆంధ్రప్రదేశ్‌లో దాని పూర్తి అమలుకు తగినంత పర్యవేక్షణ లేకపోవడం ఆటంకం కలిగిస్తోంది. ఆర్థికంగా వెనుకబడిన నేపథ్యాల నుండి వచ్చిన పిల్లలకు ఉచిత విద్యను అందిం చడం ద్వారా ప్రైవేట్ పాఠశాలలు చట్టంలోని నిబంధనలను పాటించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. చట్టం పూర్తి అమలుతో పాటు, పాఠశాల ఫీజులను నియంత్రించే చట్టాన్ని ప్రవేశపెట్టడం, అధిక పాఠశాల ఫీజుల ఆర్థిక భారంతో పోరాడుతున్న కుటుంబాలకు తక్షణ ఉపశమనం కలిగించడమే కాకుండా, ఆంధ్రప్రదేశ్ అంతటా మరింత సమానమైన పారదర్శకమైన విద్యావ్యవస్థనుసృష్టించడానికి కూడా దోహదపడుతుంది. ఇది విద్యా వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని పునరుద్ధరిస్తుంది. ప్రైవేట్ పాఠశాలలు వారి ఫీజు పద్ధతులకు జవాబుదారీగా ఉండేలా చేస్తుంది. పాఠశాల ఫీజులను నియంత్రించడం గురించి చర్చలు రాష్ట్ర అసెంబ్లీలో ప్రాధాన్యంగా తీసుకోవాలి. శీఘ్రంగా ఈ అంశంపై చర్చించి, పాఠశాల ఫీజు నిర్మాణాల ను నియంత్రించే చట్టాన్ని రూపొందించి, అనుసరించాల్సిన చర్యలను తీసుకోవాలి. ప్రైవేట్ పాఠశాలలు నిర్దేశించిన ఫీజు నిర్మాణాన్ని పాటించేలా చేయడం ఫీజుల వసూలు పద్ధతులను నియంత్రించడానికి చట్టాన్ని ప్రవేశపెట్టి, పిల్లలు,వారి తల్లిదండ్రుల హక్కులను రక్షించడం ప్రభుత్వ బాధ్యత. ●

# ఎండిన పంటలతో సతమతమవుతున్న రైతన్న!

డాక్టర్ మోటె చిరంజీవి

వేసవి ప్రారంభంలోనే భూగర్భ జలాలు అడుగంటి జలాల శాతం పడిపోతుంది. మార్చిలోనే ఎండలు మండుతుండడంతో బావులు అడుగంటి పొట్ట దశకు చేరుకునే సమయంలో చుక్క నీరులేక, పొలం నెర్రలు వారి, నీరు లేక యాసంగి పంటలు ఎండిపోతున్నాయి. వ్యవసాయాన్నే నమ్ముకుని జీవిస్తున్న రైతులకు ఈ ఖరీఫ్ సీజన్‌లో పడిన కష్టం నష్టంగా మారేలా ఉంది.పచ్చని పొలాల్లో భూమికి పచ్చని పందిరి వేసినట్లు ఉండే వరి పంటలు భూగర్భజలాలు అడుగంటుతుండటం ఎండిపోయిన పైర్లన్నీ ఎర్రగా, పసుపుపచ్చగా మారుతున్నాయి. వ్యవసాయానికి మూలాధారమైన నీరు లేక, సాగు చేసిన రైతులకు కన్నీరు మిగులుతోంది. చేసిన కష్టంతో పాటు పెట్టిన పెట్టుబడి కూడా వృథాగా మారుతోంది. కొన్ని చోట్ల సాగు నీరు అందక ఎండుతున్న పొలాలను కాపాడుకునేందుకు కొందరు రైతులు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. అలా చేసినా పూర్తి స్థాయిలో నీరందక పొలాలు ఎండిపోతున్నాయి. పంట చేతికందకపోవడంతో రైతులు వరి కంకులను కోసి గేదెలకు వేస్తున్నారు. పలుచోట్ల పంటలపై ఆశలు వదులుకొని గేదేలకు మేపుతున్నారు. నాటు వేసి వరిపైర్లు పెరిగే కొద్దీ రోజురోజుకు నీటిని అందించే మోటార్ల ద్వారా నీటి ధార తగ్గుతూ వస్తుండటంతో రైతుల్లో ఆందోళన మొదలైనది. వరి కంకులు దాదాపుగాధాన్యం గింజలుగా మారే సమయంలో నీరందక పంటలు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. నీరందకపోవడంతో ఎండిన పంటను చూసి పలువురు కన్నీరు పెడుతున్నారు. పంటను వదులుకోలేక పలు గ్రామాలకు చెందిన రైతులు పంటలకు నీటిని కొనుగోలు చేసి ట్యాంకర్ల ద్వారా అందిస్తున్నారు. కానీ అది సరిపోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. చిన్న,సన్నకారు రైతులు నీరందించలేక ఆశలు వదులుకున్నారు. మరి కొందరు రైతులు సాగుచేసిన పంటలో కనీసం 60శాతం పంటనైనా కాపాడుకోవాలని తాపత్రయపడుతున్నారు. దీంతో పచ్చని పొలాలకు నీరందక వరి కంకులు ఎర్రగా మారి ఎండిపోతున్నాయి. యాసంగి పంటలను రక్షించుకోవడానికి కొంత మంది రైతులు ఎక్కువ లోతులో బోరు బావులు తవ్విస్తూ నీరు పడక అప్పుల పాలవుతున్నారు. కోత దశకు వచ్చే సమయంలో పంట ఎండిపోతుండడంతో తమ శ్రమతో పాటు ఆర్థికంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు యాసంగిలో సాగు చేసిన పంటలు పచ్చని పైర్లతో కళకళలాడేవి. పచ్చని పంట పొలాలతో కలకలలాడాల్సిన పల్లెలు నేడు వెలవెలబోతున్నాయి. వానాకాలంతో సమానంగా యాసంగిలోను పంటలు సాగు చేస్తుంటే రైతన్న భూమిని నమ్ముకొని కోటి ఆశలతో అప్పులు చేసి సాగుచేసిన పంటలు చూసి కన్నీటి పర్యంతమవుతున్నాడు.కొన్నిచోట్ల ఒక్కోరైతు రెండు బోర్లు వేసిన పడక నీళ్లు లేక బోరున ఏడుస్తున్నాడు. అంతకుముందు వేసవిలో వ్యవసాయం చేస్తున్నటువంటి రైతులకు నీటిని అందించే ఉద్దేశంగా కాలువల ద్వారా రిజర్వాయర్ల ద్వారా చెరువుల



ద్వారా నీటిని అందించే విధంగా కాళేశ్వరం నుంచి నీటిని పంపు చేసేవారు. అప్పుడు ఇంత మీద కష్టం లేదు.కౌలు పట్టినటువంటి రైతన్న కౌలు డబ్బులు ఎలా చెల్లించాలో తెలియడం లేదంటున్నారు. గింజ పాలుతాగుతున్నది ఇప్పుడు నీరు మంచిగా ఉంటే గింజ గట్టిపడుతుంది. గింజ గట్టిపడే సమయంలో నీళ్లలేకుండా పోయి రైతులు నష్టపోతున్నారు. ఏమి చేయలేని నిస్సహాయతతో అక్కడక్కడ నిరసనలు చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నీరు అందించాలని కోరుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో వానాకాలం ఏ విధంగానైతే పంట సాగుబడి చేస్తున్నారో, యాసంగిలో కూడా అదే విధంగా పంటలను సాగు బడి చేస్తున్నారు. విద్యుత్ సరఫరా నిరంతరం అందిస్తున్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్‌లు తరచు సాంకేతిక లోపాలు ఏర్పడి పంటలు ఎండిపోయి రైతన్నలకు కన్నీళ్లే మిగులుతున్నాయి. రాష్ట్రంలో నెలకొన్న పలు సమస్యలు, ఎండిన పంటలు, అందని కరెంటు, అందని సాగునీరు, కాలిపోతున్న మోటర్లు తదితర రైతాంగ సమస్యలపై, మంచినీటి కొరత పై అసెంబ్లీ, మండలిలో పోరాడాలని ప్రతిపక్షాలు గట్టిగానే ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే దాదాపు 10లక్షల ఎకరాల మేరకు పంట ఎండిపోయినట్లు తెలుస్తోందని, ముఖ్యంగా ఆయకట్టు చివరి పంటలకు నీళ్లందక పూర్తిగా ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్‌లో ప్రాజెక్టులోకి పెద్దఎత్తున నీరు రావడంతో ప్రభుత్వం ఆదరబాదరాగా నీటిని వదిలిపెట్టింది. ఈ క్రమంలో 100 టీఎంసీల నీరు వృథాగా వెళ్లిపోయింది. గోదావరిలోకి వదిలిన నీటిని జాగ్రత్తగా పంపిణీచేసి,ప్రాజెక్టు పరిధిలో ఉన్న 2,000కు పైగా చెరువులను నింపుకునేందుకు అవకాశం ఉన్నా ఆ దిశగా ప్రభుత్వం పనిచేయకపోవడం రైతుల పాలిట శాపంగా మారింది. రాష్ట్రంలోని సర్కార్, ప్రస్తుత ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ 285 టీఎంసీల నీరు వస్తే,104 టీఎంసీల నీటిని గోదావరిలోకి వదిలేశారు. నిరుడు జూన్, జూలైలో ప్రాజెక్టు నుంచి నీటిని బయటకు వదిలిపెట్టనే లేదు. ఈఏడాది వర్షాలు బాగాకురిసి ప్రాజెక్టులు, చెరువులు నిండాయి. ఫలితంగా వానాకాలంలో రికార్డుస్థాయిలో 160 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం దిగుబడి వచ్చింది. యాసంగిలోనూ 56 లక్షల ఎకరాల్లో వరి,మరో 7లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పంటలు వేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు. ఏ ప్రాంతంలో ఏ పంట వేయాలనే దానిపై ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను కూడా వ్యవసాయశాఖ అమలు చేయలేదు. రాష్ట్రంలోని ప్రధాన ప్రాజెక్టుల్లో 340 టీఎంసీలకు పైగా నీటి నిల్వలున్నట్లు ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. కానీ వాటిలో 150 టీఎంసీలు డెడ్‌స్టోరేజీ పోగా,మరో 190 టీఎంసీలకుపైగా నీరు అందుబాటులో ఉందన్నారు. తాగునీటి అవసరాలను మినహాయించి మిగిలిన నీటిని సకాలంలో విడుదల చేసి చెరువులు నింపినట్లయితే పంటలు ఎండిపోయే దుస్థితి తలెత్తేది కాదని రైతులు భావిస్తున్నారు. నెల రోజుల్లో పంటలు కోతకు వస్తున్న తరుణంలో పొలాలకు నీరందక ఎండుతున్నాయి.ఇది ముమ్మాటికీ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే' అని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో నీటిని అందించి, పంట దిగుబడి పెంచి, రైతుల సమస్యలను పరిష్కరించే విధంగా ముందడుగు వేయాలని రైతులు ఆశిస్తున్నారు. ●



## లోయలో పడిన ఐఐటి విద్యార్థుల బస్సు

**గ్యాంగ్‌టక్, మార్చి 16:** ఐఐటి విద్యార్థులతో వెళుతున్న బస్సు ఒక్కసారిగా అదుపుతప్పి లోయలోకి పడిపోయింది. ఘాట్‌రోడ్డులో వెళుతున్న బస్సు డ్రైవర్ అదుపు తప్పడంతో లోయలోకి దూసుకునిపోయిందని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో పదిమంది గాయపడ్డారు. వారందరినీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సిక్కింలోని మంగన్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శనివారం రాత్రి 9.30 గంటలసమయంలోఐఐటి ధన్‌బాద్ విద్యార్థులతో వెళుతున్న బస్సుపై డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దారా అటవీ ప్రాంతంలోని పక్షేవ్ సమీపంలో ఆ బస్సు ప్రమాదానికి గురైంది. వంద అడుగుల లోతైన లోయలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. బస్సు ప్రమాదం వెతలిసిన వెంటనే పోలీసులు,భద్రతా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలుచేపట్టారు. ఈ ప్రమాదంలో డ్రైవర్‌సహా పదిమంది గాయపడినట్లు అధికారులు తెలిపారు. గాయపడిన విద్యార్థుల్లో నలుగురు మహిళలు ఉన్నారు. మరోముగ్గురి పరిస్థితి విషమంగా మారడంతో గ్యాంగ్‌టక్‌లోని ఆసుపత్రికి తరలించామని చెప్పారు. మిగిలిన విద్యార్థులకు మంగన్‌లోని ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.

## బికెయు నేతకు తృటిలో తప్పిన ప్రాణాపాయం

**ముజఫరానగర్, మార్చి 16:** భారతీయ కిసాన్‌యూనియన్ (బికెయు) జాతీయ ప్రతినిధి రాకేష్ తికాయత్‌కు తృటిలో ప్రాణాపాయం తప్పింది. ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ జిల్లాలో ప్రయాణిస్తున్న సమయంలో ఆయన కారును అడవిజంతువు (నీల్‌గాయ్) ఢీకొట్టింది. మీర్‌పుర్‌బైపాస్‌లో వెళుతున్న సమయంలో అకస్మాత్తుగా వచ్చిన అడవిజంతువు తన వాహనాన్ని ఢీకొట్టిందని తికాయిత్ చెప్పారు. సీటు బెల్టు ధరించి ఉండటంతో ప్రమాదం తప్పిందని పేర్కొన్నారు. తన భద్రతా సిబ్బందిలో ఒకరు గాయపడ్డారనిచెప్పారు. వీరు ప్రయాణిస్తున్న కారు ముందుభాగం పూర్తిగా ధ్వంసం అయింది.ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే యూపి మంత్రి కపిల్‌దేవ్ అగర్వాల్, ముజఫర్‌నగర్ ఎంపి హరీంద్ర సింగ్ మాలిక్‌లు తికాయత్ నివాసానికివెళ్లి ఆయన్ను పరామర్శించారు.



## భారత్‌లో న్యూజిలాండ్ పిఎం

### 5 రోజుల పర్యటన

**న్యూఢిల్లీ, మార్చి 16:** ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొట్టమొదటిసారిగా న్యూజిలాండ్‌ప్రధాని క్రిస్టఫర్ లక్సన్ భారత్‌లో పర్యటనకు విచ్చేసారు. ఐదు రోజులపర్యటనలో ఆయన కీలక సమావేశాలు, ద్వైపాక్షిక భేటీలు నిర్వహించనున్నట్లు విదేశాంగశాఖ వెల్లడించింది. రెండుదేశాలమధ్య కొనసాగుతున్న సుదీర్ఘ సంబంధాలను మరింతగా బలోపేతం చేసుకునేదిశగా లక్సన్ సమావేశాలు ఉంటాయని విదేశాంగశాఖ వెల్లడించింది. ప్రధాని లక్సన్‌తో పాటు ఉన్నతస్థాయి బృందం సీనియర్ అధికారులు, మంత్రులు, బిజినెస్ లీడర్లు, మీడియా ప్రతినిధులు, న్యూజిలాండ్‌లోని భారత సంతతి ప్రతినిధులు కూడా ఉన్నట్లు విదేశాంగ శాఖప్రకటించింది. 17వ తేదీ న్యూజిలాండ్ ప్రధాని రాజ్‌ఘాట్‌ను సందర్శించి మహాత్మాగాంధీకి నివాళులర్పిస్తారు. ఆ తర్వాత ప్రధాని మోడీ ఆధ్వర్యంలో న్యూజిలాండ్ ప్రధాన మంత్రి గౌరవార్థం విందు ఏర్పాటుచేసారు. 17వ తేదీ న్యూఢిల్లీలోజరిగే పదో రైజినా డైలాగ్ సదసుసకు ముఖ్య అతిథిగా లక్సన్ హాజరయి కీలక ప్రసంగంచేస్తారు. కేవలం భారత్‌కే పరిమితం కాకుండా ఇండోపసిఫిక్ ప్రాంతంలో నెలకొన్న సమస్యలు, సవాళ్లపైనా కూడా వీరిద్దరిమధ్య చర్చకు వస్తాయని విదేశాంగశాఖ వివరించింది. ఇక 19, 20 తేదీల్లో న్యూజిలాండ్‌ప్రధాని ముంబయికి వెళతారు. అక్కడ భారతీయ బిజినెస్ లీడర్లు, ప్రతినిధులతో సమావేశం అవుతారు. రెండుదేశాలమధ్య పటిష్టంగా కొనసాగుతున్న ఆర్థిక సహకారం మరింత పెంచుకునేదిశగా ఆయన చర్చలు ఉంటాయి. న్యూజిలాండ్‌లో పెట్టుబడుల అవకాశాలన కూడా ఈ సందర్భంగా భారత పారిశ్రామికవేత్తలకు వివరిస్తారు.

# సునీతా విలియమ్స్ 19న భూమిపైకి రాక



**న్యూయార్క్, మార్చి 16:** అంతర్జాతీయ అంతరిక్షకేంద్రం ఐఎస్ఎస్‌లోనే తొమ్మిది నెలలుగా చిక్కుకుపోయిన భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్ మరో వ్యోమగామి బుచ్‌విల్మోర్‌లు త్వరలోనే భూమ్మీదకు వచ్చేందుకు మార్గం ఏర్పడింది. వారిని తిరిగి తీసుకొచ్చేందుకు నాసా స్పేస్‌ఎక్స్‌లు ప్రయోగించిన క్రూ-10 మిషన్ ఐఎస్ఎస్‌తో విజయవంతంగా అనుసంధానం అయింది. ఆదివారం ఉదయం 9.37 గంటలకు ఈప్రక్రియ జరిగిందని నాసా వెల్లడించింది. ఇందుకు సంబంధించిన విడియోను కూడా స్పేస్‌ఎక్స్ విడుదలచేసింది. సునీతా విలియమ్స్ మరో వ్యోమగామి బుచ్ విల్మోర్ స్థానంలో తాజాగా అక్కడికి వెళ్లిన నలుగురు వ్యోమగాములు పనిచేయనున్నారు. క్రూడ్రాగన్ వ్యోమనౌక శనివారం తెల్లవారుజామున 4.33 గంటలకు అమెరికాలోని కెన్నడీ అంతరిక్ష కేంద్రంనుంచి ప్రయాణం మొదలుపెట్టింది. క్రూ-10 మిషన్‌లోభాగంగా స్పేస్‌ఎక్స్‌కు చెందిన ఫాల్కన్-9 రాకెట్ దీన్ని నింగిలోకి మోసుకెళ్లింది.

ఇందులో అమెరికాకు చెందిన ఆన్ మెక్ క్లెయిన్, నికోల్ ఆయర్స్, జపాన్ వ్యోమగామి టకకుయాఒనిషి, రష్యాకు చెందిన కిరిల్‌పెస్కోవ్‌లు ఐఎస్ఎస్‌కు చేరారు. వీరికి సునీత విల్మోర్‌లు స్వాగతం పలికారు. టెస్ట్‌మిషన్‌కోసం బోయింగ్‌కు చెందిన స్టార్‌లైనర్ అంతరిక్ష నౌకలో విలియమ్స్, విల్‌మోర్‌లు 2024 జూన్5న అంతరిక్షంలోకి వెళ్లారు. ఎనిమిదిరోజుల తర్వాత వారుభూమికి రావాల్సి ఉంది. అయితే స్టార్‌లైనర్‌స్పేస్‌క్రాఫ్ట్ థ్రస్టర్స్ మూసుకు పోవడంతోపాటు హీలియం కూడా అయిపోయింది. ఈ నేపత్యంలో వ్యోమగాములను ఈనౌకలో తిరిగి భూమిపైకి తీసుకురావడం సురక్షితం కాదని ఆగస్టు నెలాఖరునాటికి నాసా ఒక నిర్ణయానికి వచ్చింది. దీనితో వ్యోమగాములు లేకుండా బోయింగ్ స్టార్ లైనర్ 2024, సెప్టెంబరు 7న క్షేమంగా భూమికి తిరిగి వచ్చింది అప్పటినుంచి సునీత్, విల్‌మోర్‌లు అంతరిక్షంలోనే ఉండిపోయారు. తిరిగి ఇపుడు ఈనెల 19,20 తేదీలనాటికి వారు క్రూ-10 క్యాప్సూల్‌లోనే తిరిగి భూమికి రానున్నారు.

# వందేమాతరం పాడిన చిన్నారికి కేంద్రమంత్రి గిటార్ బహూకరణ!



**న్యూఢిల్లీ, మార్చి 16:** కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈశాన్య రాష్ట్రాల్లో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో మిజోరాంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆ సమయంలో ఏడేళ్ల చిన్నారి ఎస్తేర్ లాల్దుహోమి హ్నామ్తే వందేమాతరాన్ని పాడింది. ఆ చిన్నారిని అభినందిస్తూ గిటాను బహుమతిగా ఇచ్చారు. భారతదేశంపై ప్రేమ మనల్ని ఏకం చేసింది. నేను అద్భుతమైన చిన్నారి ఎస్తేర్ వందేమాతరాన్ని పాడి నా హృదయాన్ని కదిలించింది.

ఏడేళ్ల చిన్నారికి భారతమాతపై ఉన్న ప్రేమ తన పాటలో కనిపించింది అని షా ఎక్స్‌లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆ పాట వీడియోను కూడా ఆయన పంచుకున్నారు. ఎస్తేర్ 2020లో మా తుజే సలామ్ పాట వీడియోతో అందరి దృష్టిని ఆకర్షించింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆమె అనేక అవార్డులను అందుకుంది. ఈ సందర్భంగా మిజోరాం ప్రజలనుద్దేశించి షా మాట్లాడారు. అస్సాం రైఫిల్స్ ప్రధాని కార్యాలయాన్ని సెంట్రల్ ఐజ్వాల్ నుంచి జోఖావ్‌సాంగ్‌కు మార్చడం రాష్ట్ర అభివృద్ధిపై కేంద్ర నిబద్ధతను చాటుతుందన్నారు. ఈ చర్య కేవలం పరిపాలనాపరమైన నిర్ణయం మాత్రమే కాదని, మిజో ప్రజలపై ప్రభుత్వం చూపిస్తున్న బాధ్యతలకు ప్రతీకగా పేర్కొన్నారు. పర్యాటకం, సాంకేతికత, వ్యవసాయం, వ్యవస్థాపకతతో సహా వివిధ రంగాలలో ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి ప్రధాని మోడీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

# యెమెన్‌లో హౌతీలపై అమెరికా దాడులు

## 34 మంది మృతి



**సనా, మార్చి 16:** యెమెన్‌లోని హౌతీలపై అమెరికాలోని ట్రంప్ సర్కారు సైనిక చర్యను మొదలుపెట్టింది. ఎర్ర సముద్రంలో వాణిజ్యనౌకలే లక్ష్యంగా దాడులుచేస్తున్న యెమెన్ తిరుగుబాటుదళాలకు ఇక అమెరికా చుక్కలు చూపిస్తోంది. యెమెన్ రాజధాని సనా, సదా, అల్‌బైదా, రాడాలే లక్ష్యంగా దాడులు కొనసాగించింది. ఇప్పటివరకూ 34 మంది మృతిచెందారని, 101 మంది గాయపడినట్లు హౌతీ ఆరోపించింది. మృతుల్లో మహిళలు, చిన్నారులే ఎక్కువ ఉన్నట్లు హౌతీ ఆరోగ్యమంత్రిత్వ శాఖ తెలిపింది. అమెరికా నౌకలు, విమానాలపై హౌతీలు దాడులుచేయడాన్ని సహించేదిలేదని యుఎస్ సెంట్రల్‌కమాండ్ వెల్లడించింది. అగ్రరాజ్యం దాడులను హౌతీ పొలిటికల్ బ్యూరో యుద్ధనేరంగా పేర్కొంది. యెమెన్ దళాలు ప్రతిస్పందించేందుకు సిద్ధంగా ఉన్నాయని హెచ్చరించింది. తిరుగుబాటుదారులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ధ్వజమెత్తారు. హౌతీలు మీకు మీ సమయం ఆసన్నమైంది. మీ దాడులు వెంటనే ఆపేయాలి ఊహించని పరిణామాలు ఎదుర్కొంటారు అని ఆయన ట్రూత్‌సోషల్ మీడియాలో పోస్టుచేసారు.

ప్రపంచ జలమార్గాల్లో అమెరికా వాణిజ్య,యుద్ధనౌకలు స్వేచ్ఛగా వెళ్లకుండా ఆపేశక్తి ఏ ఉగ్రశక్తికీ లేదన్నారు. హౌతీలకు మద్దతివ్వడాన్ని నిలిపివేయాలని ఇరాన్‌ను హెచ్చరించారు. వారి చర్యలకు ఇకపై దాడులు జరిగితే అందుకు ఇరాన్ పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టంచేసారు. కాగా అమెరికా దాడులతో సనా పరిసర ప్రాంతాల్లోభూమి కంపించింది. దీనితో అందరూ భూకంపం వచ్చిందని భయాందోళన చెందారు.

# మోస్ట్‌వాంటెడ్ లష్కరేచీఫ్ సన్నిహితుడు హతం

**జీలం(పాకిస్థాన్), మార్చి 16:** పాకిస్థాన్ కేంద్రంగా జమ్ముకాశ్మీర్‌లో ఉగ్రకార్యకలాపాలు కొనసాగిస్తున్న లష్కరే తోయిబా ఉగ్రవాది అబూఖతల్ హతయ్యాడు. శనివారంరాత్రి పాకిస్థాన్‌లోని జీలంలో ఆతడు తన భద్రతా సిబ్బందితో కలిసి వెళుతుండగా గుర్తుతెలీని వ్యక్తులు ఒక్కసారిగా కాల్పులుజరిపారు. 15-20 రౌండ్లు ఫైరింగ్‌చేయడంతో ఖతాల్ సహా సిబ్బందిలో ఒకరు మృతిచెందారు.

మరొకరికి తీవ్రస్థాయి బుల్లెట్ గాయాలయ్యాయి. జీలం ప్రాంతంలోని దీనా పంజాబ్ యూనివర్సిటీ సమీపంలో ఈ దాడిజరిగింది. 26/11 ముంబయి దాడులకు సూత్రధారి అయిన హాఫీజ్ సయీద్‌కు ఖతాల్ సన్నిహితుడు జమ్ముకాశ్మీర్‌లోని రియాసీలో యాత్రీకుల బస్సుపై జరిగిన ఉగ్రదాడిలో ఖతల్ కీలకపాత్రపోషించాడు. అంతేకాకుండా 2023 రాజౌరిలో జరిగిన ఎన్‌కౌంటర్‌కు సంబంధించి ఎన్ఐఎ ఛార్జిషీట్‌లో ఆతడిపేరుకూడా ఉంది. వీరంతా సాధారణ పౌరులు,భద్రతా సిబ్బందే లక్ష్యంగా పలుదాడులుచేసారు.ఈ దాడుల్లో ఇద్దరుచిన్నారులతోసహా ఏడుగురుచనిపోయారు. అనేకమంది గాయాలపాలయ్యారు. జమ్ముకాశ్మీర్‌లోనిరియాసీ జిల్లాలో శివఖోరి ఆలయంనుంచి భక్తులతో వస్తున్న బస్సుపై జరిపిన దాడిలో అబుఖతల్ కీలకపాత్రపోషించాడు. ఆతడి నేతృత్వంలో ఈ దాడికి పథకరచనజరిగిందనిఎన్ఐఎ కూడా దర్యాప్తులో వెల్లడించింది.

# అమెరికాను వణికిస్తున్న భీకర తుపానులు



**వాషింగ్టన్, మార్చి 16:** అగ్రరాజ్యం అమెరికాను భీకర తుపానులు వణికిస్తున్నాయి. పెద్ద ఎత్తున టోర్నెడోలు విరుచుకుపడుతున్నాయి. బలమైన గాలుల కారణంగా అనేక ఇళ్లు నేలమట్టం అయ్యాయి. ఈ తుపాను ధాటికి అమెరికా వ్యాప్తంగా 34 మంది ప్రాణాలు కోల్పోయారు. మిస్సోరిలోని బేకర్స్ ఫీల్డ్‌లో టోర్నెడో కారణంగా 12 మంది మృతిచెందారు. ఆర్కన్సాస్ రాష్ట్రంలోని ఇండిపెండెన్స్ కౌంటీలో ముగ్గురు చనిపోయారు. ఎనిమిది కౌంటీల్లో 50 మందికిపైగా గాయపడినట్లు ఆర్కాన్సాస్ అధికారులు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 16 కౌంటీల్లో భారీగా ఆస్తినష్టం సంభవించినట్లు పేర్కొన్నారు. అనేక ఇళ్లు ధ్వంసం అయినట్లు చెప్పారు. విద్యుత్ లైన్లు, చెట్లు కూలిపోయాయయని పబ్లిక్‌సేఫ్టీ విభాగం వెల్లడించింది. గవర్నర్ సారా హుకాబీ శాండర్స్ అత్యవసరపరిస్థితిని ప్రకటించారు. అధ్యక్షుడు ట్రంప్‌తో తానుమాట్లాడానని ప్రజల రక్షణకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చినట్లు చెప్పారు. టెక్సాస్ పాన్ హ్యాండిల్‌లోని అమరిల్లో కౌంటీలో దుమ్ముతుపాను కారణంగా జరిగిన కారుప్రమాదాల్లో ఏడుగురు చనిపోయారు. మరొకరు మిసిసిపీలో చనిపోయారు. అమెరికా మొత్తంగా బలమైన గాలులు ప్రభావంవల్ల అనేక ప్రాంతాల్లో చనిపోయిన వారి సంఘటనలు ఎక్కువ ఉన్నాయి. 100కిపైగా అడవుల్లో మంటలు చెలరేగినట్లు తేలింది. ముందురోజు సంభవించిన టోర్నెడోల కారణంగా తూర్పు లూసియానా, మిసిసిపీ, అలబామా, పశ్చిమ జార్జియా, ఫ్లోరిడా, పాన్‌హ్యాండిల్ ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితం అయ్యాయి. టోర్నడోలు మరిన్ని వచ్చే అవకాశం ఉందని అందులోకొన్ని ప్రమాదకరస్థాయిలో ఉండవచ్చని జాతీయ వాతావరణ సేవల విభాగం హెచ్చరికలుచేసింది. టెక్సాస్, కన్సాస్, దక్షిణ అమెరికా రాష్ట్రాల్లో దీని ముప్పు ఎక్కువగా ఉంటుందని తెలిపారు.



# పాక్ మిలిటరీకాన్వాయ్‌పై బిఎల్ఏ ఆత్మాహుతి దాడి

## 90 మందిని హతమార్చామన్న బిఎల్ఏ


### ఏడుగురుసైనికులు చనిపోయినట్లు అధికారిక ప్రకటన

**క్వెట్టా, మార్చి 16:** పాకిస్థాన్‌లో మిలిటరీక ఆన్వాయ్‌పై దాడి జరిగింది. క్వెట్టానుంచి టఫ్తాన్ వెళుతున్న మార్గంలో ఈ దాడిజరిగిందని అధికారులు వివరించారు. ఈ దాడిలో ఏడుగురు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. సుమారు 21 మంది గాయపడినట్లు వెల్లడించారు. క్వెట్టానుంచి టఫ్తాన్‌కు వెళుతున్న భద్రతా దళాల కాన్వాయ్‌పై బలూచిస్తాన్‌లోని నోష్కిలో దాడ జరిగింది. ఏడు బస్సులు రెండు వాహనాలతో కూడిన కాన్వాయ్‌ను లక్ష్యంగాచేసుకుని దాడికి పాల్పడ్డారు. ఒక బస్సును ఐఇడిలతో నిండిన వాహనం ఢీకొట్టింది. ఆత్మాహుతి దాడి అవుతుందని పాక్ అధికారి తెలిపారు. ఈ దాడికి బలోచ్ లిబరేషన్ ఆర్మీ బాధ్యత వహించింది. తమ దాడిలో 90 మంది పాక్ సైనికసిబ్బంది మరణించినట్లు ప్రకటించింది. బలోచ్ లిబరేషన్ ఆర్మీకిచెందిన ఫిదాయీ యూనిట్ మజీద్ బ్రిగేడ్ కొన్ని గంటలక్రితం నోష్కి సమీపంలోని పాక్ మిలిటరీ కాన్వాయ్‌ను లక్ష్యంగాచేసుకుంది. దానిలో ఎనిమిది బస్సులున్నాయి. పేలుడు వల్ల ఒక వాహణం పూర్తిగా ధ్వంసం అయింది దాడి జరిగిన వెంటనే బిఎల్ఏకి చెందిన ఫతే స్క్వాడ్ ముందుకు సాగి మరో బస్సును చుట్టుముట్టింది. అందులోని సైనికులను హతమార్చింది. మొత్తం శత్రువుల మరణాల సంఖ్య 90కి చేరిందని బిఎల్ఎల ప్రకటించింది. ఐదురోజులక్రితమే బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలును హైజాక్‌చేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో రైలులో 400 మందికిపైగా ప్రయాణీకులున్నారు. వారందరినీ బందీలుగా మార్చి పలువురిని చంపేశారు. జాఫర్ ఎక్స్‌ప్రెస్ నుంచి బందీలుగా అదుపులోకి తీసుకున్న 214 మంది పాక్ సైనికులను హతమార్చినట్లు బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ ప్రకటించింది. ఈ ఘటన జరిగిన రెండురోజులకే మళ్లీ పాకిస్థాన్‌లో మిలిటరీ కాన్వాయ్‌పై దాడికి పాల్పడ్డారు.

# ఈజిప్టులో హౌతీ తిరుగుబాటుదారులు ప్రయోగించిన క్షిపణి

**న్యూఢిల్లీ, మార్చి 16:** హౌతీ తిరుగుబాటుదారులపై అమెరికా ఉక్కుపాదం మోపిన విషయం తెలిసిందే. యెమెన్‌లో చేపట్టిన దాడుల్లో 30 మందికిపైగా మృతి చెందారు. ఇదే సమయంలో హూతీలు ప్రయోగించినట్లు భావిస్తున్న ఓ క్షిపణి ఈజిప్టును తాకినట్లు తెలుస్తోంది. సినాయ్ ద్వీపకల్పంలోని తీరప్రాంత నగరమైన శర్మ్ ఎల్ షేక్‌కు సమీపంలో పడింది. ప్రాణనష్టం వివరాలు తెలియరాలేదు. అయితే ఇజ్రాయెల్‌ను లక్ష్యంగా చేసుకుని ఆ క్షిపణిని ప్రయోగించారా? అనేఅంశంపై ఐడిఎఫ్ దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఇజ్రాయెల్‌పై తమ దాడులను పునః ప్రారంభిస్తామని ఇటీవల హౌతీలు ప్రకటించిన నేపథ్యంలో టెల్‌అవీవ్ ఇప్పటికే అప్రమత్తమైంది. డ్రోన్, క్షిపణి దాడులు జరిగే అవకాశం ఉందని హెచ్చరించింది. హౌతీలకు సమయం దగ్గరపడిందంటూ వారికి మద్దతు ఇవ్వడాన్ని నిలిపివేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే ఇరాన్‌ను హెచ్చరించారు. వారి చర్యలకు ఇరానే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈ వ్యాఖ్యలను టెహ్రాన్ ఖండించింది. హౌతీల దాడుల్లో తమ దేశానికి ఎటువంటి ప్రమేయం లేదని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ చీఫ్ జనరల్ హుస్సేన్ సలామీ స్పష్టం చేశారు. మిలిటెంట్ గ్రూపుల విధానాల రూపకల్పన విషయంలో తమ పాత్రేమీ లేదన్నారు. ఇరాన్ విదేశాంగ శాఖ మంత్రిఅబ్బాస్ అరఘ్చి స్పందిస్తూ హౌతీలపై అమెరికా దాడులను నిలిపివేయాలన్నారు. తమ విదేశాంగ విధానాలను అమెరికా నిర్దేశించలేదన్నారు. ఇక అగ్రరాజ్య దాడులను హౌతీ పొలిటికల్ బ్యూరో యుద్ధ నేరంగా పేర్కొంది.

# నైట్‌క్లబ్‌లో అగ్నిప్రమాదం 50 మందికిపైగా సజీవదహనం



**స్కోప్జే, మార్చి 16:** నైట్‌క్లబ్‌లో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. 50 మందికిపైగా సజీవ దహనం అయ్యారు. వందమందికిపైగా గాయపడ్డారు. మృతుల్లో ఎక్కువ మంది యువతేనని అధికారులు తెలిపారు ఆగ్నేయ ఐరోపా దేశం అయిన నార్త్ మెసిడోనియాలో ఈ ఘటన చోటుచేసుకుంది. రాజధాని స్కోప్జేకు వంద కిలోమీటర్ల దూరంలో ఉనన కోకానిలోని పల్స్ నైట్‌క్లబ్‌లో ఆదివారం రాత్రిమ్యూజిక్ కన్సర్ట్ జరిగింది. ఆ దేశంలోని ప్రసిద్ధ హిప్‌హాప్ జంట డిఎన్‌కే నిర్వహించిన సంగీత కచేరికి 1500 మందికిపైగా వచ్చారు. అర్ధరాత్రివేళ ఆ నైట్ క్లబ్‌లోప్రమాదంజరిగింది. ప్రేక్షకుల్లో ఎవరో బాణాసంచాల కాల్చడంతో చెలరేగిన మంటలు బిల్డింగ్ మొత్తం వ్యాపించాయి. దీనితో జనం భయాందోళనతో బయటకు పరుగులుతీసారు. మంటల్లో కాలి కొందరు, తొక్కిసలాటలో మరి కొందరు మరణించారు. 51 మంది మరణించగా మరో వందమంది గాయపడ్డారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక చర్యలుచేపట్టారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మరోవైపు ఉత్తర మసిడోనియా ప్రధాన మంత్రి హ్రిస్టిజన్ మమికోస్కి ఈసంఘటనపై దిగ్భ్రాంతిని వ్యక్తంచేసారు.

కష్టమైన విచారకరమైన రోజని వ్యాఖ్యానించారు. చాలామంది యువకుల ప్రాణనష్టం పూడ్చలేనిదని బాధిత కుటుంబాలుప్రియమైన వారుస్నేహితుల బాధ వెలకట్టలేనిదని ఎక్స్‌లో వెల్లడించారు. కాగా నైట్‌క్లబ్‌లో జరిగిన అగ్ని ప్రమాదానికి సంబంధించిన విడియోలు నెట్టింట వైరల్ అయ్యాయి.

# గ్వాలియర్ ప్రభుత్వ ఆసుపత్రిలో అగ్నిప్రమాదం

## రోగులను రక్షించిన సిబ్బంది, ఎటువంటి ప్రాణనష్టం లేదన్న అధికారులు

**భోపాల్, మార్చి 16:** ప్రభుత్వ ఆసుపత్రిలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఇంటెన్సివల్ కేర్ యూనిట్‌లోని ఎసిలో మంటలు చెలరేగాయి. గమనించిన సెక్యూరిటీ గార్డులు, వైద్యసిబ్బంది అప్రమత్తమయ్యారు. ఐసియుతోపాటు అన్ని వార్డుల్లో ఉన్న సుమారు 200 మంది రోగులను రక్షించారు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ఈ సంఘటన జరిగింది. గజ్రా రాజామెడికల్ కాలేజీలో భాగమైన కమలారాజా హాస్పిటల్‌లో అదివారం తెల్లవాజామున 1 గంట సమయంలో అగ్నిప్రమాదం జరిగింది.

గైనకాలజీ విభాగంలోని ఇంటెన్సివ్‌కేర్ యూనిట్‌లోని ఎయిర్ కండిషనర్‌లో మంటలు చెలరేగాయి. కాగా, మంటలు పొగలు గమనించిన ఆసుపత్రి గార్డులు, సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. కిటీకిలు పగులగొట్టి ఐసియులోని 13 మంది రోగులను బయటకు తెచ్చారు. అలాగే అన్ని వార్డులతో సహా సుమారు 200 మంది రోగులను సురక్షిత ప్రాంతానికి చేర్చారు.

మెడికల్ కాలేజీ క్యాంపస్‌లోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి వారిని తరలించారు. మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న అగ్ని ప్రమాదక సిబ్బంది ఆ ఆసుపత్రికి చేరుకున్నారు. మంటలను ఆర్పివేశారు. అగ్నిప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# తాడిపత్రిని ప్రపంచ పటంలో ఉండేలా చేయడమే నా లక్ష్యం

## - 1100 ఎకరాల భూమి అన్యాక్రాంతం, స్వామివారి భూమిని, హుండీ ఆదాయాన్ని దోచేశారు - తాడిపత్రి మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి

**తాడిపత్రిటౌన్, మార్చి 16 ప్రభాతవార్త** యాడికి మండలాన్ని ప్రక్షాళన చేసి తీరుతానని తాడిపత్రి మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. యాడికి మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి భూముల ఆక్రమణలపై జె.సి ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. 1100 ఎకరాల భూమి అన్యక్రాంతం అయిందని స్వామివారి భూమిని, స్వామివారి హుండీ ఆదాయన్ని దోచేశారని జె.సి ప్రభాకర్‌రెడ్డి ఫైర్ అయ్యారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జె.సి ప్రభాకర్‌రెడ్డి

ఆదివారం స్థానిక నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జె.సి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ యాడికిలో బ్రహ్మోత్సవాలను దిగ్విజయంగా పూర్తి చేసిన యాడికి ప్రజలకు యువకులకు తాను ఎల్లప్పుడూ రుణపడి వుంటానన్నారు. యాడికి శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయానికి సంబంధించి 1100 ఎకరాల భూమి అన్యక్రాంతం అయిందని స్వామివారి భూమిని, స్వామివారి హుండీ ఆదాయన్ని దోచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మరి కొద్దిరోజులు పోతే స్వామిని కూడా దోచేస్తారని ఇకమీదట ఇలాంటివి జరగనివ్వనని ఏప్రిల్‌లో పూర్తిస్థాయిలో యాడికి శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ బాధ్యతలు తీసు కుంటానని అందరు సహకరిస్తే ఆలయ ప్రెసిడెంట్‌ను అవు తానని ఎవరి ఇంటి ముందు చెత్త వాళ్ళు ఊడ్చి పడేస్తే యాడికి మరింత బాగుం టుందని, రండి అంతా కలిసి ఏకమై యాడికిని పరిశుభ్రంగా వుంచుదామన్నారు. నిన్ననే మంత్రి నారా లోకేష్ తాడిపత్రిని తాడిపత్రి మున్సిపాలిటీ గురించి చెప్పడం చాలా సంతోషం అనిపించిందన్నారు. తాడిపత్రిని ప్రపంచ పటంలో వుండేలా చేయడమే నా లక్ష్యమన్నారు. యాడికి అభివృద్ధి కోసం నాతో పాటు కలిసి నడవాలని, జోలే పట్టి యాడికిని అభివృద్ధి పరుస్తామన్నారు. వచ్చే ఏడాది శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం సొంత డబ్బులతో బ్రహ్మోత్సవాలు జరిగేలా చూస్తామన్నారు. స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఎవరిని డబ్బులు అడగాల్సిన అవసరం లేకుండా చేస్తానన్నారు. యాడికిలో నీటి కొరత లేకుండా చేస్తానని ఈ రోజు జె.సి అంటే ఏపి, తెలంగాణలో అందరికీ తెలుసు ఏం చేస్తాడు అన్నది. ఎవరు ఇంట్లో నుండి చెత్త బయటకు వేయకూడదని మీ ఇంటి వద్దకే బండ్లను పంపించే మార్గం చేస్తానన్నారు. ఇంటి వద్దనే చెత్త సేకరిస్తారన్నారు. ప్రభుత్వం వద్ద డబ్బులు లేవని అందరూ చేయి చేయి వేస్తే యాడికిని మరింత అభివృద్ధి చేయవచ్చన్నారు. మొన్ననే తిమ్మాపురం అనే గ్రామాన్ని అభివృద్ధి చేశామని వెళ్లి చూడాలని అభివృద్ధి అంటే ఏంటో అక్కడ కనిపిస్తుం దన్నారు. ప్రజల కోసం ఎంత దూరమైనా వెళతానని దేవుడు నాకు ఆస్తులు ఎన్నో ఇచ్చాడు, తాడిపత్రి ప్రజలు నాకు జీవితాన్ని ఇచ్చారు, నేనెప్పుడూ తాడిపత్రి నియోజకవర్గ ప్రజలకు సేవకుడిలాగా పని చేస్తానని జె.సి అన్నారు.



మంత్రి సవితాను సన్మానిస్తున్న రచయితల సంఘం సభ్యులు

# మగ పిల్లలకు సంస్కారం నేర్పిద్దాం

## మహిళా దినోత్సవ సభలో మంత్రి సవిత

## - 25 మందికి మహిళా శిరోమణి అవార్డులు

**పెనుకొండ, మార్చి 16 ప్రభాతవార్త :** ఆడపిల్లల రక్షణ, భద్రత కావాలంటే ముందుగా తల్లిదండ్రులు మగ పిల్లలకు తప్పకుండా సంస్కారం నేర్పించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత సూచించారు. ఆదివారం పట్టణంలోని మార్కెట్ యార్డులో జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు జాబిలి చాంద్ బాషా అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి సవిత పాల్గొని, మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. నేటి సమాజంలో బాలికలు, మహిళలపై అఘాయిత్యాలు జరగకుండా ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా అడ్డుకోవాలన్నారు. నేడు అన్ని రంగాల్లో మహిళలు పురుషులతో సమానంగా రాణిస్తుండడం అభినందనీయమన్నారు. మహిళలను వేధించినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మగ శిశువుకు జన్మనిచ్చిన ప్రతి తల్లి చిన్నప్పటి నుంచే వారికి సంస్కారాన్ని నేర్పాలన్నారు. అప్పుడే స్త్రీల పట్ల సమాజంలో గౌరవభావం పెరుగుతుందన్నారు. జిల్లాలో మహిళా చైతన్యం, రక్షణ కోసం జిల్లా ఎస్పీ రత్న తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయని కొనియాడారు. సభలోరాప్తాడు శాసన సభ్యురాలు పరిటాల సునీత మాట్లాడుతూ పెనుకొండ ప్రాంతం మహిళా చైతన్యానికి పెట్టింది పేరు అని పేరన్నారు. ఎంతోమంది ధీర మహిళలు అనేక సంక్షోభాల్లో ధైర్యంగా ముందుకొచ్చి తమ కుటుంబాలకు అండగా నిలబడ్డారన్నారు. ప్రతి బాలిక విద్యార్థి దశ నుంచే చదువుతోపాటు సామాజిక చైతన్యాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. నైతిక విలువలతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందన్నారు. మహిళలపై జరుగుతున్న నేరాలను నియంత్రించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. జిల్లా ఎస్పీ రత్న మాట్లాడుతూ ఆపద సమయాల్లో మహిళలు శక్తి యాప్ ను ఉపయోగించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ మొబైల్ లో శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకుంటే ఎలాంటి విపత్కర పరిస్థితుల్లో అయినా శక్తి టీం సకాలంలో సంఘటన స్థలానికి చేరుకుని మహిళలను రక్షిస్తుందన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో బాలికలు, మహిళల భద్రత కోసం అనేక చైతన్యవంతమైన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మహిళలను వేధిస్తే ఏ స్థాయి వారిపై నైనా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సభాధ్యక్షులు జాబిలి చాంద్ బాషా మాట్లాడుతూ ఆధునిక మహిళలు చరిత్రను తిరగ రాస్తారని, మహిళా లోకంలో మరింత ఆత్మస్థైర్యం పెంపొందించడమే లక్ష్యంగా జిల్లా రచయితల సంగం ఆధ్వర్యంలో ఇలాంటి చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నమన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ స్ఫూర్తిని పెనుగొండ తో పాటు జిల్లాలోని మహిళలందరూ పెంపొందించుకోవాలని కోరారు. వివిధ రంగాల్లో ఉన్నత స్థాయిలో నిలిచిన మంత్రి సవిత, ఎమ్మెల్యే పరిటాల సునీత, ఎస్పీ రత్న, ఆర్డిఓ సువర్ణ మొదలైన మహిళా మణులే నేటితరం మహిళలకు ఆదర్శమన్నారు. పుట్టపర్తి ఆర్డిఓ సువర్ణ మాట్లాడుతూ ధైర్యమే రక్షణ కవచంగా.. చదువే లక్ష్యంగా బాలికలు ముందడుగు వేయాలన్నారు. షిరిడి సాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్ పర్సన్ శిల్ప అనుపాటి మాట్లాడుతూ గొప్ప గొప్ప మహిళల స్ఫూర్తితో తమ జీవితాలను సగటు మహిళలు ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. మహిళలు, బాలికలకు చేయూతనందించేందుకు తమ ట్రస్ట్ ఎప్పుడు సిద్ధంగా ఉంటుందన్నారు.

# స్టేషన్ మాస్టర్ నోటిఫికేషన్‌ను రద్దు చేసిన విజయవాడ

**గుంతకల్లు రైల్వే,ఫిబ్రవరి 16,ప్రభాతవార్త** తెలుగు రాష్ట్రాల్లో దక్షిణ మధ్య రైల్వేలో ఎల్‌డిసిఇ/జిడిసిఇల నోటిఫికేషన్‌ల రద్దు ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. తాజాగా విజయవాడ రైల్వే డివిజన్‌లో పదోన్నతుల కోటాలో ఖాళీగా ఉన్న 51స్టేషన్ మాస్టర్ పోస్టుల భర్తీకై అర్హులైన అభ్యర్థుల నుంచి జనరల్ సెలెక్షన్స్ 25శాతం పదోన్నతుల కోటాలో భర్తీ చేసేందుకు విజయవాడ రైల్వే డివిజన్ సంబంధిత అధికారులు గత ఏడాది జనవరి 1న నోటిఫికేషన్ జారీ చేసి, డిసెంబర్ 15న వ్రాత పరీక్షను సైతం నిర్వహించారు. (ఫలితాలు ప్రకటించాల్సి ఉంది). కాగా తూర్పు మధ్య రైల్వే జోన్‌లో సిఎల్‌ఐల వ్రాత పరీక్షతో పాటు రైల్వేలో ఇటీవల చోటు చేసుకున్న అవినీతి,అక్రమాలు వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో రైల్వే బోర్డు తదుపరి ఆదేశాలు జారీ చేసేవరకు పదోన్నతులకు సంబంధించి జిడిసిఇ/ఎల్‌డిసిఇ ప్రక్రియను చేపట్టవద్దని భారతీయ రైల్వేలోని అన్ని జోన్‌ల, ఉత్పత్తి కర్మాగారాలకు చెందిన జనరల్ మేనేజర్‌లను ఈ నెల 5న ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో ఇప్పటికే దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ గత ఏడాది జనవరి 1న జారీ చేసిన జనరల్ సెలెక్షన్‌కు సంబంధించిన నోటిఫికేషన్‌ను కూడా తాజాగా రద్దు చేస్తూ సంబంధిత అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

# జనసేనని ఆంధ్ర మతసేన పార్టీ గా మార్చారు: పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

**విజయవాడ మార్చి 16 ప్రభాతవార్త ప్రతినిధి:** జనసేన అధ్యక్షులు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేగువేరా గద్దర్‌అన్న సిద్దాంతాలకు నీళ్ళొదిలేశారని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు.ఆదివారం ఆమె విడుదల చేసిన ప్రకటనలో పవన్ కల్యాణ్ ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోడీ, అమిత్ షా సిద్దాంతాలను ఆదర్శంగా తీసుకున్నారు. ఆర్‌ఎస్‌ఎస్ భావజలాన్ని నరనరాన జీర్ణించుకున్నారు. జనసేన పార్టీని ఆంధ్ర మతసేన పార్టీ గా మార్చారు. జనం కోసం పుట్టిన పార్టీ అని చెప్పి ఒక మతానికి అజెండాగా మార్చడం దారుణం. సర్వమత సమ్మేళనంగా విరాజిల్లుతున్న ఆంధ్రరాష్ట్రంలో విభజించు పాలించు అన్నట్లుగా మీ వైఖరి ఉండటం విచారకరం, పార్టీ పెట్టి 11 ఏళ్ల పోరాడి, ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి, మతం రంగు పూసుకుని ఒకరి ప్రయోజనాలే లక్ష్యం అన్నట్లుగా మాట్లాడటాన్ని కాంగ్రెస్ పార్టీ గా ఖండిస్తున్నాం. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలతో పుట్టిన పార్టీ అని చెప్పి మత పిచ్చి బీజేపీ ఆశయాలను అలవరుచుకోవడం దురదృష్టకరమన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ ఇప్పటికైనా మేల్కోవాలన్నారు.. పవన్ బీజేపీ మైకం నుంచి బయట పడాలంటూ షర్మిల హితవు చెప్పారు.జనసేనను బిజెపిలో విలీనం చేయడం మంచిదని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి అన్నారు.

ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. భాజపా అంటే బాబు , జగన్, పవన్ అని భాజపా చేతిలో కీలుబొమ్మలని కాంగ్రెస్ ఎప్పటి నుంచో చెబుతోందన్నారు. పిఠాపురం జనసేన సభలో అది నిజమైందని ఎద్దేవా చేశారు.

# దర్శనాలు చేయిస్తానని చైర్మన్ ఉద్యోగి పేరుతో మోసం

**తిరుమల,మార్చి 16ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి చైర్మన్ వద్ద ప్రధాన కార్యదర్శి హోదాలో పనిచేస్తున్నానంటూ భక్తులను నమ్మించి దర్శనాలు పేరుతో 2.60లక్షలు రూపాయలు మోసం చేశాడు. ఘరానా మోసగాడిపై టిటిడి విజిలెన్స్ వింగ్‌కు బాధితులు ఫిర్యాదు చేయడంతో వెలుగుచూసింది. విజయవాడ సిద్ధార్థ కళాశాల పిజిస్టూడెంట్ సంఘమిత్రను దర్శనాలు పేరుతో టిటిడి చైర్మన్ వద్ద పనిచేస్తున్నట్లు నిందితులు మదలదీపుబాబు, పవన్‌కుమార్‌లు నమ్మించారు.నిజమని నమ్మిన బాధితురాలు 5 విఐపి బ్రేక్ దర్శనం, 5 సుప్రభాత దర్శనాలకు 2.6లక్షలు రూపాయలు ఫోన్‌పే వేయించుకున్నారు. అయితే దర్శనాలు ఇప్పించకపోగా సమాదానం కూడా లేకపోయింది. దీంతో బాధితురాలు టిటిడి విజిలెన్స్ వింగ్‌కు ఫిర్యాదు చేశారు. విజిలెన్స్ వింగ్ తిరుమల 2టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుల కోసం విచారణ చేస్తున్నారు.

# ఎమ్మెల్యే పరిటాల సునీత భూ దోపిడీకి తెరతీశారు

## కోట్లు విలువైన భవనాలను కూల్చేశారు - పాపంపేట, నారాయణపురం వాసులకు నోటీసులు - వైఎస్సార్సీనేత, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



**అనంతపురం, మార్చి 16, ప్రభాతవార్త బ్యూరో** అనంతపురం శివారులో పాపంపేట వద్ద సర్వేనెంబర్ 106లో 68 సెంట్ల స్థలంలో ఉన్న ఇళ్లను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రోద్బలంతో హైకోర్టు ఆదేశాలను ధిక్కరించి దౌర్జన్యంగా కూల దోసారని , జిల్లా కలెక్టర్, ఆర్డిఓ, జిల్లా ఎస్పీ తదితర అధికారులు ఏం చేస్తున్నట్లు అని వైసీపీ నేత, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి ప్రశ్నించారు. జిల్లా కేంద్రమైన అనంతపురం శివారులో కోర్టుల ఆదేశాలను తుంగలోకి ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ కను సన్నల్లో ఇన్ని దురాగతాలు జరుగుతున్నాయని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ బాబు తెలిసే జరుగుతున్నాయని ఆయన నిలదీశారు. ఇల్లు కూల్చివేతపై కంటెంట్ ఆఫ్ కోర్టు కింద మళ్లీ న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని ఆయన వెల్లడించారు.. ఆదివారం అనంతపురం వైసీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి మాట్లాడారు. అనంతపురం శివారులో పాపంపేట వద్ద సర్వే నెంబరు 106 లో 68 సెంట్ల విలువైన స్థలంలో 40 ఏళ్లకు పైగా ఉన్న నివాసం ఉంటున్న వారిని బలవంతంగా ఖాళీ చేయించి ఇళ్లను కూల్చివేశారని, కోట్ల విలువైన స్థలాలను కాజేసేందుకు ఎమ్మెల్యే పరిటాల సునీత యత్నిస్తోందని ఆయన ఆరోపించారు.. దాదాపు 2000 కోట్ల రూపాయల స్థలాలను చేజిక్కించుకునేందుకు ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అనంతపురం రూరల్ మండలంలో స్థలలపై అవగాహన ఉన్న ఎమ్మార్వో మోహన్ ను ఇక్కడికి పోస్టింగ్ వేపించుకొని తతంగం నడుపుతున్నారని మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి విమర్శించారు. అనంతపురం రూరల్ మండలం పాపంపేట పరిధిలో గత మూడు నాలుగు నెలల్లో వందలాది మందికి నోటీసులు ఇచ్చారని, దాదాపు నూరు ఎకరాల సొత్రియం భూములకు సంబంధించి రెవెన్యూ అధికారుల ద్వారా నోటీసులు ఇప్పిచ్చారని ఆయన చెప్పారు. నారాయణపురం పరిధిలో కూడా శోత్రియం భూముల విషయంలో 400 మందికి నోటీసుకి ఇచ్చారని ఆయన వెల్లడించారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత భూదోపిడికి తెర తీయడం వల్లే ఈ సంఘటనను చోటు చేసుకుంటున్నాయని మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు.

# దుర్గమ్మ ఆలయంలో 19న హుండీ లెక్కింపులు

**ఇంద్రకీలాద్రి, మార్చి 16, ప్రభాత'వార్త' :** దుర్గమ్మ వారి ఆలయంలో ఈనెల 19న హుండీ లెక్కింపులు జరుగుతాయని ఇఓ కె రామచంద్ర మోహన్ తెలిపారు. ఉదయం 8 గంటలకు శ్రీ మల్లేశ్వర మహామండపంలో ఈ హుండీ లెక్కింపులు జరుగుతాయన్నారు. దుర్గమ్మవారిని ఆదివారం మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, హడ్కో అధికారులు దర్శించుకున్నారు. వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలను అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు. నృత్యనీరాజనం: దుర్గమ్మవారి ఆదివారం జరిగిన నృత్య నీరాజనం ఆద్యంతం రసభరితంగా కొనసాగింది. విజయవాడలోని శ్రీ ధనలక్ష్మి కూచిపూడి నృత్యాలయ కి చెందిన ఆచార్యులు ఎస్ ధనలక్ష్మి నేతృత్వంలో కళాబృందం నృత్యకళార్చనను అద్భుతంగా అందించారు. మూషికవాహన, అఖిలాండేశ్వరి, శివస్తుతి, గరుడగమన, తందనాన, జయ జనార్ధనా తదితర కీర్తలకు అనుగునంగా నృత్యరీతులను 20మంది కళాకారులు ప్రదర్శించి ఆహుతుల మన్ననలందుకున్నారు. కార్యక్రమం అనంరం కళాకారులకు దుర్గమ్మవారి దర్శనం కల్పించిన అధికారులు వారికి దుర్గమ్మవారి ప్రసాదాలు, చిత్రపటం అందించారు. దుర్గమ్మవారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన ఎం ఎం విశ్వరాజ్ రు.1,01,116ల విరాళాన్ని ఆలయాధికారులకు ఆదివారం అందించారు. ఈ సందర్భంగా దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలను అందించారు. వేదపండితులు ఆశీర్వచనాలందించారు.



హడ్కో అధికారులకు దుర్గమ్మవారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

# నిర్మాణాత్మక విమర్శలను స్వాగతిస్తా

## పోడ్‌కాస్ట్‌లో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, మార్చి 16:** నిర్మాణాత్మక విమర్శలను తాను ఎల్లవేళలా స్వాగతిస్తానని, నిజానికి ప్రజాస్వామ్య వ్యవస్థకు విమర్శ అనేది ఆత్మవంటిదని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. అమెరికాకు చెందిన కృత్రిమ మేధప రిశోధకుడు లెక్స్ ఫ్రిడ్‌మాన్ నిర్వహించిన పాడ్‌కాస్ట్‌లో ప్రధానిమోడీ అనేక అంశాలను స్పృశించారు. నాశక్తిపేరులో లేదని, 140 కోట్లమంది భారతీయుల మద్దతు, దేశ సంస్కృతి, వారసత్వంలోనే ఉందని అన్నారు. తాను ప్రపంచనేతలతో చేయికలిపినవుడు అది మోడీచేస్తున్నది కాదని, 140 కోట్లమంది భారతీయులుచేస్తున్నట్లేనని అన్నారు. శాంతిగురించి మేం మాట్లాడితే ప్రపంచం మామాట వింటుందని, ఎందుకంటే గౌతమబుద్ధుడు, మహాత్మాగాంధీ జన్మించిన పవిత్రభూమి భారత్ అని అన్నారు. తన ప్రమాణస్వీకారానికి పాకిస్థాన్‌ను కూడా ఆహ్వానించానని, కానీ శాంతికోసం ప్రయత్నంచేసినపుడల్లా శత్రుత్వం, ద్రోహమే ఎదుర యిందన్నారు. ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరిచేందుకు ఇస్లామాబాద్ నాయకత్వంపైనే ఆధారపడి ఉంటుందని మోడీ చెప్పారు. తన బాల్యం మొత్తం పేదరికంలోనే గడిచిందని, తన తెల్లబూట్లను మెరిపించేందుకు పాఠశాలలో వాడిపడేసిన సుద్దముక్కలను సేకరించి తెచ్చుకునేవాడినని చెప్పారు. ఓ గొప్పసత్కార్యం కోసం ఉన్నత శక్తి తనను ఇక్కడకు పంపించిందని, తాను ఒంటరిని కాదని, తనను ఇక్కడికి పంపించినవారే నాకు తోడుగా ఎల్లవేళలా ఉంటారన్నారు.

# ఎండిన పంటల వివరాలతో నివేదిక: వ్యవసాయ శాఖ అంచనా

**హైదరాబాద్, మార్చి 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎండల తీవ్రతకు ఎండిన పంటల వివరాలతో కూడిన నివేదికను రూపొందించేందుకు వ్యవసాయ శాఖ సిద్ధమైంది. రాష్ట్రంలో ఎక్కడెక్కడ పంటలు ఎండుతున్నాయనేదానిపై క్షేత్ర స్థాయిలో అధికా రులు వివరాలను సేకరించేపనిలో ఉన్నారు. గ్రామాలు, క్లస్టర్ల వారీగా ఎండుతున్న పంటల వివరాలు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవోలు) వివరాలు సేకరిస్తున్నారు.

## బెంగళూరులో భారీగా సింథటిక్ డ్రగ్స్ పట్టివేత

# నైజీరియాకు చెందిన ఇద్దరు మహిళల అరెస్టు

**హైదరాబాద్, మార్చి 16, ప్రభాతవార్త:** సిలికాన్ సిటీ బెంగళూరులో మరోసారి భారీగా మాదకద్రవ్యాలు పట్టుబడ్డాయి. భారత్‌లో అక్రమంగా వుంటూ విదేశాల నుంచి డ్రగ్స్ తెప్పించి ఇక్కడి నగరాలలో స్మగ్లింగ్ చేస్తున్న ఇద్దరు నైజీరియన్లను మంగళూరు విమానాశ్రయంలో ఆదివారం నాడు పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వీరి వద్ద నుంచి 74 కోట్ల రూపాయల విలువచేసే ఎండిఎంఎ డ్రగ్స్‌ను జప్తు చేశారు. నైజీరియాకు చెందిన బాంబా ఫాంటా (31) 2020లో భారత్‌కు బిజినెస్ వీసాపై వచ్చి ఇక్కడే అ క్రమంగా వుంటూ డ్రగ్స్ దందాలు సాగిస్తోంది. ఈమెకు నైజీరియాకే చెందిన మరో మహిళ అబిగైల్ అడోరిస్ (30) తోడుగా వుంటోంది. ఈమె కూడా భారత్‌లో 2016లో విజిట్ వీసాపై వచ్చి గడువు ముగిసిన తరువాత అక్రమంగా వుంటోంది. వీరిద్దరు గతంలో రెండుసార్లు డ్రగ్స్ స్మగ్లింగ్ చేస్తూ బెంగళూరులో పట్టు బడ్డారు. తాజాగా ఇద్దరు ఢిల్లీ నుంచి విమానంలో 37 కిలోల ఎండిఎంఎ డ్రగ్స్‌ను ప్యాకెట్లలో నింపి మంగళూరు విమానాశ్రయానికి తెచ్చారు. విమనశ్రయంలో వీరి ద్దరు దిగ గానే అనుమానం వచ్చిన పోలీసులకు తనిఖీ చేయగా సింథటిక్ డ్రగ్స్ ఎండిఎంఎ పౌడర్ రూపంలో పట్టుబడింది. దీని విలువ 74 కోట్ల రూపాయలుగా తేలిందని మంగళూరు పోలీసు కమిషనర్ అనుపం అగర్వాల్ మీడియాకు తెలిపారు. నిందితుల వద్ద 18 వేల రూపాయల నగదుతో పాటు నాలుగు సెల్‌ఫోన్లను, గడువు ముగిసిన పాస్‌పోర్టులను జప్తు చేశారు. బెంగళూరలో డ్రగ్స్ దందాలు సాగించే మరో నైజీరియన్ నేరగాడు పీటర్‌ను ఇటీవలే అరెస్టు చేయగా అతను ఇచ్చిన సమాచార ం ఆధారంగా ఇద్దరు మహిళలు పట్టుబడ్డారు. గత ఏడాది వీరిద్దరు ఢిల్లీ బెంగళూరు నగరాల మధ్య 22 సార్లు, ఢిల్లీ ముంబాయి మధ్య 37 సార్లు విమాన ప్రయా ణాలు సాగించారని పోలీసు కమిషనర్ తెలిపారు. వీటిపై విచారణ చేస్తున్నామని, వీరితో లింకులున్న స్మగ్లర్ల వివరాలు సేకరిస్తున్నామని ఆయన తెలిపారు.



బెంగళూరులో డ్రగ్స్‌తో పట్టుబడ్డ నైజీరియన్లు

# కారు ఢీకొని మహిళ మృతి

**బుచ్చి (నెల్లూరు)మార్చి 16 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం జాతీయరహదారిలో కారు ఢీకొని మహిళ మృతి చెందింది. కారు నెల్లూరు వైపు వెళుతున్న సమయంలో జెండాదిబ్బకు చెందిన మహిళ రోడ్డు దాటుతుండగా కారు ఢీకొనడంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పోస్టు మార్టరం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఆగని చికెన్ వేస్ట్ అక్రమ రవాణా!

## - నేతల ప్రోత్సాహమా.. మత్స్యశాఖ అధికారుల సహకారమా?

## - ప్రత్యేక దృష్టి సారించిన కోవూరు పోలీసులు

**కోవూరు, (నెల్లూరు) మార్చి 16 ప్రభాతవార్త :** ఒకవైపు పర్యావరణాన్ని పూర్తిస్థాయిలో విఘాతం కలిగించే చికెన్ వేస్ట్ కోవూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఏ ప్రాంతంలో కూడా చేపల గుంటలకు వేయరాదని ఈ మేరకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తన కార్యాలయంలో మత్స్యశాఖ, పోలీస్ శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చికెన్ వేస్ట్‌పై ప్రత్యేక సూచనలు కూడా వారికి ఇచ్చారు. ఈ నేపథ్యంలో కొంతకాలం సర్దుమనిగిన ఈ చికెన్ వేస్ట్ మాఫియా మరలా చెన్నై, బెంగళూరు ప్రాంతాల నుంచి రవాణాకు చర్యలు చేపట్టింది. గత జనవరిలో కోవూరు పోలీసులు చెన్నై నుంచి , బెంగుళూరు నుంచి వస్తున్న నాలుగు వాహనాలను సీజ్ చేసి వాటిపై కేసులు కూడా నమోదు చేశారు. గురువారం కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి ఈ చికెన్ వేస్ట్‌పై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి కోవూరు సర్కిల్ పరిధిలో ఎక్కడా కూడా చికెన్ వేస్ట్ రవాణా చేయరాదని, చేస్తే వాటిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరికలు జారీ చేశారు. అయినా కూడా ఆదివారం తెల్లవారుజామున చెన్నై, నుంచి జాతీయ రహదారి మీదుగా వెళ్తున్న వాహనాన్ని ఎఫ్‌డీవో శ్రీనివాసులు సూచనల మేరకు ఈ విషయాన్ని కోవూరు పోలీసుల దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్, పోలీసులు వాహనాన్ని ఆపి పరిశీలించగా అందులో మొత్తం దుర్వాసన వెదజల్లుతున్న 17 చికెన్ వేస్ట్ డ్రమ్ములు ఉన్నాయి. ఈ మేరకు వీటిని అక్రమంగా రవాణా చేస్తున్న వాహన డ్రైవర్ ఈగ నాగరాజు, క్లీనర్ దాసరి గణేష్‌లపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశారు. అనంతరం ఈ చికెన్ వేస్ట్‌ను సమీపంలో ఉన్న పెన్నానది ప్రాంతంలో జేసీబీ ద్వారా గొయ్యి తీసి అందులో పూడ్చేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీవో శ్రీనివాసులు మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గంలో ఏ ప్రాంతంలో అయినా ఈ అక్రమ చికెన్ వేస్ట్ రవాణా అవుతుంటే తన దృష్టికి గానీ, పోలీసుల దృష్టికి గానీ తేవాలని



గొయ్యి తీసి పూడుస్తున్న దృశ్యం

ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ చికెన్ వేస్ట్ అక్రమ రవాణాకు అధికార పార్టీ నేతల ప్రోత్సా హం ఉందా.. లేక మత్స్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల ప్రోద్భలం ఉందా అనేది సందిగ్ధంగా మారింది. కోవూరు ఎమ్మెల్యే మాత్రం నియోజకవర్గంలో ఎక్కడా కూడా చికెన్ వేస్ట్ అక్రమ రవాణా రావడానికి వీలు లేదని ఖరాఖండిగా చెప్పేశారు.

# బిజెపి ఎంపి అరుణ ఇంట్లో ఆగంతకుడు చొరబాటు

## కేసు నమోదు చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు ఘటనపై ఆందోళన వ్యక్తం చేసిన బిజెపి నేత

**హైదరాబాద్ (పంజగుట్ట) మార్చి 16 ప్రభాతవార్త:** బీజేపీ ఎంపీ డీకే అరుణ ఇంటిలో దొంగలు పడిన సంఘటన జూబ్లీహిల్స్‌లో కలకలం రేపింది. గుర్తు తెలియని ఆగంతకుడు ఇంటిలో చొరబడి దాదాపు గంటన్నర ఉండి ఏమీ తీసుకుని వెళ్ళకపోవడంతో పలు అనుమానాలు తావిస్తోంది. ఈ విషయమై ఎంపీ ఆదివారం ఘటనపై పోలీసులు విచారణ జరిపించాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు.ఘటనపై ఇప్పటికే డీకె అరుణ కుటుంబీకులు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2రోజులుగా ఎంపీ డీకే అరుణమహబూబ్ నగర్‌లోనే ఉన్నారు.. శనివారం అర్ధ రాత్రి 3 గంటలకు కిచెన్ కిటికీ తీసి ఇంట్లోకి వచ్చారు ఇల్లంతా ఒక గంటన్నర పాటు ఇంట్లో కలియ తిరిగారు . ఆదివారం ఉదయం 6గంటలకు విషయం తెలిసింది. ఆగంతకుడు కిచెన్‌లో కెమెరా కట్ చేశాడు, కింద గ్లాస్ తీసేసి ఇంట్లోకి వచ్చాడు. ముఖానికి మాస్క్, గ్లౌస్, బ్యాగ్ , షూ ధరించాడు. ఫస్ట్ ఫ్లోర్ లోకి వెనుక భాగం నుంచి కిచన్ కిటికిలోంచి లోనికి ఎంటర్ అయ్యాడు. నక్కి నక్కి తిరుగుతూ రెక్కీ చేసిన తీరు అను మానాలకు తావిస్తోంది.

కిచెన్‌లో కెమెరా కట్ చేశాడు ,డైనింగ్ హాల్ లో కెమె రా తిప్పేసాడు. డ్రాలు తెరిశాడు, అన్ని చిందర వందర పడేశాడు. ఫస్ట్, సెకెండ్ ఫ్లోర్లలోని అన్నిరూములు తిరిగాడు. తెల్లవారు జామున 4:30నిమి షాలకు ఇంట్లోంచి వెళ్లిపోయాడు. గంటన్నర పాటు నా ఇంట్లో ఏం రెక్కీ చేశాడో అర్థం కావడం లేదు.

## బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసిన
# మరో యూ ట్యూబర్‌పై కేసు

**హైదరాబాద్, మార్చి 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్న యూ ట్యూబర్లపై పోలీసులు వరుసగా కేసులు నమోదు చేస్తున్నారు. ఇప్పటికే పలువురు యూ ట్యూబర్లపై కేసులు నమోదు కాగా తాజాగా మరో యూ ట్యూబర్ హర్షసాయిపై సైబరాబాద్‌లో బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసినందుకు కేసు నమోదయ్యింది. ఆర్టీసీ ఎండి సజ్జనార్ చేసిన ఫిర్యాదు మేరకు హర్షసాయిపై కేసు నమోదయ్యింది. బెట్టింగ్ యాప్స్‌ను హర్షసాయి ప్రమోట్ చేయడంతో పాటు ఇది తప్పే మీ కాదని, తన వృత్తిలో భాగమని సదరు యూ ట్యూబర్ చెప్పడంతో సజ్జనార్ ఇదే విషయాన్ని సైబరాబాద్ పోలీసుల దృష్టికి తేవడంతో వారు కేసు నమోదు చేశారు. హర్షసాయి నార్సింగిలో వుంటుండడంతో అతనిపై సైబరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇతనిపై ఇప్పటికే అత్యాచారం కేసు ఉండడం గమనార్హం.

# బూతులకు రాయబారి కెసిఆర్
## రైతురుణమాఫీ హరీష్‌రావు కళ్లకు కనపడటంలేదా?
## ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**హైదరాబాద్, మార్చి 16,ప్రభాతవార్త:** బూతులకు అంబాసిడార్ కెసిఆర్, తెలంగాణ ఉద్యమం సమయంలో కెసిఆర్ ఎలా దూషించారో అందరికి తెలుసు అని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. సిఎల్‌పిలో ఆదివారం విలేఖరులతో ఆయన మాట్లాడుతూ కేంద్రమంత్రిని పట్టుకొని రండ అన్న చరిత్ర కెసిఆర్‌ది అని నెమరేసుకున్నారు. కెసిఆర్ దూషణలు హరీష్‌రావుకు వినసొంపుగా ఉన్నాయా అని బీర్ల ఐలయ్య నిలదీశారు. ఆరడుగులు పెరిగినా హరీష్‌రావుకు దిమాక్ పెరగలేదు. అధికారం కోల్పోయాక బిఆర్ఎస్ నాయకులు పిచ్చెక్కి మాట్లాడుతున్నారు. మాజీ మంత్రి హరీష్‌రావుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి ఉందా అని ప్రశ్నించారు. హరీష్‌రావుకు కండకావరంతో బలుపెక్కి తోలు మందమెక్కి మా సిఎంపై మాట్లాడుతున్నాడు అని ఐలయ్య విమర్శించారు. హరీష్‌రావు నోరును యాసిడ్‌తో కడుగుతాం జాగ్రత్త అని హెచ్చరించారు. పదేళ్లలో రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచెత్తింది కెసిఆర్ కాదా అని నిలదీశారు. బిఆర్ఎస్ చేసిన అప్పులు తప్పులను మా సిఎం సరిదిద్దుతున్నారు అని చెప్పారు. ఒకవైపు సంక్షేమం మరోవైపు అభివృద్ధిని మా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ముందుకు తీసుకెళ్తున్నాం అని వివరించారు. మహిళలు, రైతులు, యువతకు కాంగ్రెస్ పెద్దపీట వేస్తున్నదని అన్నారు. హరీష్‌రావుకు రైతు రుణమాఫీ నీ కళ్లకు కనపడటంలేదా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి పాలనను చూసి ఓర్వలేక మతిభ్రమించి హరీష్‌రావు మాట్లాడుతున్నాడు అని అన్నారు. మా సిఎం పైన మరోసారి మాట్లాడితే సహించం అని అన్నారు.

# రుణమాఫీ రైతులకు తెలుసు
## బూతు పురాణానికి పేటెంట్ మీ మామ కెసిఆర్‌దే:
## భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 16,ప్రభాతవార్త:** రుణమాఫి రైతులకు తెలుసు హరీష్‌రావు మీరు అదే అంశాన్ని పదేపదే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సవాళ్ళు విసరడం మానుకో అని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి హితవు చెప్పారు. ఆదివారం గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ మేం ఎన్ని వేల ఉద్యోగాలు ఇచ్చామో యువతకు తెలుసు 24లక్షల మంది రైతులకు రుణమాఫి చేశామని ఆయన ప్రకటించారు. మీ మామ కెసిఆర్ మాట్లాడితే నీతులు ఎదుటి వాళ్ళు మాట్లాడితే భూతులా, భారతదేశంలో బూతు పురాణానికి పేటెంట్ హక్కు అంటూ ఉంటే అది మీ మామ కెసిఆర్‌కు మాత్రమే ఉంటుంది అని హరీష్‌రావు నుద్దేశించి కిరణ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. గత పది సంవత్సరాలు ముఖ్యమంత్రి హోదాలో ఉండి మీ మామ కేసిఆర్ మాట్లాడిన బూతులు ఒక పుస్తకమే రాసి ఉండొచ్చు అని అభిప్రాయపడ్డారు. ప్రజా సంక్షేమం కోసం ప్రజాపాలనను అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై గాలి మాటలు మాట్లాడటం తగదని అన్నారు. తెలంగాణ ప్రజలు రానున్న రోజుల్లో మీవైపు ఉండరని అగ్గిపెట్టరావు గుర్తుంచుకోవాలని అన్నారు. ఇకనైనా హరీష్‌రావు చిల్లరమల్లర రాజకీయాలు మాటలు బంద్ చేసుకో అని హితవుచెప్పారు. మాప్రభుత్వం ఇచ్చే ఉద్యోగాలు, సంక్షేమ పథకాలపై ప్రజలకు తప్పుడు లెక్కలు చెప్పి మోసం చేయవద్దని అన్నారు.

# ఢిల్లీ టూర్ నన్ను పూర్తిగా మార్చేసింది..
## సంగారెడ్డి అభివృద్ధి, సినిమాపై దృష్టిపెడతా
## కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి

**హైదరాబాద్, మార్చి 16,ప్రభాతవార్త:** ఢిల్లీ టూర్ నన్ను పూర్తిగా మార్చేసింది, దీని పరిణామాలు ఎటు పోతాయో నాకు తెలియదు,సంగారెడ్డి అభివృద్ధి సినిమాపై దృష్టిపెడతా అని కాంగ్రెస్ వర్కింగ్‌ప్రసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ మా ప్రభుత్వం అధికారంలో ఉంది కాబట్టి ఎక్కువ నిధులు సంగారెడ్డికి తీసుకుపోయేందుకు ప్రయత్నం చేస్తా ప్రస్తుతం రాష్ట్రపార్టీలో నా అవసంలేదు అని ఆయన ఖరాఖండిగా చెప్పారు. ఉగాదికి నా సినిమా షూటింగ్ ప్రారంభమవుతోంది. సంగారెడ్డికి మొగిలయ్య 18 ఏళ్ళక్రితం రాసిన పాటను విడుదలచేస్తాం అని జగ్గారెడ్డి వెల్లడించారు."ఏ వార్ ఆఫ్ లవ్ " సినిమాలో మున్సిపల్ చైర్మన్‌గా ఎలా అయ్యాననేది చూపిస్తాం అంతేకాదు విద్యార్థినేతగా కౌన్సిలర్‌గా నా రోల్ వెండితెరపై ప్రజలకు పరిచయం చేసేలా ఉంటుందని ఆయన వివరించారు. లవ్ ఫ్యాక్షన్, ఎమోషన్, పొలిటికల్ సినిమాగా ఉండబోతుంది. 'ఏవార్ ఆఫ్ లవ్' క్యాప్షన్ డైరెక్టర్ ముందే నిర్ణయించుకొన్నారు. నాకథకు,లవ్‌కు సంబంధం లేదు. కథచెప్పే క్రమంలో స్టార్టింగ్ అంతా డైరెక్టర్ చెప్పారు. మిగితా అంతా నా లైఫ్‌లో జరిగిన కొన్ని విషయాలు చెప్పా కొన్ని విషయాలలో డైరెక్టర్ కన్విన్స్ అయ్యారు. నేను సినిమాల్లో వెళ్ళడానికి ఢిల్లీలో టూర్ పనికొచ్చింది. నా రాజకీయానికి సంబంధంలేదు నేను రాజకీయాల్లో ఉన్నా సినిమా ద్వారా కొత్తగా రాజకీయాల్లో అడ్వాంటేజ్ తీసుకొనేదేమి లేదు అని జగ్గారెడ్డి వివరించారు. గత మూడునెల క్రితమే డైరెక్టర్ రామనుజం తనకు చూపిన ఫోటో చూసి కనెక్ట్ అయ్యానని ఆయన చెప్పుకొచ్చారు. 2013 నుంచి తనలాంటి వ్యక్తి కోసం చూస్తున్నానని టైం ఇస్తారా అని డైరెక్టర్ అడుగగానే టైం ఇవ్వలేనేమోననుకున్నా అని అన్నారు. కానీ ఆ తరువాత డైరెక్టర్ చూపెట్టిన ఫోటో చూసి ఇది ఖచ్చితంగా చేయాలని డిసైడ్ అయ్యా అని జగ్గారెడ్డి చెప్పారు.



ఆదివారం పెద్దాపూర్ గ్రామంలో జరిగిన మల్లన్న స్వామి బోనాల జాతర ఉత్సవం

## ఘనంగా మల్లన్న బోనాలు
# అరవై వేల బోనాలతో మొక్కులు చెల్లింపు

**మెట్‌పల్లి, ప్రభాతవార్త:** జగిత్యాల జిల్లా మెటుపల్లి మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో మల్లన్న స్వామి బోనాల జాతర ఉత్సవం ఆదివారం అత్యంత వైభవంగా, ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాలతో పాటు మహారాష్ట్ర, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలన్ని భక్తులతో కిక్కిరిసి పోయాయి. భక్తులు ఉపవాస దీక్షలుబూని నియమనిష్టలతో వండిన బోనాలను స్వామి వారికి సమర్పించి,మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఒకే సారి సుమారు 60 వేలకు పైగా భక్తులు బోనాలను నెత్తిన పెట్టుకుని ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశారు. అనంతరం మల్లన్నకు బోనాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. గొర్రెపిల్లలను, బెల్లంను మల్లన్న స్వామికి కానుకగా సమర్పించారు. ఈ సందర్భంగా శివసత్తుల పూనకాలు, పోతురాజులు, ఒగ్గుడోలు కళాకారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. బోనాల అనంతరం రథోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు.జాతర ఉత్సవంలో భాగంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు,తదితర ప్రజాప్రతినిధులు హాజరై ప్రత్యేక పూజలు చేసి,మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మహేశ్వర్ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా..మెటుపల్లి డీఎస్పీ రాములు పర్యవేక్షణలో కోరుట్ల సిఐ సురేష్ బాబు ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

# సాగు, తాగు నీరు,విద్యుత్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు
## అధికారులను ఆదేశించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి




ఆదివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**నల్గొండ ప్రతినిధి, ప్రభాతవార్త మార్చి 16:** జిల్లాలో సాగునీటి సౌకర్యం పెరగడం, ఇతర కారణాలవల్ల విద్యుత్ డిమాండ్ సైతం బాగా పెరిగిందని, వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని ఈ వేసవిలో సాగు, తాగునీటికి ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అధికారులతో వ్యవసాయ నీటిపారుదల విద్యుత్తు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం జిల్లాలో సుమారు లక్ష ఎకరాల ఆయకట్టు పెరిగిందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని ఈ సంవత్సరం ఎక్కువ వరి ధాన్యం ఐకెపి సెంటర్లకు వచ్చే అవకాశం ఉన్నందున ముదునుండే ఏర్పాట్లు చేసుకోవాలని, ధాన్యం కొనుగోలుకు అవసరమైన టార్పాలిన్లు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. కాగా వ్యవసాయ శాఖకు 80 క్లస్టర్లు ,ఏఈ పోస్టులు కావాలని జిల్లా వ్యవసాయ అధికారి సమావేశం దృష్టికి తీసుకురాగా, మంత్రి తక్షణమే స్పందించి సమావేశ మందిరం నుండే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో ఫోన్ లో మాట్లాడి క్లస్టర్లను మంజూరు చేయాలని కోరగా, అందుకు మంత్రి స్పందించారు.నెలలోపు ఈ క్లస్టర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని మంత్రి ప్రకటించారు. జిల్లాలో సన్న రకం ధాన్యాన్ని ప్రోత్సహించాలని, ప్రస్తుతం సాగులో ఉన్న పంటలతోపాటు ,తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఇటు ఇరిగేషన్ అధికారులు , అటు ఆర్డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అదే సమయంలో విద్యుత్ కి ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని, నల్గొండ పట్టణంతో పాటు, గ్రామాలలో ఎలాంటి కోతలు ఉండవద్దని, ఆయకట్టు చివరి భూముల వరకు సాగునీటిని అందించేందుకు జిల్లా యంత్రాంగం చేస్తున్న కృషిని మంత్రి అభినందించారు. వచ్చే నెల ఒకటి లేదా రెండు తేదీలలో 36 కోట్ల రూపాయలతో నిర్మించనున్న జిల్లా కలెక్టర్ కార్యాలయ అదనపు భవనాల నిర్మాణాలకు శంకుస్థాపనతో పాటు, 15 సబ్ స్టేషన్ లకు శంకుస్థాపన,మాడుగుల పల్లి పోలీస్ స్టేషన్ భవన శంకుస్థాపన, అలాగే ఇతర ముఖ్యమైన కార్యక్రమాలకు శంకుస్థాపనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నల్గొండ జిల్లా కేంద్రంలో కొత్త పోలీస్ క్వార్టర్ల నిర్మాణం మంజూరు రాబోతున్నదని, అలాగే డిఎస్పీ ఆఫీస్ మంజూరైన కారణంగా వాటికి శంకుస్థాపన చేస్తామని తెలిపారు.520 కోట్ల రూపాయలతో మంజూరైన బైపాస్ రోడ్డు టెండర్లు పూర్తయ్యాయని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

సమావేశం ప్రారంభమైన వెంటనే జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ఎమ్మార్పీ ,ఎస్ఎల్బీసీ హై లెవెల్ కెనాల్ ద్వారా అందిస్తున్న సాగునీరు, పంటల పరిస్థితి, తాగునీరు, విద్యు త్తు, తదితర అంశాలపై వివరాలను మంత్రికి తెలియజేశారు. అదనపు కలెక్టర్ జె.శ్రీని వాస్, మిర్యాల గూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ట్రాన్స్కో ఎస్ఈ వెంకటేశ్వర్లు, వ్యవసాయ అధికారి శ్రవణ్, ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులు ఈ సమీక్ష సమావేశానికి హాజరయ్యారు.

# సోషల్ మీడియాలో స్వీయ నియంత్రణ ఉండాలి: జస్టిస్ సుదర్శన్ రెడ్డి
## ప్రభుత్వం ప్రత్యేక మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి:
## ఎమ్మెల్సీ కోదండరాం, సిపిఐ నేత చాడ వెంకటరెడ్డి




ఆదివారం జరిగిన సదస్సులో మాట్లాడుతున్న జస్టిస్ సుదర్శన్ రెడ్డి

**హైదరాబాద్, మార్చి 16,ప్రభాతవార్త:** సోషల్ మీడియాలో స్వీయ నియంత్రణ ఉండాలని, భావ ప్రకటనకు మాత్రమే స్వేచ్ఛ ఉంది తప్ప బూతుకు స్వేచ్ఛ లేదని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. ప్రజాక్షేత్రంలో లేని ముఖ్యమంత్రి కుటుంబంలోని మహిళలను బండబూతులు తిట్టడం స్వేచ్ఛ కిందికి రాదన్నారు. ఈమేరకు ఆదివారం తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల సంఘం (టీయూజేఎస్) ఆధ్వర్యంలో సోషల్ మీడియాలో వాడుతున్న భాష సమంజసమేనా..? అనే అంశంపై సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. టీయూజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎంఎం రహమాన్ అధ్యక్షత జరిగిన సమావేశంలో సోషల్ మీడియాలో జరుగుతున్న అభ్యంతరకర అంశాలపై విస్తృతంగా చర్చ కొనసాగింది. ఈ సందర్భంగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ భిన్నంగా ఆలోచించేవారికి స్వేచ్ఛ అవసరమని అభిప్రాయపడ్డారు. అయితే అసభ్యంగా మాట్లాడటం ఏ సంస్కృతిలోనూ లేదన్నారు. తెలంగాణ ఉద్యమంలో కూడా ఇలాంటి పరిస్థితి చూడలేదని కాబట్టి స్వేచ్ఛను ప్రభుత్వాల చేతిలో పెట్టకుండా స్వీయ నియంత్రణలో ఉంచుకోవాలన్నారు. బూతు భాషా ప్రయోగం చేస్తే కఠినంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా సమాజానికి ఉపయుక్తమయ్యే అంశాలు కూడా ఉన్నాయని, అయితే కొందరి వల్ల అది పక్కదారి పట్టి మీడియా విలువలను దిగజారుస్తోందని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో జస్టిస్ సుదర్శన్ రెడ్డి నేతృత్వంలో మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని పలువురు వక్తలు సూచించారు. ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ సోషల్ మీడియాను సరిగ్గా వాడకుంటే చివరకు మనకే ఇబ్బందులొస్తాయని హెచ్చరించారు. సీపీఐ మాజీ శాసన సభా పక్షనేత చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎక్కువగా ఫేక్ న్యూస్ వేగంగా వ్యాపిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ చంద్రకుమార్, పీఓడబ్ల్యూ సంధ్య, మహిళా జర్నలిస్టు తులసీచంద్, కరుణాకర్ దేశాయ్, సొగరాబేగం, సోమాజీగూడ ప్రెస్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు వేణుగోపాల్, జస్ట్ యూనియన్ కన్వీనర్ రమణ, టీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, బసవపున్నయ్య, రఫీ, ప్రకాశ్, టీయూజేఎస్ ఉపాధ్యక్షులు పసునూరి రవీందర్, టి రమేష్‌బాబు సహా వివిధ సంస్థలకు చెందిన సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.


# పిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షుడుగా గుండు లక్ష్మణ్
## ఏకగ్రీవంగా ఎన్నుకున్న 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

**హైదరాబాద్, మార్చి 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పిఆర్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షులుగా గుండు లక్ష్మణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మొన్నటి వరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్న పింగిలి శ్రీపాల్ రెడ్డి, గత నెల 27న జరిగిన నల్గొండ-వరంగల్- ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా విజయం సాధించారు. సంఘం నూతన రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక కోసం ఆదివారం 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాష్ట్ర అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు బి మోహన్ రెడ్డి, మాజీ అధ్యక్షులు పి వెంకట్ రెడ్డి, మహేందర్ రెడ్డి, 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. గతంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన గుండు లక్ష్మణ్‌ను రాష్ట్ర అధ్యక్షుడిగా 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్ రెడ్డి తెలిపారు. 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల సమావేశం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో గుండు లక్ష్మణ్‌ని రాష్ట్ర అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గుండు లక్ష్మణ్ గతంలో సంఘ ప్రధాన కార్యదర్శిగా, సంగారెడ్డి జిల్లా అధ్యక్షునిగా, ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షునిగా, ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.

రాష్ట్ర సంఘ అధ్యక్షు నిగా ఎన్నికైన గుండు లక్ష్మణ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సేవలందించే అవకాశం తనకు కల్పించినందుకు రాష్ట్ర సంఘానికి.. తనను ఎన్నుకున్న 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు ధన్యవాదాలు తెలిపారు.

# గ్రూప్1 అభ్యర్థుల అనుమానాలను నివృత్తి చేయాలి
## ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో గ్రూప్ అభ్యర్థుల భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మార్చి16:** గ్రూప్1 పరీక్షలు, ఫలితాలపై అభ్యర్థులు లేవనెత్తుతున్న అనుమానాలను ప్రభుత్వంతో పాటు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నివృత్తి చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. గ్రూప్1,2,3 పరీక్షల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో 11 విశ్వవిద్యాలయాల విద్యార్థుల ప్రతినిధులు ఆదివారం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కలిసి చర్చించారు.తాము వ్యక్తపరుస్తున్న అనుమానాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, శాసనమండలిలో ఈ అంశాన్ని లేవనెత్తాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ పేపర్ల మూల్యాంకనంలో తెలుగు మీడియం అభ్యర్థులకు అన్యాయం జరిగిందని విద్యార్థులు తన దృష్టికి తీసుకు వచ్చారని తెలిపారు. ట్రాన్స్‌లేషన్ సమస్య వల్ల ప్రొఫెసర్లు, డిగ్రీ కాలేజ్ లెక్చరర్లు సరిగ్గా మూల్యాంకనం చేయలేక పోయారని, తద్వారా మార్కుల్లో వ్యత్యాసాలు ఏర్పడ్డాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నా రని అన్నారు. గ్రూప్ 1 పరీక్షల్లో ప్రిలిమ్స్ కి ఒక హాల్ టికెట్ నంబరు, మెయిన్స్‌కి మరొక హాల్ టికెట్ నంబరు కేటాయించడం వల్ల విద్యార్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని ప్రస్తావించారు. అదే విధంగా, ఇటీవల పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసిన గ్రూప్2 ఫలితాల్లో దాదాపు 13 వేల మంది అభ్యర్థుల ఫలితాలు వెల్లడించలేదని, ఏ కారణం చేత ఆ 13వేల మందిని ఇన్‌వ్యాలిడ్‌గా ప్రకటించిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు డాక్టర్ సత్య, విద్యార్థి సంఘాల జేపీసీ నాయకులు డా.ఎల్చాల దత్తాత్రేయ, కేయూ నుండి శరత్ గౌడ్, గ్రూప్ 1 అభ్యర్థులు సింధు రెడ్డి, అనూష, సత్యవతి, రవీందర్ రాథోడ్, క్రాంతి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.





# ఇఫ్తార్ విందులో టిపిసిసి ఛీఫ్ మహేష్‌కుమార్
## హాజరైన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్

**హైదరాబాద్,మార్చి 16,ప్రభాతవార్త:** రంజాన్ పవిత్రమాసం సందర్భంగా ముస్లిం సోదరులు ఉపవాసదీక్ష విరమణ తరువాత జరిగే ఇఫ్తార్ విందులో ఆదివారం టిపిసిసి ఛీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. టిపిసిసి జనరల్ సెక్రటరీ ఆధ్వర్యంలో జరిగిన ఈ విందుకు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ కూడా హాజరైనారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేషన్ చైర్మన్‌లు, డిసిసి అధ్యక్షులు ఇతర పార్టీ నాయకులు కూడ ఖాజామెన్షన్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన విందుకు హాజరైనారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ మాట్లాడుతూ మతం మనిషిలో మానవీయ విలువలు పెంపొందించే ఒక మార్గం అని అన్నారు. ప్రభుత్వం రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం మతస్తులకు ఆచార సాంప్రదాయాలు పాటించడానికి సరళీకృత కాలనిర్ణయ పట్టిక ఈ నెల రోజులు ప్రత్యేకంగా అమలు చేస్తున్నదని వివరించారు.

# కొత్తపల్లి శివారులో మహిళ దారుణ హత్య

**కరీంనగర్ క్రైమ్,ప్రభాత వార్త:** కొత్తపల్లి మండల కేంద్రం శివారులోని ఎస్సారెస్పీ కెనాల్ సమీపంలో మహిళ దారుణ హత్యకు గురైంది. కాల్వ పక్కన రహదారిపై రక్తం మడుగు ఉండడంతో అటుగా వెళ్లిన స్థానికులు మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహం వద్ద ఆనవాళ్ళ కోసం దర్యాప్తు ప్రారంభించారు. మెడపై బలమైన గాయం ఉండడంతో గొంతు కోసి హత్య చేసి ఉంటారని భావించిన పోలీసులు ఆ కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. మృతురాలు ఎవరై ఉంటారా అని కోణంలో స్థానికులను విచారించగా ఎలాంటి ఆనవాళ్లు లభ్యం కాకపోవడంతో కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లకు సమాచారం అందించారు. అదే సమయంలో మృతురాలు నుస్తులాపూర్ గ్రామానికి చెందిన వెంకటమ్మగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంకటమ్మకు సంబంధించిన ఆస్తి పంపకాల్లో కుటుంబ సభ్యుల మధ్య గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నట్లు విచారణలో గుర్తించారు. నిందితులు కుటుంబసభ్యుల్లో ఎవరైనా ఉంటారనే కోణంలోనూ విచారణ జరుపుతున్నారు. ఘటన స్థలాన్ని ప్రొబేషనరీ ఐపిఎస్ వసుంధర ,రూరల్ ఏసిపి శుభంప్రకాష్,సీఐ ప్రదీప్ పరిశీలించారు.డాగ్ స్క్వాడ్ క్లూస్ టీం బృందం పరిశీలించి ఆధారాలు సేకరించారు.అనంతరం ఘటన స్థలంలో పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.వెంకటమ్మ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఇన్ స్పెక్టర్ ప్రదీప్ తెలిపారు.

# బిఆర్ఎస్ రాచరికపాలనకు బిజెపి మద్దతు
## అభివృద్ధిని అడ్డుకొంటున్న బిజెపి: ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్

**హైదరాబాద్, మార్చి 16,ప్రభాతవార్త:** బిఆర్ఎస్ రాచరిక పాలనకు గత పది సంవత్సరాలు బిజెపి మద్దతు ఇచ్చిందని ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ ఆరోపించారు. హైదరాబాద్‌లో ఆయన అసెంబ్లీలో విలేఖరులతో మాట్లాడుతూ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సిరిసిల్లల మాట్లాడిన మాటలు చూస్తే బిజెపి బిఆర్ఎస్ బంధం గల్లీలో లొల్లి ఢిల్లీలో దోస్తీలాగా ఉందని ఎద్దేవా చేశారు. ఇడి,ఐటి, సిబిఐ అడ్డం పెట్టుకొని బిజెపి ప్రభుత్వం కొనసాగిస్తుండగా గతంలో బిఆర్ఎస్ పోలీసులను అడ్డం పెట్టుకొని ప్రభుత్వం నడిపేదని విమర్శించారు. 15 నెలల క్రితం తెలంగాణాలో రాచరిక పాలన అంతం చేసి ప్రజాపాలనకు ప్రజలు అవకావశంఇచ్చారని బండి సంజయ్ గుర్తుంచుకోవాలని ఆదిశ్రీనివాస్ సూచించారు. ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ నుంచి కేంద్రం ఎక్కువ వాటాలో పన్నులు వసూలు చేసి తక్కువ మొత్తం తిరిగిఇస్తున్నదని ఆయన విమర్శించారు. బీహార్ కేంద్రంకు ఇచ్చేపన్ను తక్కువ పొందేంది మాత్రం ఎక్కువ అని ఆయన ఆరోపించారు. ఏడు రూపాయలు బిఆర్‌కు ఉత్తరప్రదేశ్‌కు మూడు రూపాయలు తెలంగాణకు 45పైసలు మాత్రమే ఇస్తున్నదని ఆది వివరించారు. కేంద్రం సబర్మతి, గంగా నదులను శుద్ధిచేయడానికి నిధులు సమకూర్చుతోంది కానీ దక్షిణ భారతదేశంలో అత్యంత కాలుష్య నదిమూసి ప్రక్షాళనకు నిధులు ఇవ్వకుండా మొండిచెయ్యి చూపుతోందని అన్నారు. తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ పోవడానికి కారణం బిజెపి అని నిందించారు.తెలంగాణ అభివృద్దిని అడ్డుకొని ఆపే ప్రయత్నం బిజెపి చేస్తుందని ఆయన ఆరోపించారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ గెలుపును ఎవ్వరు ఆపలేరని మొత్తం కాంగ్రెస్ అభ్యర్థులు గెలు స్తారని జోస్యం చెప్పారు. ఎంపిటిసిలు, జడ్పీ టిసిలు, ఎంపిపిలు, జడ్పీచైర్మన్‌లు, సర్పంచ్‌లు అందరు కాంగ్రెస్‌పార్టీకి చెందినవారు ఉంటారని ఆయన తెలిపారు.

# ఒబిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు చేయాలి: ఆర్.కృష్ణయ్య




ఆదివారం జరిగిన సదస్సులో ప్రసంగిస్తున్న రాజ్యాసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, చిత్రంలో దానకర్ణచారి, కరుణానిధి, విహెచ్ తదితరులు

**హైదరాబాద్ (చిక్కడపల్లి), మార్చి 16 ప్రభాతవార్త:** ప్రత్యేక రాజ్యాంగ సవరణ చేసి ఓబీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యాసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఆల్ ఇండియా బ్యాక్వర్డ్ క్లాసెస్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఏఐఓబిసి)ఫెడరేషన్ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ సమావేశం ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దానకర్ణ చారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ బీసీ ఉద్యోగులే బిసి ఉద్యమానికి నాయకత్వం వహించినప్పుడే ఉద్యమం పతాక స్థాయికి చేరుకుంటుందని తెలిపారు. బీసీలకు విద్యా ఉద్యోగాలలో జనాభా ప్రకారం 52శాతం రిజర్వేషన్అమలు చేయాలని అన్నారు. ఓబిసి సంక్షేమానికి ప్రత్యేక మంత్రిత్వశాఖ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎస్సీలు, ఎస్టీలు, బీసీలకు వారి జనాభా ఆధా రంగా విద్య, ఉపాధి, ఆర్థిక మరియు రాజకీ యాలలో దామాషా ప్రాతినిధ్యం అవసరమని కృష్ణయ్య నొక్కి చెప్పారు. ఈ అసమానతలను పరిష్కరించడంలో విఫలమైతే అశాంతికి దారి తీయవచ్చని ఆయన హెచ్చరించారు. కేంద్రంలో వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న 16 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని, బీసీ సమాజాన్ని మోసం చేసే ఎలాంటి చర్యలైనా తప్పవని హెచ్చరించారు.

ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి జి.కరుణానిధి మాట్లాడుతూ రాజ్యాంగ విరుద్ధమైన ఓబీసీ లపై విధించిన క్రీమీ లేయర్‌ను రద్దు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ హనుమంతరావు, ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాండు,వర్కింగ్ ప్రెసిడెంట్ రవి కుమార్ ముదిరాజ్, నాయకులు రామ్ రాజ్, వంశీకృష్ణ, రామ్మూర్తి, రమేష్, పోలీసులు పాల్గొన్నారు.

# 'కోర్ట్' సినిమా నన్ను గెలిపించింది -నాని




**నేచురల్ స్టార్ నాని** వాల్ పోస్టర్ సినిమా ప్రెజెంట్స్ లేటెస్ట్ బ్లాక్ బస్టర్ మూవీ 'కోర్ట్ స్టేట్ వర్సెస్ ఎ నోబడీ'. ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని రామ్ జగదీష్ దర్శకత్వం వహించారు. ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. దీప్తి గంటా సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈ సినిమా ప్రిమియర్స్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. మార్చి 14న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం అద్భుతమైన రెస్పాన్స్, హౌస్ ఫుల్ కలెక్షన్స్‌తో యునానిమస్ బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. ఈ నేపథ్యంలో టీం సెలబ్రేషన్ అఫ్ ఆడియన్స్ వెర్డిక్ట్ ఈవెంట్ నిర్వహించింది. సెలబ్రేషన్ అఫ్ ఆడియన్స్ వెర్డిక్ట్ ఈవెంట్‌లో నేచురల్ స్టార్ నాని మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. నేను ఈ రోజుదాక స్క్రిప్ట్, ప్రేక్షకులు.. ఈ రెండు విషయాలనే నమ్మాను. స్క్రిప్ట్ మా టీంని గెలిచింది. తెలుగు ప్రేక్షకులు సినిమాని గెలిపించారు. కోర్ట్ సినిమా నన్ను గెలిపించింది. ఈ సినిమా విషయంలో, టీం విషయంలో చాలా ప్రౌడ్‌గా ఫీలౌతున్నాను. సినిమాని ముందుకు తీసుకెలుతున్న అందరికీ పేరుపేరునా థాంక్ యూ. ఇప్పటి నుంచే అసలు జర్నీ వుంటుంది. దినేష్ అద్భుతమైన సినిమాటోగ్రఫీ ఇచ్చాడు. విజయ్ మ్యూజిక్ ఈ సినిమాకి సూపర్ స్టార్. తన మ్యూజిక్‌తో ఎమోషన్ తీసుకొచ్చాడు. ప్రశాంతితో కలసి ఇలాంటి మంచి సినిమాలు చేయడం చాలా ఆనందంగా వుంది. టీంకి ఒక అక్కలా అయిపొయింది. హర్ష వెర్సటైల్ యాక్టర్. ఈ సినిమాలో పార్ట్ కావడం ఆనందంగా వుంది. రఘు ఈ సినిమాకి బలం. పూర్ణ చారి అమెజింగ్ లిరిక్స్ రాశారు. ప్రేమ పాట సగం ప్రమోషన్స్ చేసింది. రోషన్ శ్రీదేవి బ్యూటీఫుల్ గా పెర్ఫార్మ్ చేశారు. ప్రభావతికి, సుధాకర్‌కి నేను ఫ్యాన్‌ని. రోహిణి మా అమ్మ. ఆమెను చూస్తేనే బోలెడు పాజిటివిటీ వస్తుంది. శివాజీ విజ్రుంభించి చేసిన సినిమాలో నేను పార్ట్ కావడం చాలా ఆనందంగా వుంది. దర్శి తెలుగు సినిమా నసీరుద్దిన్ షా. తనకంటూ ఒక స్టయిల్ వుంది. తనలో గొప్ప సెటిల్ నెస్ వుంటుంది. కంగ్రాట్స్ దర్శి. కోర్ట్ అనే బ్యూటీఫుల్ జర్నీ ఇప్పుడే స్టార్ట్ అయ్యింది థాంక్ యూ అన్నారు.

హీరో ప్రియదర్శి మాట్లాడుతూ, బలగం హిట్ తర్వాత ఎలాంటి సినిమా చేయాలని ఆలోచిస్తున్నపుడు రామ్ జగదీశ్ ఈ కథ చెప్పారు. ఈ సినిమా, మంగపతి పాత్ర గురించి అందరూ చాలా గొప్పగా మాట్లాడుకుంటున్నారు. ఈ సినిమాలో నాతో పాటు నటించిన అందరికీ థాంక్ యూ. రోహిణీ, శుభలేఖ సుధాకంతో వర్క్ చేయడం గ్రేట్ ఎక్స్ పీరియన్స్. ఈ సినిమాలో పని చేసిన అందరికీ పేరుపేరునా థాంక్ యూ అన్నారు. యాక్టర్ శివాజీ మాట్లాడుతూ, 25 ఏళ్ళుగా మంగపతి లాంటి క్యారెక్టర్ కోసం ఎదురుచూశాను. ప్రతి ఆర్టిస్ట్‌కి ఒక కల వుంటుంది. ఒక రోజు మొత్తం ఒక ఆర్టిస్ట్ గురించి మాట్లాడుకోవాలని. అది ఈ సినిమాతో తీరింది. నాని ఇండస్ట్రీకి మరో సూపర్ స్టార్ కృష్ణ. ఇకపై సినిమాలు చేస్తాను. ఈ సినిమా గొప్ప ఎక్స్ పీరియన్స్. ఈ సినిమాలో పని చేసిన అందరూ అద్భుతంగా చేశారు. మంగపతి లాంటి పాత్ర లైఫ్‌లో ఒకేసారి వస్తుంది. ఆ కిక్‌ని ఇప్పుడు ఎంజాయ్ చేస్తున్నాను. ఈ సినిమా ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు. సినిమా జిందా బాద్.. ప్రొడ్యూసర్ జిందాబాద్‌అన్నారు.


డైరెక్టర్ రామ్ జగదీశ్ మాట్లాడుతూ, సినిమా విషయంలో చాలా ప్రౌడ్‌గా ఫీలౌతున్నాను. నాని ప్రోడక్ట్ అని చెప్పడం ప్రౌడ్‌గా వుంది. ప్రియదర్శి అన్న థాంక్ యూ. మంగపతి క్యారెక్టర్‌లో శివాజీని తప్పితే మరొకరిని ఊహించలేదు. నటీనటులు, టెక్నికల్ టీం, మీడియా, ఇంత సక్సెస్ ఇచ్చిన తెలుగు ఆడియన్స్ అందరి విషయంలో చాలా ప్రౌడ్ గా ఫీలౌతున్నాను అన్నారు. యాక్టర్ రోహిణి మాట్లాడుతూ, సినిమా అన్ని చోట్ల నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. . వసినిమా చూస్తున్నప్పుడు చాలా చోట్ల చప్పట్లు కొట్టారు. నాని ట్రూ ట్యాలెంట్ ని ఇండస్ట్రీలోకి తీసుకొస్తున్నారు. మంచి సినిమా ఇస్తే ఆడియన్స్ గొప్పగా సెలబ్రేట్ చేస్తారని చెప్పడానికి ఈ సినిమా మరో నిదర్శనంగా నిలిచిందిఅన్నారు.

**హీరో నితిన్** హైలీ యాంటిసిపేటెడ్ హీస్ట్ కామెడీ ఎంటర్ టైనర్ రాబిన్‌హుడ్. శ్రీలీల కథానాయికగా నటించింది. వెంకీ కుడుముల దర్శకత్వం వహించిన ఈ సినిమాని మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ఈ చిత్రంలో నట కిరీటి రాజేంద్రప్రసాద్ కీలక పాత్ర పోషించారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ హ్యుజ్ బజ్ క్రియేట్ చేసింది. జివి ప్రకాష్ కుమార్ సంగీతం అందించిన పాటలు చార్ట్ బస్టర్ హిట్ అయ్యాయి. ఈ సినిమా మార్చి 28న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ భీమవరంలోని ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో గ్రాండ్ ఈవెంట్ నిర్వహించారు.

గ్రాండ్‌గా జరిగిన ఈవెంట్‌లో హీరో నితిన్ మాట్లాడుతూ, హాయ్ ఎస్ఆర్‌కెఆర్, మార్చి 28న అందరికీ హాలీడే ఇవ్వాలని కాలేజ్ ప్రిన్సిపాల్‌ని కోరుతున్నాను(నవ్వుతూ). లేదంటే అందరూ మాస్ బంక్ కొట్టండి. మీ ఎనర్జీ చూస్తుంటే చాలా ఆనందంగా వుంది. ఇది మా రవి చదువుకున్న కాలేజ్. ఇక్కడికి రావడం చాలా హ్యాపీగా వుంది. అందరూ రాబిన్ వుడ్ సినిమా చూడండి. మిమ్మల్ని డిస్సాపాయింట్ చేయదు. అందరికీ ఆల్ ది బెస్ట్అన్నారు. హీరోయిన్ శ్రీలీల మాట్లాడుతూ, మార్చి 28న సినిమా చూడండి. చాలా ఎంజాయ్ చేస్తారు. చదువుకునే సమయంలో మంచి బ్రేక్ కోసం చూసే సినిమా ఇది. అందరికీ థాంక్ యూ అన్నారు.

డైరెక్టర్ వెంకీ కుడుముల మాట్లాడుతూ, మా సినిమా నుంచి వేర్ ఎవర్ యు గో, వన్ మోర్ టైం, అది దా సర్ ప్రైజ్ మూడు పాటలు రిలీజ్ అయ్యాయి. ఈ మూడు పాటల్లానే ప్రతి కాలేజ్‌లో మూడు రకాల స్టూడెంట్స్ వుంటారు. ఒకళ్లు బాగా చదివి క్యాంపస్ ప్లేస్ మెంట్స్‌లో వేర్ ఎవర్ యు గో ఐ ఫాలో అన్నట్లుగా జాబ్స్ కొట్టేశారు. రెండో క్యాటగిరీ వన్ మోర్ టైం అంటూ బ్యాక్ లాగ్స్ రాస్తుంటారు. రవిలాగా మూడో క్యాటగిరీ. ఆయన ఇంజనీరింగ్ చదివి ఇండియాస్ బిగ్గెస్ట్ ప్రొడ్యూసర్ అయ్యారు.

# 28న రానున్న 'రాబిన్‌హుడ్'




ఏది చేసిన హార్ట్ ఫుల్‌గా చేయండి. డెఫినెట్‌గా సక్సెస్ అవుతారు. రాబిన్‌హుడ్ కూడా హార్ట్ ఫుల్ గా చేశాం. సినిమా చూసి మమ్మల్ని బ్లెస్ చేయండి. థాంక్ యు అన్నారు. ప్రొడ్యూసర్ వై రవిశంకర్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. నేను ఈ కాలేజ్ ప్రోడక్ట్‌ని అని చెప్పుకోవడం చాలా ఆనందంగా వుంటుంది. నా క్లాస్ మేట్స్, టీచర్స్ అందరికీ థాంక్ యూ. రాబిన్‌హుడ్ సినిమా అద్భుతంగా వచ్చింది. ఈ సినిమా పెద్ద బ్లాక్ బస్టర్ అవుతుందనే నమ్మకం వుంది. నితిన్‌కి, శ్రీలీలకి, డైరెక్టర్ వెంకీకి థాంక్ యూఅన్నారు.

# 'శుభం' విడుదలకు సిద్ధం

**ప్రముఖ నటి సమంత** ప్రస్తుతం నిర్మాణ రంగంలోకి అడుగు పెట్టిన సంగతి తెలిసిందే. సమంత సొంత నిర్మాణ సంస్థ త్రలాలా మూవింగ్ పిక్చర్స్ ఆధ్వర్యంలో తొలి ప్రాజెక్ట్ 'శుభం' చిత్రీకరణ విజయవంతంగా పూర్తయిది. ఇక త్వరలోనే ఈ చిత్రం థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. కామెడీ ఎంటర్టైన్మెంట్‌తో పాటు థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియెన్స్ ఇచ్చేలా ఈ చిత్రం ఉండనుందని సమాచారం. వసంత్ మరిగంటి రాసిన ఈ కథను సినిమా బండి ఫేమ్ ప్రవీణ్ కంద్రేగుల తెరకెక్కిస్తున్నారు. హర్షిత్ మల్గిరెడ్డి, శ్రియ కొంథం, చరణ్ పెరి, షాలిని కొండేపూడి, గవిరెడ్డి శ్రీనివాస్, శ్రావణి వంటి వారిని సినిమా బండి చిత్రంతో ప్రవీణ్ కంద్రేగుల పరిశ్రమకు పరిచయం చేసిన సంగతి తెలిసిందే.

త్రాలాల బ్యానర్ మీద ఈ సినిమాను మొదటి ప్రాజెక్ట్‌గా ఎందుకు ఎంచుకున్నామో త్వరలోనే అందరికీ తెలుస్తుందని సమంత అన్నారు. ఈ చిత్రంలో సి.మల్గిరెడ్డి, శ్రియ కొంతం, చరణ్ పెరి, షాలిని కొండేపూడి, గవిరెడ్డి శ్రీనివాస్, శ్రావణి వంటి వారు ముఖ్య పాత్రల్ని పోషించారు.

శుభం చిత్రానికి సినిమాటోగ్రాఫర్‌గా మృదుల్ సుజిత్ సేన్, ప్రొడక్షన్ డిజైనర్‌గా రామ్



చరణ్ తేజ్, ఎడిటర్‌గా ధర్మేంద్ర కాకర్లాడ్ వంటి వారు పని చేస్తున్నారు. ఈ మూవీకి సంబంధించిన మరిన్ని అప్డేట్లు త్వరలోనే రానున్నాయి. సాంకేతిక సిబ్బంది: బ్యానర్ : ట్రలాలా మూవింగ్ పిక్చర్స్ రచయిత : వసంత్ మరిగంటి దర్శకుడు : ప్రవీణ్ కాండ్రేగుల, కెమెరామెన్ : మృదుల్ సుజిత్ సేన్, ఎడిటర్ : ధర్మేంద్ర కాకర్ల, ప్రొడక్షన్ డిజైన్ : రామ్ చరణ్ తేజ్, ప్రొడక్షన్ టీం : రాకేష్ గడ్డం, ఆర్యన్ దగ్గుపాటి .

# 'పెళ్లి కాని ప్రసాద్' ఫన్ బ్లాస్ట్ లాంటి సినిమా



**సప్తగిరిహోల్సమ్ ఎంటర్ టైనర్** పెళ్లి కాని ప్రసాద్. అభిలాష్ రెడ్డి గోపిడి దర్శ కత్వం వహించిన ఈ చిత్రం హ్యూమర్, సోషల్ కామెంటరీ బ్లెండ్‌తో పర్ఫెక్ట్ ఎంటర టైనర్‌గా ఉండబోతోంది. థామ మీడియా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై విజన్ గ్రూప్ కె.వై. బాబు, భాను ప్రకాష్ గౌడ్, సుక్కా వెంకటేశ్వర్ గౌడ్, వైభవ్ రెడ్డి ముత్యాల కలిసి నిర్మించారు. చాగంటి సినిమాటిక్ వరల్డ్ సమర్పిస్తోంది. దిల్ రాజు నేతృత్వంలోని ప్రముఖ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ (ఎస్‌విఎస్) ఈ చిత్రాన్ని రిలీజ్ చేస్తోంది. ఇప్పటికే విడుదలైన టీజర్ ట్రైలర్ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేశాయి. ఈ సినిమా మార్చి 21న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్ లో హీరో సప్తగిరి మాట్లాడుతూ, 'పెళ్లి కాని ప్రసాద్' సి ని వ ా చాలా బావొచ్చింది. మార్చి 21న మీరంతా సినిమా చూసి జెన్యూన్‌గా రివ్యూ ఇస్తారని కోరుకుంటున్నాను. ఈ సినిమా మంచి ఫన్ బ్లాస్ట్ గా ఉంటుంది. నిర్మాతలు ఎక్కడ కూడారాజీ పడ కుండా సిని మాని చాలా గ్రాండ్‌గా నిర్మిం చారు. డైరెక్టర్ అభిలాష్ రెడ్డి ఆడి యన్స్ అందరు కూడా గొప్పగా మాట్లాడే సినిమా తీశారు. తప్పకుండా ఈ సినిమా ఆడియన్స్ అందరిని మెప్పిస్తుందని నమ్ముతున్నానుఅన్నారు. డైరెక్టర్ అభిలాష్ రెడ్డి మాట్లాడుతూ, అందరూ మార్చ్ 21 థియేటర్స్‌కి వచ్చి సినిమా చూడాలని కోరుకుంటున్నాను అన్నారు. ప్రొడ్యూసర్ కేవై బాబు మాట్లాడుతూ, ఈ సినిమా కథ, కామెడీ చాలా బాగుంటుంది. ఫ్యామిలీ ఓరియెంటెడ్ మూవీ. మార్చి 21న సినిమా రిలీజ్ అవుతుంది. అందరూ తప్పకుండా వచ్చి చూడాలి అని కోరారు. హీరోయిన్ ప్రియాంక శర్మ మాట్లా డుతూ, ట్రైలర్ చూసిన తర్వాత ఈ సినిమా ఎలా ఉండబోతుందో ఆడియన్స్‌కి ఒక ఐడియావచ్చే ఉంటుంది. హీరోకి ,ప్రొడ్యూ సర్, డైరెక్టర్‌కి థాంక్యూ అన్నారు.

# 'కాలమేగా కరిగింది" ట్రైలర్ రిలీజ్



**వినయ్ కు ం వ ా ర ్ ,** శ్రావణి మజ్జరి, అర వింద్ ముదిగొండ, నోమిన తార ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'కాలమేగా కరిగింది'. ఈ సినిమాను శింగర క్రియేటివ్ వర్క్స్ బ్యానర్ పై మరే శివశంకర్ నిర్మిస్తున్నారు. శింగర మోహన్ దర్శకత్వం వహిస్తున్నారు. పొయెటిక్ లవ్ స్టోరీగా తెరకెక్కిన 'కాలమేగా కరిగింది' సినిమా ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ రోజు ఈ సినిమా ట్రైలర్ ను రిలీజ్ చేశారు. 'కాలమేగా కరిగింది' సినిమా ట్రైలర్ ఎలా ఉందో చూస్తే ఫణి, బిందు విద్యార్థులుగా ఉన్నప్పటి నుంచి ప్రేమికులు. అమాయకత్వం నిండిన స్వచ్ఛమైన ప్రేమ వారికి ఎంతో సంతోషాన్నిస్తుంది. తమ ప్రేమే లోకంగా జీవిస్తుంటారు ఇద్దరు. కలహాలే లేని ఈ ప్రేమ కథను కాలం విడదీస్తే ఆ జ్ఞాపకాలు వెతుక్కుంటూ కథానాయకుడు ఫణి ప్రయాణం సా గి స్తా డు . బిందుతో కలిసి చ దు వు కు న్న స్కూల్, తామిద్దరు మాట్లాడుకున్న ప్లేస్‌లు అన్నింటిలో ప్రేమను గుర్తుల్ని పోగేసుకుంటాడు. ఈ ప్రేమికులు తిరిగి ఎలా కలిశారు అనేది ట్రైలర్‌లో ఆసక్తిని కలిగించింది. ఈ ప్లెజంట్ లవ్ స్టోరీని పొయెటిక్ గా అందంగా రూపొందించారు దర్శకుడు శింగర మోహన్. గుడప్పన్ బ్యూటిఫుల్ మ్యూజిక్ ట్రైలర్ లో ఆకట్టుకుంది.

**30 రోజుల్లో** ప్రేమించడం ఎలా సినిమాతో అలరించిన హీరో ప్రదీప్ మాచిరాజు తన సెకండ్ మూవీ 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' తో వస్తున్నారు. ఈ యూనిక్ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను యంగ్ ట్యాలంటెండ్ డైరెక్టర్స్ దుయో నితిన్, భరత్ దర్శకత్వం వహిస్తున్నారు. మాక్స్ మంకీస్ బ్యానర్ నిర్మిస్తున్న ఈ ఎగ్జైటింగ్ ఎంటర్‌టైనర్‌లో దీపికా పిల్లి కథానాయికగా నటిస్తోంది.

# 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి ' ఏప్రిల్ 11న వరల్డ్ వైడ్ రిలీజ్



మేకర్స్ ఈ చిత్రం విడుదల తేదీని అనౌన్స్ చేశారు. ఈ సినిమా వేసవిలో బిగ్గెస్ట్ ఎట్రాక్షన్‌లో ఒకటిగా ఏప్రిల్ 11న ప్రపంచవ్యాప్తంగా సినిమా థియేటర్లలో సినిమా విడుదల కానుంది. రిలీజ్ డేట్ పోస్టర్‌లో ప్రదీప్, దీపిక పిల్లిని ఒక రౌడీ గ్యాంగ్ వెంబడిస్తున్నట్లు కనిపిస్తోంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్, సాంగ్స్‌కి ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ రావడంతో సినిమాపై మంచి బజ్ నెలకొంది. ఈ చిత్రంలో వెన్నెల కిషోర్, సత్య, గెటప్ శ్రీను కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎంఎన్ బాలరెడ్డి కెమెరా మ్యాన్ గా పని చేస్తున్నారు, కోదాటి పవనకల్యాణ్ ఎడిటర్. సందీప్ బొల్లా కథ, డైలాగ్స్ అందించగా, ఆశిస్తే పులాల ప్రొడక్షన్ డిజైనర్. విడుదల తేదీని అనౌన్స్ చేయడంతో, ప్రమోషనల్ యాక్టివిటీస్ జోరు పెంచనున్నారు మేకర్స్.




# 'వీర ధీర శూర' టీజర్ రిలీజ్

**చియాన్ విక్రమ్,** సేతుపతి, చిత్తా సినిమాలతో పాపులరైన దర్శకుడు ఎస్.యు. అరుణ్ కుమార్‌తో కలిసి హెచ్.ఆర్. పిక్చర్స్, రియా శిబు నిర్మించిన వీర ధీర శూర అనే రెండు భాగాల యాక్షన్, ఫ్యామిలీ డ్రామా కోసం చేతులు కలిపారు. ఇంట్రస్టింగ్‌గా ఈ చిత్రం యొక్క రెండవ భాగం మొదట మార్చి 27న విడుదల కానుంది. ఎన్.వి.ఆర్ సినిమా తెలుగు రైట్స్ ని సొంతం చేసుకోగా, నైజాం రిలీజ్ మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా జరుగుతుంది.

విక్రమ్ తన భార్య (దుషార విజయన్) కుమార్తెతో హార్ట్ ఫుల్ మూమెంట్స్ పంచుకునే ఫ్యామిలీగా ప్రజెంట్ చేస్తూ టీజర్ బిగెన్ అవుతుంది. ఒక క్రైమ్ లోకల్ ఫెస్టివల్‌కు అంతరాయం కలిగించినప్పుడు ప్రశాంతత చెదిరిపోతుంది. విక్రమ్‌ను ప్రతీకారం తీర్చుకునేలా చేస్తుంది. ఈ టీజర్ విక్రమ్ గతాన్ని కూడా పరిచయం చేస్తుంది. ఇందులో ఎస్‌జె సూర్యను మానిప్యులేటివ్ పోలీస్ పాత్రలో, సూరజ్ వెంజరమూడును టెర్రిఫిక్ గ్యాంగ్‌స్టర్‌గా ప్రజెంట్ చేశారు. విక్రమ్ అద్భుతమైన నటనతో ఆకట్టుకున్నారు. ఫ్యామిలీ మ్యాన్‌గా, రివెంజ్ తీర్చుకునే ఇంటెన్స్ పర్శన్‌గా రెండు కోణాల్లో ఆదరగొట్టారు. ఎస్‌జె సూర్య, సూరజ్ వెంజరమూడు పెర్ఫార్మెన్స్ కట్టుకున్నాయి. ఎస్‌యు అరుణ్ కుమార్ టీజర్‌ను అద్భుతంగా కట్ చేశారు, థ్రిల్లింగ్ యాక్షన్, ఇంటెన్స్ డ్రామా బ్లెండ్ చేశారు. తేని ఈశ్వర్ సినిమాటోగ్రఫీ ప్రత్యేకంగా నిలుస్తుంది, ప్రతి ఫ్రేమ్ ఎక్సయిటింగ్ గా వుంది. బి.జు. ప్రకాష్ కుమార్ మ్యూజిక్ విజువల్స్ ని మరింత ఎలివేట్ చేసింది. టీజర్ నిస్సందేహంగా 'వీర ధీర సూర' కోసం భారీ అంచనాలను రేకెత్తించింది.

నటీనటులు : చియాన్ విక్రమ్,. ఎస్‌జె సూర్య, సూరజ్ వెంజరమూడు, దుషార విజయన్

దర్శకత్వం: ఎస్‌యు అరుణ్‌కుమార్: మ్యూజిక్ : జి.వి. ప్రకాష్ కుమార్, డిఓపి : తేని ఈశ్వర్ . ఎడిటర్, ప్రసన్న జికె : ఆర్ట్ డైరెక్టర్ : సి.ఎస్.బాలచందర్, పీఆర్వో : వంశీశేఖర్



## కన్నప్ప స్వగ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన హీరో మంచు విష్ణు

**డైనమిక్ హీరో** విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ కన్నప్ప చిత్రాన్ని ఏప్రిల్ 25న విడుదల చేయబోతున్నారు. మోహన్ బాబు నిర్మించిన ఈ చిత్రానికి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. ప్రమోషన్స్‌లో భాగంగా ఇప్పటి వరకు రిలీజ్ చేసిన రెండు టీజర్‌లు, పాటలు సినిమా మీద అంచనాల్ని పెంచేసాయి. కన్నప్ప రిలీజ్ అయ్యేలోపు ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించు కుంటానని విష్ణు మంచు చెప్పిన సంగతి తెలిసిందే. తాజాగా విష్ణు మంచు భక్త కన్నప్ప సొంతూరికి వెళ్లారు. అన్నమయ్య జిల్లాలోని రాజంపేట మండలంలోని ఊటుకూరు గ్రామానికి వెళ్లారు. గ్రామస్థులు, ఆలయ సిబ్బంది విష్ణు మంచుకి, కన్నప్ప టీంకు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడ కన్నప్ప స్వగృహాన్ని సందర్శించారు. అక్కడి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయాన్ని అభివృద్ధి చేస్తానని కూడా విష్ణు మంచు హామీ ఇచ్చారు. కన్నప్ప చిత్రంలో మోహన్ బాబు, మోహన్‌లాల్, అక్షయ్‌కుమార్, ప్రభాస్, కాజల్ అగర్వాల్, ప్రీతిముకుందన్ వంటి వారు నటించారు. ఈ చిత్రానికి స్టీఫెన్ దేవస్సీ అందించిన పాటలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి.



# మగువకు కావాల్సింది ఏమిటి ?



అంతర్జాతీయ మహిళా దినోత్సవం అయిపోయింది. మహిళా దినోత్సవం రోజే ఎక్కడా లేని ఎవరు ఎరుగని ఎనలేని ప్రేమలు గుర్తుకు వస్తాయి. ఎక్కడ చూసినా ఫోటోలు , వీడియోలు , కేక్ కటింగ్‌లు, ఉపన్యాసలలో హడావిడి చేసే జనం ఇప్పుడు ఈ రోజు నుండి ఏ ఒక్కరూ పట్టించుకోరు వాళ్ళ కన్నీటి బాధలు ఎవరూ అడగరు. మామూలే అంతా మామూలే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే కదా. మరి ఈ రోజు నుండి స్త్రీ పరిస్దితి ఏంటి! వారు ఎందుకు ఎదగలేక పోతున్నారు! మనదేశం లో 30. స్త్రీలు ఎదగారని అందరూ వారి గురించే మాట్లాడుకంటే మిగతా వారి గురించి , వాళ్ళ పరిస్దితి ఎంటి ? ఆలోచిద్దామా. అసల సమాజం అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు, హక్కులు మరియు గౌరవం ఉండాలి. కానీ నేటి సమాజంలో స్త్రీలు అనేక సమస్యలు ఎదురవుతున్నాయి.

**అత్యాచారం మరియు అశీలత:** స్త్రీలు అనేక రకాల శారీ రకంగా, మానసికంగా, లైంగిక వేధింపులు, అత్యా చారాలు, గ్యాంగ్ రేప్‌లు, దాడులు వలన స్త్రీలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇది మన దేశంలో మహిళల భద్రతపై నమ్మకం తగ్గించేందుకు దారితీస్తుంది. జాతీయ దృశ్యములో అసమానతలు, విద్య, ఉద్యోగ, నాయకత్వం వంటి రంగాలలో మహిళలను తక్కువ చూపు చూడడం సమాజంలోని మహిళలు తరచుగా తక్కువ జీతాలు, తక్కువ అవకాశాలు. ఎందుకో మరి ఎన్నో అడ్డంకులు: సమాజంలో ఇంకా పాత పద్దతులు, మరియు ప్రతి దానికి పురుషుల అంగీకారాలు, ఇవే మహిళలకు తీవ్ర అభ్యంతరంగా మారుతున్నాయి. అమ్మాయిలు ఇంటిలో కూర్చొనే పని చేయాలని అనడం , రకరకాల భయాల వల్ల మరియు అభ్యంతరాల వల్ల సమాజంలో మహిళల ఎదుగుదలను దెబ్బతీస్తున్నాయి.మానసిక ఆరోగ్య సమస్యలు రకరకాల అనారోగ్యం సమస్యలు, డిప్రెషన్ వల్ల మహిళలు సామాజిక మరియు భౌతిక ఒత్తిడులకు గురవుతుంటారు. ఈ ఒత్తిళ్ల మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. బాధ, దుఃఖం, ఒత్తిళ్ల వల్ల మహిళల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి.

**పరిష్కార మార్గాలు:** చట్టాల పెంపు మరియు అమలు, మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టడం కోసం కఠినమైన చట్టాలు అమలు చేయడం అవసరం. లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా సంబంధిత చట్టాలు మరింత బలపరచాలి.

**సామాజిక మార్పు:** సమాజంలో మహిళల గురించి అవగాహన పెంచడం, వారి అభ్యంతరాలు, సమస్యలను పరిష్కరించడానికి స్ఫూర్తి ఇవ్వడం ముఖ్యమే.

**వైద్య మరియు మానసిక ఆరోగ్యం:** స్త్రీల మానసిక ఆరోగ్య సమస్యలను గుర్తించి, సపోర్ట్ వ్యవస్థలు ఏర్పాటు చేయడం అవసరం.

**అవకాశాలు సమానంగా:** మహిళలు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు పొందేలా చేయడం, మహిళా ఆర్థిక స్వావలంబన కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం సమాజంలోని పురోగతికి మార్గం చూపుతుంది... దేశంలో ప్రతి స్త్రీ ఎదగాలంటే ప్రభుత్వాలు, మరియు వెల్ఫేర్ అసోసియేషన్స్, సామాజికంగా ఆర్థికంగా, సహాయ సహకారాలను అందిస్తే బాగుంటుంది. వాళ్ళకి కావాల్సిన నైపుణ్యాలపై దృష్టి పెట్టి వాళ్ళ కాళ్ళ పై వాళ్ళు నిలబడేట్టు చేయగలిగితే ప్రతి మహిళ ఎదుగుతుంది.

- కె సింధూ

# శత్రువును గుర్తిస్తే ఎదుగుతాం ..



' నీ శత్రువు ఎవరో తెలిస్తే నీ కెపాసిటీ ఏంటో తెలుస్తుంది..' అంటాడు ధృవ సినిమాలో రామ్‌చరణ్. అలాగే వ్యాపారంలో రాణించాలన్నా మన శత్రువు ఎవరో తెలుసుకోవడం ముఖ్యమంటోంది ప్రముఖ వ్యాపారవేత్త గజల్ అలఘ్. తొమ్మిదేళ్ల క్రితం 'మామా ఎర్త్' బేబీ స్కిన్కేర్ పేరుతో ఉత్పత్తుల వ్యాపారం ప్రారంభించిన ఆమె.. క్రమంగా వ్యక్తిగత చర్మ సౌందర్యానికి దాన్ని విస్తరించింది. లక్షలతో అంకురార్పణ చేసి తన వ్యాపారాన్ని కోట్లకు పడగెత్తేలా చేసింది. అయితే దీనంతటికీ కారణం తన వ్యాపార శత్రువు ఎవరో గుర్తించి.. అధిగమించడం వల్లే అని చెబుతోంది లేడీ. ఎంత ఎదిగినా ఒదిగి ఉండే లక్షణం గజల్ సొంతం. అంతేకాదు.. రంగంలో పరిస్థితులను అంచనా వేసి.. వ్యాపార వాటికి తగిన నిర్ణయాలు తీసుకోవడంలోనూ ఆమెకు ఆమె సాటి. ఈ వ్యాపార దక్షతతోనే ప్రస్తుతం వ్యాపార రంగంలో దూసుకుపోతోందామె. అంతేకాదు.. తాను పాటించే వ్యాపార మెలకువలను, ఇతర బిజినెస్ చిట్కాలను తరచూ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ ఔత్సాహిక వ్యాపారవేత్తల్లో స్ఫూర్తి నింపే గజల్.. ఇటీవలే పెట్టిన మరో పోస్ట్ అందరిలో ఆలోచనను రేకెత్తిస్తోంది.



**అదే మా బ్రాండ్ రహస్యం!...** రంగంలోనైనా ఎదగాలంటే నైపుణ్యాలొక్కటే సరిపోవు.. మన ఎదుగుదలకు సవాలుగా మారిన అంశాల్నీ జయించాలంటోంది గజల్. ఈ పోస్ట్ నేపథ్యంలోనే ఇటీవలే సోషల్ మీడియాలో ఓ పెట్టిందామె. "ఈ ప్రపంచంలో విజయపథంలో దూసుకుపోతున్న వ్యాపారలెన్నో ఉన్నాయి. మరి, వాటి విజయం సాధించిన ఉమ్మడి అంశమేంటో మీరు గ్రహించారా? అదే శత్రువు. అయితే శత్రువంటే పోటీదారే కానక్కర్లేదు. వ్యవస్థ, మన స్తత్వం, మనకున్న సమస్యలు.. వీటిలో ఉండవచ్చు. ఇలాంటి శత్రువును జయించినప్పుడే ఏ రంగంలోనైనా రాణించగలుగుతాం. అగ్రగామిగా క్రీడా దుస్తుల పేరొందిన స్వీయ చేస్తూ బ్రాండ్గా చెందిన సంప్రదాయ దీటుగా వసతి కల్పనతో. ఓవైపు తన సక్సెస్ సీక్రెట్‌ను పంచుకుంటూనే.. మరోవైపు 'మీ శత్రువును మీరెలా నిర్వర్తిస్తారంటూ.. నెటిజన్లను సూటిగా ప్రశ్నించింది బిజినెస్ ఉమన్.

**వంట... నా ఒత్తిడి!** ఈ కార్పొరేట్ ప్రపంచంలో మనం ఎవరితో పోటీ పడుతున్నాం? మనం వాటిని ఎలా అధిగమించగలం? ఈ విషయాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండటం ముఖ్యం.. "పనిలో ఒత్తిడి, పనిజీవితంలో సమతుల్యత మొదలైన వాటి గురించి ఆమె తన చిట్కాలను సోషల్ మీడియాలో పోస్ట్‌ల రూపంలో పంచుకుంటుంది. ఇంటిపనులతో పాటు ఆఫీసు బాధ్యతలు కూడా తోడవడంతో ఎవరైనా ఒత్తిడికి గురికావడం సహజం. దాన్నుంచి బయటపడేందుకు ఒక్కొక్కరు ఒక్కో మార్గాన్ని వెతుకుతున్నారు. ఒత్తిడిని అధిగమించేందుకు వంట చేస్తాను. మీకు ఇష్టమైన వంటకాలను సిద్ధం చేయండి మరియు విశ్రాంతి తీసుకోండి. ఒకరోజుఆఫీస్‌లో చాలా పని ఉండడంతో బాగా అలసిపోయాను. కాబట్టి నేను విశ్రాంతి తీసుకోవడానికి ఆ చాక్లెట్ కేక్ తినాలనుకున్నాను. వెంటనే సిద్ధం చేసి లాగాడు. మూడ్ బాగోలేనప్పుడు నచ్చినవి చేయడం, నచ్చినవి తినడం వంటివి ఉత్సాహంగా ఉంటాయి. ఇది కేవలం ఒత్తిడిని అధిగమించడమే కాదు. అనవసర విషయాల గురించి ఆలోచించకుండా ప్రశాంతంగా ఉండేందుకు ప్రయత్నిస్తాను" అంటూ ఒత్తిడిని ఎదుర్కొనే విధానాన్ని గజల్ వివరించింది.

**కొడుకు సమస్యలతో...** ఛత్తీస్‌గఢ్‌కు చెందిన గజల్ పంజాబ్ యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ అప్లికేషన్స్‌లో డిగ్రీ చేసింది. ఆ తర్వాత 'అప్లైడ్ ఆర్ట్స్'లో ఇంటర్న్‌షిప్ కోర్స్ చేసి 'ఫిగర్టివ్ స్కల్ప్చర్'లో ఈ ఇంటెన్సివ్ కోర్స్ చేసింది. వరుణ్ అలఘ్ ఆయపా అక్కడ గజల్‌ను కలిశాడు. తొలి చూపులోనే ప్రేమలో పడిన ఈ జంట 2011లో పెళ్లి చేసుకున్నారు. మొదటి కొడుకు పుట్టిన తర్వాత పూర్తిగా ఇంటికే పరిమితమైన గజల్.. బేబీ కేర్ ప్రొడక్ట్స్ లోని కెమికల్స్ వల్లే కొడుకు చర్మ సమస్యలు వస్తున్నాయని గ్రహించింది. అందుకే రసాయనాలు లేని బేబీ కేర్ ఉత్పత్తులను తానే తయారు చేయాలని నిర్ణయించుకుంది. 2008లో ట్రూడే ఈ ఆలోచనతో 'మామా ఎర్త్' అనే సంస్థను స్థాపించింది. తన వ్యాపార దృక్పథంతో అంచెలంచెలుగా ఈ బ్రాండ్‌ను డెవలప్ చేసిన ఆమె.. ఈ దశలో పిల్లలకే కాకుండా పెద్దలకు కూడా పర్సనల్ కేర్ ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. వ్యాపారానికి నమ్మకమే పునాది అనే సూత్రాన్ని నమ్మిన ఆమె తన బ్రాండ్‌ను మార్కెట్‌లో అగ్రగామిగా నిలబెట్టింది. లక్షల రూపాయల పెట్టుబడితో మొదలైన గజల్ వ్యాపార ప్రయాణం ఎందరో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందనడంలో సందేహం లేదు.

# ఉడకని చేపలో ఐరన్



మన దేశంలో పునరుత్పత్తి దశలో ఉన్న మహిళల్లో 50 శాతానికి పైగా రక్త హీనతతో బాధపడుతు న్నారని చెప్పారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే. ఇది ప్రధానంగా ఇనుము లోపం వల్ల వస్తుంది. ఈ పోషకాలు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఒకప్పుడు కంబోడియాలో రక్తహీనత అనేది తీవ్రమైన ఆరోగ్య సమస్య. రక్తహీనతతో మహిళలు, చిన్నారులు మరణించిన ఘటనలపై కెనడాకు చెందిన ఎపిడెమియాలజిస్ట్ క్రిస్టోఫర్ చార్లెస్ చలించిపోయారు. పరిష్కారం కోసం హ్యాపీ ఫిష్ అనే ఐరన్ ఫిష్‌ను తయారు చేశారు. ఆ దేశపు జానపద కథల్లో జాతకం చెప్పే ట్రైకాంత్రోప్ చేపను పోలి ఉండేలా వారు దీన్ని రూపొందించారు. దీన్ని వంట పాత్రలో వేసి పది నిమిషాలు ఉంచాలి. అందులోని ఐరన్ ఆ పదార్థాలను కలుపుతుంది. తద్వారా శరీరానికి సరిపడా ఐరన్ అందుతుంది. ఈ చేపను చాలాసార్లు కడిగి ఉపయోగించవచ్చు. ఇది ఫుడ్ గ్రేడ్ ఎలక్ట్రోలైటిక్ ఐరన్ పౌడర్‌తో తయారు చేయబడింది. ఈ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డిఏ) సర్టిఫికేషన్ ఇవ్వడంతో... చాలా దేశాలు ఈ చేపలను విక్రయించేందుకు అనుమతించాయి. బాగుంది కదూ!

# చర్మం మృదువుగా ఉండాలంటే..



ముదురు గులాబీ రంగులో ఉండే డ్రాగన్ ఫ్రూట్ లోపల వెన్నలా ఉంటుంది. ఇందులో అధికంగా ఉండే విటమిన్ సి మీ రోగనిరోధక శక్తిని పెంచుతుంది. దీన్ని తరచుగా తినడం వల్ల జలుబు, దగ్గు నుంచి ఉపశమనం పొందవచ్చు. ఇందులోని పోషకాలు రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతాయి. యాంటీఆక్సిడెంట్లు శరీర కణాలను ఫ్రీ రాడికల్స్ నుండి రక్షించడంలో సహాయపడతాయి. ఇందులో ఉండే పీచు మన పొట్టలో మంచి బ్యాక్టీరియా వృద్ధికి, ఆరోగ్యానికి తోడ్పడుతుంది. ఈ బాక్టీరియా మనల్ని రకరకాల వ్యాధుల నుంచి కాపాడుతుంది. శరీరానికి అవసరమైన ఐరన్, డ్రాగన్‌లో పుష్కలంగా ఉంటుంది. ఈ పండులో ఎక్కువగా ఉండే మెగ్నీషియం, క్యాల్షియం ఎముకల ఆరోగ్యాన్ని కాపాడతాయి. మెగ్నీషియం టైప్2 మధుమేహం మరియు చర్మ ఆరోగ్యం ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. చర్మం పొడిబారకుండా మృదువుగా ఉండాలంటే ఈ పండును తరచుగా తినాలి.

# కేకులలో జంతువులు







పిల్లలకు జంతువులంటే ఎంతిష్టమో చెప్పలేం. వాటితో ఆడీపాడటంతోపాటు కమ్మని కబుర్లెన్నో చెబుతారు. ఆఖరికి నిద్రపోతున్నారసరే ప్రియనేస్తం పక్కనే ఉండాలంటారు. పుట్టినరోజునాడు జంతువుల రూపాలతోనే కేక్‌లనూ ఇస్తే ఇంకెంత సంతోషపడతారో కదూ.. అందుకేనేమో ఇలా తయారుచేసి వారి ఆనందాన్ని రెట్టింపు చేస్తున్నారు.


















# బలవంతుడు?

ఈ లోకంలో ఎవరికీ వారు తామే బలవంతులు అనుకుంటూ ఉంటారు. రావణాసురుడు తానే బలవంతుడినని విర్రవీగాడు. చివరకు శ్రీ రాముని చేతిలో హతమయ్యాడు. అలా చేసే వాలి ప్రాణాలు పోగొట్టుకున్నాడు. గదా యుద్ధంలో నా అంతటి వీరుడు లేడని సుయోధనుడు మీసం మేలేశాడు. చివరకు భీముని దెబ్బకు కుప్పకులాడు. భారీ కాయులైన కుంభకర్ణుడు, ఘటోత్కజులు ఒక్క శరానికే ప్రాణాలు వదిలారు. బస్తిలు తీసే వారు, గ్రామాలలో వివిధ సందర్భాలలో 'ఇరుసు 'లు ఎత్తే వాళ్ళు కొకొల్లలు. వారేమి ప్రజలను భయ బ్రాంతులకు గురి చేయరు. అదో ప్రత్యేకతగా భావిస్తారు. బలవంతులు ఎప్పుడూ గర్వం ప్రదర్శించరాదు.ఏనుగు మహా బలమైన జంతువు అని అనుకుంటాం. అది కూడా మొసలి బారినపడి ఆవేదనతో దైవాన్ని ప్రార్థించింది. నేను బలం అనే గర్వం దానికి అప్పుడు తెలిసి వచ్చింది. గజేంద్ర మోక్షంలో శ్రీ హరి దాన్ని కాపాడి రక్షించాడు. ఆ కోవలోకే అడవికి రాజుననే భావంతో మృగరాజు అందరిని హడలగొడుతూ ఉంటే చిన్న ప్రాణి కుందేలు దానికి ఎలా బుద్ధి చెప్పిందో మనకు అవగతమే. కనుక ఎవరూ కూడా బల వంతులు అని మిడిసి పోకూడదు. మనం అనుకుంటాం కండలు పెంచిన వారు బలవంతులు అని అది అపోహ. వారి కన్నా ఎముక పుష్టిగా ఉన్న వాళ్ళే మహా బలవంతులు దృఢకాయుడి కన్నా బక్క పల్చని వాళ్ళు బలవంతులు. ఏదీ ఏమైనా ఆధ్యాత్మిక చింతనలో ప్రతి ఒక్కరూ కొండొకచో దైవ బలం కలిగి ఉండాల్సిందే. దైవ బలం ఉన్న వాళ్ళే అసలు సిసలు బలవంతులు.

.కనుమ ఎల్లారెడ్డి



ఆధ్యాత్మికం

# వేగన్ ఎగ్

మనలో కొందరు పూర్తి శాఖాహారులం. వారు పశువుల నుండి చేపలు, మాంసం, పాలు లేదా గుడ్లు తినరు. అలాంటి వారి కోసం వేగన్ చికెన్, మటన్ అందుబాటులో ఉన్నాయి. ఇప్పుడు కొత్తగా 'వేగన్ ఎగ్' వచ్చింది. ఈ రకమైన గుడ్లు పప్పులు, పనీర్, మసాలాలతో తయారు చేయబడతాయి మరియు కోడి గుడ్లను పోలి ఉంటాయి. నిజమైన గుడ్లు, మీరు వాటిని కలిపి ఉంచినట్లయితే, మీరు నిజంగా తేడాను చెప్పలేరు.

కాబట్టి మీరు ఈ కృత్రిమ గుడ్డును ఎలా తయారు చేస్తారు? మలై కోవాలో మొక్కజొన్న పిండి మరియు రాక్ సాల్ట్ వేసి బాగా కలపండి మరియు మధ్యలో వేరుశెనగతో చేసిన మిశ్రమాన్ని ఉంచండి. ఈ కృత్రిమ గుడ్డును ఉడకబెట్టడానికి, మీరు రాక్ ఉప్పు నీటిని ఉపయోగించాలి. ఇది సరిగ్గా ఐదు నిమిషాల్లో ఉడికిపోతుంది. సాధారణ కోడిగుడ్ల మాదిరిగానే రుచి, పోషకాలు ఉంటాయని చెబుతున్నారు. బాగుంది కదూ! రుచికరమైన శాఖాహారం తినాలనుకుంటే చికెన్‌కి సంబంధం లేని ఈ గుడ్డును ప్రయత్నించండి!




# ఇలా నిద్రపోతే మొటిమలొస్తాయట !



నిద్రలేమి మన ఆరోగ్యాన్ని ప్రభావితం చేయడమే కాదు.. మన అందాన్ని పాడు చేస్తుంది. ముఖ్యంగా చర్మంలో సెబమ్ ఉత్పత్తి పెరిగి.. మొటిమలను కలిగిస్తుంది. అయితే అతను సరిగ్గా నిద్రపోక పోవడం వల్ల కాదు. నిద్ర విషయంలో మనం చేసే కొన్ని పొరపాట్ల వల్ల మొటిమలు వచ్చే అవకాశాలు పెరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. తెలుసుకుందాం.

**మీరు వాటిని మారుస్తున్నారా?..** దిండు కవర్లను ఎప్పటికప్పుడు మార్చుకునే విషయంలో చాలా మంది నిరక్ష్యంగా వ్యవహరిస్తుంటారు. అయితే ఈ అజాగ్రత్తే మొటిమలకు ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు. మన చర్మం ద్వారా విడుదలయ్యే నూనెలు, చెమట, బ్యాక్టీరియా మరియు చనిపోయిన కణాలు సహజంగా ఉపరితలంపై పేరుకుపోతాయి. ఈ ప్రక్రియ ప్రతిరోజూ జరుగుతుంది. రోజుల తరబడి ఒకే దిండును ఉపయోగించడం వల్ల అవి చర్మ రంధ్రాలలోకి చేరి మూసుకుపోతాయి. ఫలితంగా, వారికి మొటిమలు వస్తాయి. అలా జరగకుండా ఉండాలంటే వారానికోసారి దిండు కవర్లను మార్చడం, వాక్యూమ్ క్లీనర్‌లో దిండ్లను శుభ్రం చేయడం, సిల్క్, బెడ్ షీట్లు ఉపయోగించడం, రెండు కవర్లు ఉపయోగించడం వంటివి చేయాలి.

**మేకప్ తీయకపోయినా..!** నిద్రలో, శరీరంలో ఒత్తిడి హార్మోన్ కార్టిసాల్ స్థాయిలు పూర్తిగా పడిపోతాయి. అందువలన, చర్మంలో కొల్లాజెన్ ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. ఇది చర్మాన్ని రిపేర్ చేస్తుంది. ఫలితం అందం. అయితే ఈ ప్రక్రియ విజయవంతంగా పూర్తి కావాలంటే నిద్రకు ఉపక్రమించే ముందు ఎలాంటి మేకప్ ఉత్పత్తులు, క్రీములు వాడకపోవడమే మంచిది. కొంతమంది అసహనానికి గురవుతారు లేదా మేకప్ తీయకుండా నిద్రపోతారని నిపుణులు అంటున్నారు. ఫలితంగా, మేకప్ చర్మ రంధ్రాలలో ఉండిపోయి మూసుకుపోతుంది. కాబట్టి వారికి మొటిమలు వస్తాయి. కాబట్టి ఈ సమస్యను నివారించడానికి. మేకప్ పూర్తిగా తొలగించిన తర్వాతే నిద్రపోవాలని నిపుణులు అంటున్నారు. చర్మానికి రక్తప్రసరణ కూడా మెరుగుపడి చర్మం కాంతివంతంగా మారుతుందని అంటున్నారు.



**నియమం ప్రకారం జుట్టుకు నూనె!** కొంతమంది ఉదయం తలస్నానం చేయడానికి రాత్రి పడుకునే ముందు జుట్టుకు నూనె రాస్తారు. కానీ ఈ అలవాటు క్రమంగా మొటిమలకు దారి తీస్తుంది. చర్మం జిడ్డుగా ఉండటం వల్ల ముఖ చర్మంపై సెబమ్ ఉత్పత్తిని పరోక్షంగా పెంచుతుందని నిపుణులు చెబుతున్నారు. అవసరమైన దానికంటే ఎక్కువ నూనెలు ఉత్పత్తి కావడం వల్ల ముఖంపై మొటిమలు వస్తాయి. కాబట్టి పడుకునే ముందు ఈ అలవాటు మానుకోవాలని నిపుణులు చెబుతున్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా... తలస్నానానికి రెండు గంటల ముందు జుట్టుకు నూనె రాసుకుని తర్వాత గాఢత తక్కువగా ఉన్న షాంపోతో తలస్నానం చేయడం మంచిది. ఫలితంగా మొటిమల ముప్పు తప్పుతుంది.



**వాతావరణం కూడా ముఖ్యం!** కొంతమందికి, బెడ్‌రూమ్‌లో వాతావరణం వెచ్చగా ఉంటే, మరికొందరు ఏ సమయంలోనైనా ఎయిర్ కండీషనర్‌తో నిద్రపోతారు. నిజానికి, నిద్రలో పడకగది వాతావరణం కూడా మొటిమలకు కారణమవుతుందని నిపుణులు అంటున్నారు. గాలిలో అధిక తేమ మరియు గది ఉష్ణోగ్రత పెరుగుదల కారణంగా, చర్మం ఎక్కువ సెబమ్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఫలితంగా, వాపు పెరుగుతుంది మరియు మొటిమలు ఏర్పడతాయి. వాతావరణం చల్లగా ఉంటే చర్మం పొడిబారుతుంది. ఫలితంగా, చర్మాన్ని తేమగా మార్చడానికి మీరు ఎక్కువ క్రీమ్‌లు మరియు మాయిశ్చరైజర్‌లను అప్లై చేయాలి. దీనివల్ల చర్మం జిడ్డుగా మారడంతోపాటు మొటిమల సమస్యలు కూడా వస్తాయి. కాబట్టి బెడ్‌రూమ్‌లోని వాతావరణం మరీ వేడిగా లేదా చల్లగా ఉండేలా చూసుకోవాలి. ఎయిర్ కండీషనర్లు, హ్యూమిడిఫైయర్లను ఎంత తక్కువ వాడితే అంత మంచిదని నిపుణులు చెబుతున్నారు. వీటితో పాటు రాత్రి పడుకునే ముందు కాఫీ/టీలు తాగకపోవడం షుగర్ ఎక్కువగా ఉండే పదార్థాలు, నిపుణుల సలహా మేరకు కొన్ని రకాల వైట్ క్రీమ్స్ తీసుకోకపోవడం. ఉపయోగించి.. ఈ అలవాట్ల వల్ల మొటిమలకు దూరంగా ఉండవచ్చు.

### వరల్డ్ టెన్నిస్‌లో టైటిల్ విజేతగా
# రష్మిక, వైదేహి జోడీ



**న్యూఢిల్లీ:** భారత యువ టెన్నిస్ ప్లేయర్ల జంట ఇంటర్నేషనల్ టెన్నిస్ సమాఖ్య టైటిల్‌ను సాధించింది. భమిడిపాటి శ్రీవల్లి రష్మిక, వైదేహీచౌదరి ద్వయం ఈ విజయాన్ని అందుకుని డబ్ల్యూ 35 డబుల్స్ టైటిల్ కైవసం చేసుకుంది. దీంతో భారత్‌కే చెందిన వైదేహిచౌదరీతో కలిసి రష్మిక కెరీర్‌లో ఆరో అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) టైటిల్ ఖాతాలో వేసుకున్నట్లయింది. ఐటీఎఫ్ వరల్డ్ టెన్నిస్ టూర్లో భాగంగా థాయ్లాండ్ వేదికగా జరిగిన డబ్ల్యూ 35 టోర్నీ మహిళల డబుల్స్ ఫైనల్లో రష్మిక-వైదేహి జంట 6-4, 6-3తో పునిన్ కొవాపిటుక్‌టెడ్ (థాయ్లాండ్)-యుకీ నైటో (జపాన్) ద్వయంపై విజయం సాధించింది. మ్యాచ్ ఆరంభం నుంచి చక్కటి ఆట తీరు కనబర్చిన భారత జోడీ, వరుస సెట్లలో విజృంభించి టైటిల్‌ను చేజిక్కించుకుంది. 1 గంట 18 నిమిషాల పాటు సాగిన ఈ టైటిల్ పోరులో రష్మిక-వైదేహి ద్వయం 2 ఏస్‌లు సంధించి ఒక డబుల్ ఫాల్ట్ చేసింది. 9 బ్రేక్ పాయింట్లు కాచుకున్న భారత ప్లేయర్లు ఓవరాల్గా 61 పాయింట్లు సాధించి సునాయాసంగా గెలుపొందారు. హైదరాబాద్‌కు చెందిన రష్మికకు ఇది రెండో డబ్ల్యూ 35 డబుల్స్ టైటిల్ కాగా, ఓవరాల్‌గా ఆరోది. 2024లో డబ్ల్యూ 35 ఇండోర్, 2023లో డబ్ల్యూ 15 అహ్మదాబాద్, డబ్ల్యూ 15 థాయ్లాండ్, డబ్ల్యూ 25 థాయ్లాండ్, 2022లో డబ్ల్యూ 15 గురుగ్రామ్ టోర్నమెంట్లలో రష్మిక ద్వయం డబుల్స్ చాంపియన్గా నిలిచింది. ఈ ఆరింట్లో నాలుగుసార్లు వైదేహిచౌదరీతో కలిసే రష్మిక విజయాలు సాధించింది.

# టి20లో పాక్‌కు పరాభవం
### 91 పరుగులకే కుప్ప కూలిన జట్టు
### న్యూజిలాండ్ 9 వికెట్లతో గెలుపు



**న్యూఢిల్లీ:** ఛాంపియన్స్ ట్రోఫీ-2025లో అత్యంత ఘోర ప్రదర్శన కనబరిచిన పాకిస్తాన్ క్రికెట్ జట్టు ఇప్పుడు న్యూజిలాండ్ పర్యటనలో కూడా అదే తీరును కనబరుస్తోంది. ఈ నేపథ్యంలో న్యూజిలాండ్‌తో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను పాక్ ఘోర ఓటమితో ప్రారంభించింది. క్రైస్ట్ చర్చ్ వేదికగా ఆదివారం జరిగిన తొలి టీ20లో 9 వికెట్ల తేడాతో పాక్ పరాజయం పాలైంది. ఈ మ్యాచ్‌లో పాకిస్తాన్ బ్యాటర్లు తీవ్ర నిరాశపరిచారు. తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ 18.4 ఓవర్లలో కేవలం 91 పరుగులకే కుప్పకూలింది. కివీస్ ఫాస్ట్ బౌలర్లు నిప్పులు చెరిగారు. ఇన్నింగ్స్ తొలి ఓవర్ నుంచే పాకిస్తాన్ వికెట్ల పతనం మొదలైంది. కివీస్ బౌలర్లలో జాకబ్ డఫీ 4వికెట్లతో పాకిస్తాన్ పతనాన్ని శాసించగా, కైల్ జేమిసన్ 3, ఇష్ సోదీ 2 వికెట్లు పడగొట్టారు. పాకిస్తాన్ బ్యాటర్లలో కుష్దిల్ షా (32) పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అనంతరం 92 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని న్యూజిలాండ్ ఒక్క వికెట్ కోల్పోయి కేవలం 10.1 ఓవర్లలో ఊదిపడేసింది. కివీస్ ఓపెనర్ టిమ్ సీఫర్ట్ 29 బంతుల్లో 44 పరుగులు చేసి ఔటయ్యాడు. అతడితో పాటు, ఫిన్ అలెన్ (29),రాబిన్సన్ (18) ఆజేయంగా నిలిచి మ్యాచ్‌ను ఫినిష్ చేశారు. పాక్ బౌలర్లలో అర్బర్ అహ్మద్ ఒక్క వికెట్ పడగొట్టాడు. ఇక కివీస్‌తో టీ20 సిరీస్‌కు దాదాపుగా కొత్త టీమును పాకిస్తాన్ క్రికెట్ బోర్డు సెలక్టర్లు ఎంపిక చేశారు. కెప్టెన్ మహ్మద్ రిజ్వాన్, బాబర్ ఆజం, సౌద్ షకీల్ వంటి స్టార్ ఆటగాళ్లపై పీసీబీ వేటు వేసింది. వారి స్థానంలో హసన్ నవాజ్, ఇర్ఫాన్ ఖాన్, అబ్దుల్ సమద్ వంటి యువ ఆటగాళ్లకు సెలక్టర్లు అవకాశమిచ్చారు. కానీ వీరివ్వరూ కూడా తమకు వచ్చిన అవకాశాలను అందిపుచ్చు కోలేకపోయారు.

### మహిళల టి20లో..
# న్యూజిలాండ్ విక్టరీ
### 7 వికెట్ల తేడాతో శ్రీలంక చిత్తు

**న్యూఢిల్లీ:** మహిళల క్రికెట్‌లో భాగంగా శ్రీలంకతో జరిగిన టీ20 మ్యాచ్‌లో న్యూజిలాండ్ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆదివారం జరిగిన రెండో రెండో మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత న్యూజిలాండ్ బౌలింగ్ చేసింది. శ్రీలంక బ్యాటింగ్‌లో 113 పరుగులకే (20 ఓవర్లలో 7 వికెట్లనష్టానికి) న్యూజిలాండ్ పరిమితం చేసింది. న్యూజిలాండ్ బౌలర్లు బ్రీ ఇల్లింగ్, జెస్ కెర్ తలో 2 వికెట్లు పడగొట్టగా, ఫ్లోరా డెవాన్‌షైర్, బ్రూక్ హ్యాలీడే చెరో వికెట్ దక్కించుకున్నారు. కెప్టెన్ సూజీ బేట్స్ (4-1-16-0) వికెట్ తీయకపోయినా అత్యంత పొదుపుగా బౌలింగ్ చేసింది.



శ్రీలంక ఇన్నింగ్స్‌లో మనుడి నన్యక్కార (35) టాప్ స్కోరర్‌గా నిలువగా, చమారీ ఆటపట్టు (23), కవిశ దిల్హారి (12), నిలాక్షి డిసిల్వ (20), హర్షిత మాధవి (11) రెండంకెల స్కోర్లు చేయగలిగారు. విష్మి గౌతమ్ డకౌట్ కాగా, సుగంధిక కుమార్ 1 పరుగు చేసి ఔటయ్యారు. అనంతరం స్వల్ప లక్ష్య ఛేదనకు దిగిన న్యూజిలాండ్ 18.3 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి విజయతీరాలకు చేరింది. సుజీ బేట్స్ (47), బ్రూక్ హ్యాలీడే (46 నాటౌట్) మ్యాచ్ ఇన్నింగ్స్ ఆడి న్యూజిలాండ్‌ను గెలిపించారు. న్యూజిలాండ్ ప్లేయర్లలో జార్జియా ప్లిమ్మర్ 4, ఎమ్మా మెక్‌లియాడ్ 11 పరుగులకు ఔటయ్యారు. హ్యాలీడే. ఇజ్జీ షార్ప్‌తో (8 నాటౌట్) కలిసి న్యూజిలాండ్‌ను విజయతీరాలకు చేర్చింది. ఈ గెలుపుతో న్యూజిలాండ్ మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-1తో నిలిచింది. కాగా తొలి టీ20లో శ్రీలంక న్యూజిలాండ్‌పై సంచలన విజయం సాధించింది. నిర్ణయాత్మక మూడో టీ20 ఈ నెల 18న డునెడిన్‌లో జరుగనుంది. కాగా, మూడు వన్డేలు, మూడు టీ20ల సిరీస్ కోసం శ్రీలంక న్యూజిలాండ్‌లో పర్యటిస్తోంది. ఈ పర్యటనలో తొలుత జరిగిన వన్డే సిరీస్‌ను ఆతిథ్య న్యూజిలాండ్ 20 పరుగుల తేడాతో గెలుపొందింది.







# ఐపిఎల్: వికెట్ల వీరులు
### జాబితాలో ముగ్గురు ఇండియన్స్
### టాప్ 5లో చాహల్, చావ్లా, భువనేశ్వర్

**న్యూఢిల్లీ:** మిలియన్ డాలర్ల టోర్నమెంట్‌గా పేరొందిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్ ప్రారంభానికి ముహూర్తం దగ్గర పడుతోంది. క్రికెట్ లవర్స్ ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ ఐపీఎల్‌కి రంగం సిద్ధమైంది. ఈ నెల 22న ప్రారంభమయ్యే ఈ ఎడిషన్ ప్రారంభ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్ రైడర్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు తలపడనున్నాయి. దానికి ముందు, ఈ మిలియన్ డాలర్ల టోర్నమెంట్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన టాప్ 5 బౌలర్ల జాబితాలో ముగ్గురు ఇండియన్స్ కూడా ఉన్నారు. టీమిండియా స్టార్ బౌలర్ యుజ్వేంద్ర చాహల్ ఐపీఎల్‌లో అత్యధిక వికెట్లు తీసుకున్న బౌలర్ల లిస్టులో టాప్‌లో ఉన్నాడు. 2013లో ఐపీఎల్ ఎంట్రీ ఇచ్చిన చాహల్ ఇప్పటి వరకు ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడాడు. మధ్య ఓవర్లలో అద్భుతమైన బౌలింగ్ తో తన జట్లకు అనేక విజయాలు అందించిన చాహల్ ఇప్పటివరకు 160 మ్యాచ్‌ల్లో మొత్తం 205 వికెట్లు తీసుకున్నాడు. ఐపీఎల్ లో డబుల్ సెంచరీ వికెట్లు సాధించిన ఒకేఒక్క బౌలర్ చాహల్. చాహల్ ఈ ఎడిషన్లో పంజాబ్ కింగ్స్ తరఫున ఆడనున్నాడు. అలాగే భారత క్రికెటర్ పీయూష్ చావ్లా ఐపీఎల్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసుకున్న రెండో బౌలర్‌గా ఉన్నాడు. లెగ్ స్పిన్ తో అదరగొట్టే చావ్లా 2008లో ఐపీఎల్ ఎంట్రీ ఇచ్చి ఇప్పటివరకు 192 మ్యాచ్‌ల్లో 192 వికెట్లు తీసుకున్నాడు. పియూష్ చావ్లా ఐపీఎల్లో చెన్నై సూపర్ కింగ్స్, కోల్కతా నైట్ రైడర్స్, పంజాబ్ కింగ్స్, ముంబై ఇండియన్స్ జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. ఈ టోర్నమెంట్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో చావ్లా ప్రత్యేకత చూపాడు. వెస్టిండీస్ స్టార్ ప్లేయర్ డ్వేన్ బ్రావో 2008లో ఐపీఎల్‌లోకి ఎంట్రీ ఇచ్చాడు. ఈ స్టార్ ఆల్ రౌండర్ అద్భుతమైన బౌలింగ్ తో ఐపీఎల్‌లో మొత్తం 161 మ్యాచ్‌ల్లో 183 వికెట్లు పడగొట్టి అత్యధిక వికెట్లు సాధించిన మూడో ప్లేయర్ గా కొనసాగుతున్నాడు. డ్వేన్ బ్రావో ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్, గుజరాత్ లయన్స్ తరఫున ఆడాడు. భారత స్టార్ స్వింగ్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ 2011లో ఐపీఎల్ లోకి ఎంట్రీ ఇచ్చాడు. ఇప్పటివరకు ఐపీఎల్లో మొత్తం 176 మ్యాచ్‌ల్లో ఆడాడు. తనదైన అద్భుతమైన బౌలింగ్ తో 181 వికెట్లతో ఐపీఎల్ లో అత్యధిక వికెట్లు సాధించిన 4వ బౌలర్ గా కొనసాగుతున్నాడు. భువనేశ్వర్ కుమార్ ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్, పూణే వారియర్స్ తరఫున ఆడాడు. రాబోయే ఐపీఎల్ సీజన్ లో ఆర్సీబీ తరఫున ఆడనున్నాడు. ఇక వెస్టిండీస్ స్టార్ ఆల్ రౌండర్ సునీల్ నరైన్ 2012లో ఐపీఎల్ అరంగేట్రం చేశాడు. ఇప్పటివరకు ఐపీఎల్‌లో 177 మ్యాచ్‌లు ఆడాడు. ఈ మిస్టరీ స్పిన్నర్ కోల్కతా నైట్ రైడర్స్ తరఫున ఆడుతున్నాడు. ఆ జట్టుకు అత్యంత ముఖ్యమైన ఆల్ రౌండర్ గా ఉన్న సునీల్ నరైన్ 180 వికెట్లతో ఐపీఎల్ లో అత్యధిక వికెట్లు తీసుకున్న బౌలర్ గా 5వ స్థానంలో ఉన్నాడు. ఇక తదపరి జాబితాలో 6వ స్థానంలో రవిచంద్రన్ అశ్విన్ ఐపీఎల్‌లో 180 వికెట్లు తీసుకున్నాడు. చెన్నై సూపర్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్, కింగ్స్ ఎలెవన్ పంజాబ్, పూణే, రాజస్థాన్ రాయల్స్ టీమ్‌ల తరఫున ఆడాడు. ఏడో స్థానంలో భారత్ స్పిన్నర్ అమిత్ మిశ్రా ఐపీఎల్‌లో 174 వికెట్లు తీసుకోగా, యార్కర్ల కింగ్, శ్రీలంక లెజెండరీ ఫాస్ట్ బౌలర్ లసిత్ మలింగా ఐపీఎల్‌లో 170 వికెట్లు, ఆధునిక క్రికెట్‌లో అత్యుత్తమ ఫాస్ట్ బౌలర్లలో ఒకరిగా కొనసాగుతున్న భారత్ స్టార్ బౌలర్ జస్ప్రిత్ బుమ్రా ముంబై ఇండియన్స్ తరఫున ఆడుతున్నాడు. ఇప్పటి వరకూ ఐపీఎల్‌లో 165 వికెట్లు తీసుకుని టాప్ 10లో 9వ స్థానంలో ఉన్నాడు. 10వ స్థానంలో భారత్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా తన ఐపీఎల్ కెరీర్‌లో ఇంతవరకూ 160 వికెట్లు తీసుకున్నాడు.

# ప్లేయర్ ఆఫ్ ది ఇయర్‌గా సవిత, హర్మన్
### భారత్ హాకీ మహిళ, పురుషుల జట్లకు అవార్డులు

**న్యూఢిల్లీ:** భారత్ హాకీ మహిళ, పురుషుల జట్లకు సంబంధించి ఇరువురికి ప్రతిష్టాత్మక అవార్డు ప్లేయర్ ఆఫ్ ద ఇయర్ దక్కింది. అంతర్జాతీయ స్థాయిలో నిలకడైన ప్రదర్శనతో జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న భారత పురుషుల హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, అలాగే మహిళల జట్టు గోల్‌కీపర్ సవితా పూనియాకు ప్లేయర్ ఆఫ్ ద ఇయర్ అవార్డులు దక్కాయి. హాకీ దిగ్గజం బల్బీర్ సింగ్ పేరిట ప్రతీ ఏడాది ఉత్తమ ప్రదర్శన కనబర్చిన ప్లేయర్లకు హాకీ ఇండియా (హెచ్‌ఐ) ఈ పురస్కారాలు అందజేస్తోంది. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో హర్మన్ ప్రీత్ సింగ్ సారథ్యంలో భారత జట్టు వరుసగా రెండోసారి విశ్వ క్రీడల్లో కాంస్య పతకం సాధించింది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం నెగ్గిన జట్టులోనూ హర్మన్ ప్రీత్ సభ్యుడు. ఇక టోక్యో ఒలింపిక్స్‌లో భారత మహిళ హాకీ జట్టు నాలుగో స్థానంలో నిలవడంలో గోల్‌కీపర్ సవిత ప్రధాన పాత్ర పోషించింది. 2024 సంవత్సరానికి గానూ సవిత హాకీ ఇండియా బల్జిత్ సింగ్ గోల్‌కీపర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు కూడా దక్కించుకుంది. కాగా ఈ పురస్కారాలకు ఎంపికవడం చాలా ఆనందంగా ఉందని ఈ సందర్భంగా సవిత పునియా వెల్లడించింది. జట్టు సభ్యుల సహకారం లేనిదే ఇది సాధ్యం కాదని తెలిపింది. ఈ అవార్డులు ఆటపై ఏకాగ్రతను మరింత పెంచుతాయని పేర్కొంది. అలాగే ఈ అవార్డు తనకు ప్రేరణ వంటిదని హర్మన్‌ప్రీత్ సింగ్ అన్నాడు. యువ ఆటగాళ్లు మరింత మెరుగైన ప్రదర్శన చేసేలా ఇవి తోడ్పాటునిస్తాయని చెప్పాడు. కాగా భారత పురుషుల హాకీ జట్టు 1975లో ప్రపంచ కప్ నెగ్గి 50 సంవత్సరాలు పూరైన సందర్భంగా హాకీ ఇండియా ప్రతిప్రష్టాత్మకంగా వేడుకలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగానే ప్లేయర్లకు పురస్కారాలు అందజేసింది.

## వాణిజ్యం

# గోల్డ్ వర్సెస్ స్టాక్ మార్కెట్..

**ముంబై, మార్చి 16:** స్టాక్ మార్కెట్ ఈ ఒక్క నెలలోనే పాతాళానికి పడిపోయి, మళ్ళీ ఇప్పుడు కాస్త కోలుకుంటుంది. అయితే స్టాక్ మార్కెట్ పడిపోవడానికి చాలా కారణాలు తోడయ్యాయి.




అందులో ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడి ప్రతీకార సుంకాల భయాలు షేర్ మార్కెట్‌ని పట్టి పీడించాయి. కానీ రాబోయే మూడేళ్లలో స్టాక్‌మార్కెట్ బంగారం కంటే మెరుగ్గా ఉండనుంది. ఈ వాదన ఎడెల్వీస్ మ్యూచువల్ ఫండ్ కొత్త రిపోర్ట్ సూచించింది. ఆర్థిక అనిశ్చితి కాలంలో బంగారాన్ని సురక్షితమైన పెట్టుబడిగా పరిగణిస్తున్నారని కూడా ఈ నివేదికలో పేర్కొంది. కానీ, ఆర్థిక వృద్ధిలో స్టాక్‌మార్కెట్ వృద్ధి చెందుతుందని భావిస్తున్నారు. ఇలాంటి సమయంలో స్టాక్‌మార్కెట్లో పెట్టుబడిపెట్టడం మరింత ప్రయోజనకరంగా ఉండొచ్చు. ఈ రిపోర్ట్ సెన్సెక్స్ టు గోల్డ్ రేషియోని కూడా ప్రస్తావించింది. దీని అర్థం రాబోయే సంవత్సరాల్లో స్టాక్‌లు బంగారాన్ని అధిగమిస్తాయని. నివేదిక ప్రకారం, ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు షేర్లకు అనుకూలంగా ఉన్నాయి. ఆర్థిక వృద్ధి అవకాశాల కారణంగా స్టాక్స్‌లో పెట్టుబడి పెట్టడం మరింత లాభదాయకంగా ఉండవచ్చని నివేదిక సూచిస్తుంది. పెట్టుబడిదారులకు ఇదొక ముఖ్యమైన అంశం. కారణం ఏమిటంటే మార్కెట్ ట్రెండ్‌లకు అనుగుణంగా పోర్ట్‌ఫోలియోను క్రియేట్ చేసుకోవాలనుకుంటారు. గత 25 ఏళ్లలో బంగారం వార్షిక రాబడిని 12.55శాతం ఇచ్చిందని నివేదిక చెబుతోంది. అదేసమయంలో బిఎస్ఇ సెన్సెక్స్ 10.73శాతం లాభపడింది. అయినప్పటికీ ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు షేర్లకు అనుకూలంగా ఉన్నాయి. గత 10 సంవత్సరాలలో, బంగారం కేవలం 36శాతం కేసులలో మాత్రమే స్టాక్‌లను అధిగమించిందని నివేదిక చూపిస్తుంది. స్వల్పకాలిక హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ స్టాక్ మార్కెట్ దీర్ఘకాలికంగా మెరుగైన రాబడిని ఇచ్చిందని కూడా చూపిస్తుంది. ఎంసిఎక్స్‌లో ఏప్రిల్ గోల్డ్‌ఫ్యూచర్స్ కాంట్రాక్స్ 10 గ్రాములకు రూ.86,875 వద్ద కొత్త రికార్డు గరిష్టస్థాయిని తాకాయి. అంటే 0.21 శాతం, రూ.189 పెరుగుదలను చూపుతుంది. ఒక్కమార్చిలోనే బంగారం ధరలు 10 గ్రాములకు రూ.2,600 పెరిగాయి. సురక్షిత స్వర్గధామడిమాండ్ కారణంగా ప్రపంచ మార్కెట్లలో బంగారం ధరలు ఆల్‌టైమ్ గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. అమెరికా వాణిజ్య సుంకాలు, ఇతర దేశాల ప్రతీకార చర్యల కారణంగా ప్రపంచ ఆర్థిక వృద్ధి మందగిస్తుందనే భయాలు విలువైన లోహాలకు, ముఖ్యంగా బంగారానికి డిమాండ్‌ను పెంచాయి. బంగారం, స్టాక్‌మార్కెట్ ఎల్లప్పుడూ రెండు ప్రముఖ పెట్టుబడి ఆప్షన్స్. ఆర్థిక సంక్షోభాల సమయంలో బంగారం స్థిరత్వానికి ప్రసిద్ధి చెందింది. అదే సమయంలో ఆర్థిక సంస్కరణల కాలంలో స్టాక్ మార్కెట్ చారిత్రాత్మకంగా మెరుగైన రాబడిని ఇచ్చింది. ఆర్థికవృద్ధి నుండి ప్రయోజనం పొందేందుకు స్టాక్ మార్కెట్ మంచి స్థితిలో ఉందని ఎడెల్వీస్ నివేదిక నొక్కి చెబుతోంది.

# కార్ల బుకింగ్‌కూ తత్కాల్ స్కీమ్

**న్యూఢిల్లీ, మార్చి 16:** మారుతి సుజుకీ 800 వెర్షన్ కారుకు గతంలో ప్రత్యేకంగా తత్కాల్ వేరియంట్ లాంచ్ చేశారు. 1989-1990లలో మారుతి సుజుకి 800 అధిక డిమాండ్ నేపథ్యంలో ఆ కంపెనీ ఈ ప్రత్యేకమైన వెర్షన్ రిలీజ్ చేసింది. దీర్ఘకాల కస్టమర్ నిరీక్షణ కాలాన్ని తగ్గించడానికి దీనిని భారత మార్కెట్లోకి ప్రవేశపెట్టారు. మారుతి సుజుకి 800 కొనుగోలు చేయాలనుకునే కస్టమర్లు కొన్నిసార్లు చాలా నెలలు లేదా సంవత్సరాల వరకు వేచి ఉండాల్సి వచ్చేది. ఆ అవసరం లేకుండా ఫాస్ట్‌ట్రాక్ లేదా ఇన్‌స్టంట్ డెలివరీ ఎంపికగా తత్కాల్ వేరియంట్ ప్రవేశపెట్టారు. మారుతీ సుజుకీ 800 టీకే వేరియంట్ పేరుతో రిలీజ్ చేసిన ఈ కారు పొందాలంటే కస్టమర్లు రూ. 50,000 అధిక ధర చెల్లించాల్సి వచ్చేది. అయితే మారుతీ సుజుకీ టీకే వేరియంట్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేది కాదు. ఉత్పత్తి సామర్థ్యం ఆధారంగా కాలానుగుణంగా ప్రవేశపెట్టేరు. మారుతీ సుజుకీ 800 తత్కాల్ వేరియంట్ ప్రామాణిక మారుతి 800కి సమానంగా ఉంటుంది. తత్కాల్ పథకాన్ని మొదట స్టాండర్డ్ (ఎస్‌టీడీ) మోడల్ కోసం అందించారు. తరువాత డీలక్స్ (డీఎక్స్) వేరియంట్‌కు విస్తరించారు.



మారుతీ సుజుకీ టీకే వేరియంట్‌లో ఏసీ ఆప్షన్ కూడా ఉండేది. అయితే డీఎక్స్, ఎస్టీడీ వేరియంట్‌లు ఫాబ్రిక్ సీట్లు, డోర్ ట్రిమ్‌లు, స్ప్లిట్ రియర్ సీట్లు, లామినేటెడ్ విండ్‌షీల్డ్‌తో వచ్చాయి. తత్కాల్ వాహనాలను ప్రత్యేకంగా గుర్తించేలా బూట్ క్యాప్‌పై టీకే స్టిక్కర్ ఉండేది. మారుతీ సుజుకీ 800 కారు 796 సీసీ ఎఫ్8బీ ఇంజిన్‌తో వచ్చేది. అందువల్ల ఈ కారు 5,500 ఆర్‌పీఎం వద్ద 39.5 బీహెచ్‌పీ, 5000 ఆర్‌పీఎం వద్ద 59 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఈ కారు 4స్పీడ్ మాన్యువల్ గేర్‌బాక్స్ ఆధారంగా పని చేసేది. మారుతి సుజుకి 800 భారతదేశంలో మొట్టమొదటి సరసమైన ధరలో లాంచ్ చేసిన కారుగా ఉండేది. ఈ కారు బాగా ప్రజాదరణ పొందడంతో డిమాండ్ సరఫరాను మించిపోయింది. అందువల్ల కారు కొనుగోలు చేయాలనుకునే వారు ఎక్కువ కాలం వేచి ఉండాల్సి వచ్చింది. మారుతి 800 బుకింగ్‌లకు చాలా కాలంగా వెయిటింగ్ లిస్ట్‌లు ఉండటం వల్ల ప్రజలు తమ బుకింగ్ స్లాట్‌లను అధికధరకు అమ్మేసుకునేవారు. ఇలాంటి సమస్యకు పరిష్కారంగా తత్కాల్ వేరియంట్ లాంచ్‌చేశారు. కాలక్రమేణ తత్కాల్ వేరియంట్ మారుతీ సుజుకీనిలిపివేసింది. అయితే ఇప్పటికీ కార్ల బుకింగ్‌ల కోసం ఓ ప్రత్యేక తత్కాల్ వేరియంట్‌ను లాంచ్ చేసిన మోడల్‌గా మారుతీ సుజుకీ 800 నిలుస్తుంది.

# ఆన్‌లైన్ షాపింగ్‌లో మెలకువలు

**ముంబై, మార్చి 16:** ఇ-కామర్స్ దిగ్గజాలు ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ ఇతర ఆన్‌లైన్ వెబ్ సైట్లు వినియోగదారుల కోసం రకరకాల ఆఫర్లు, డిస్కౌంట్లను అందిస్తుంటాయి. ఇప్పుడు పండగ సీజన్ ఉంది. రాబోయే ఉగాది సందర్భంగా ఎన్నో ఆఫర్లను అందిస్తుంటాయి. ఆన్‌లైన్‌లో షాపింగ్ చేసే వారు కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు. లేకపోతే మోసపోయే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. కొన్ని టిప్స్ పాటిస్తే ఎంతో మంచిది. మీరు ఏవైనా వస్తువులు కొనాలనుకుంటే సేల్ కన్నా ముందే వాటిని సెలెక్ట్ చేసి పెట్టుకోవాలి. సేల్ కన్నా ముందు వాటి ధరలు ఎంత ఉన్నాయో, సేల్ సమయంలో ఎంత ఉన్నాయో ట్రాక్ చేయడం మంచిది. కొన్ని వస్తువుల ధరలు సేల్ సమయంలో కూడా తగ్గవు. అలాంటప్పుడు మీరు సేల్ వరకు ఎదురు చూడటం వృథానే. మీరు నేరుగాసేల్ సమయంలోనే మీకు కావాల్సిన ప్రొడక్ట్ సెర్చ్ చేస్తే అప్పుడు ధర తగ్గిందా లేదా అన్న విషయం తెలియదు. అందుకే ముందు నుంచే ట్రాక్ చేయడం మంచిదని సూచిస్తున్నారు నిపుణులు. ఇ-కామర్స్ సైట్‌లో కనిపించే డిస్కౌంట్లను పూర్తిగా నమ్మకూడదు. 50 శాతం, 60 శాతం, ఒక్కోసారి 90 శాతం డిస్కౌంట్ అని యాడ్స్ కనిపిస్తాయి. స్క్రీన్‌లపై కనిపిస్తున్న డిస్కౌంట్స్ చూసి మోసపో కూడదు. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లో వస్తువుల ధరలను ట్రాక్ చేసేందుకు వెబ్‌సైట్స్, యాప్స్ ఉంటాయి. వాటిని ఉపయోగించుకోవచ్చు. మీరు కొనాలనుకునే వస్తువులను విష్ లిస్ట్‌లో పెట్టుకోవాలి. ఆ ప్రొడక్ట్స్‌కి సంబంధించి ఆఫర్స్ ఉంటే మీకు నోటిఫికేషన్స్ వస్తాయి. మీరు కొనే వస్తువులకు బ్యాంక్ ఆఫర్స్ ఉన్నాయో లేదో చెక్ చేయాలి. అలాగే అమెజాన్, ఫ్లిప్‌కార్టు సేల్స్ సమయంలో క్రెడిట్ కార్డులపైలపై 10 శాతం వరకు ఇన్‌స్టంట్ డిస్కౌంట్ లభిస్తాయి. బ్రాండ్స్ వేర్వేరు అయినా ఫీచర్స్ ఒకేలా ఉంటాయి. ఆన్‌లైన్ షాపింగ్




ఓ వ్యసనం లాంటిదన్న విషయం గుర్తుంచుకోవాలి. ఒక్కసారి ఆన్‌లైన్ షాపింగ్‌కు అలవాటు పడితే చాలు ప్రతి సారి ఏదో ఒకటి కొనేందుకు ప్లాన్ చేస్తుంటారు. ఈ వ్యసనంలో పడి అవసరం లేని వస్తువులు కూడా కొనుగోలు చేయకూడదు. అవసరం లేని వస్తువులు కొంటూపోతే జేబు ఖాళీ అవుతుంటుంది.

# పెరిగిన మొబైల్ సబ్‌స్క్రైబర్లు..

**ముంబై, మార్చి 16:** గత కొన్ని నెలలుగా తగ్గుతూ వచ్చిన మొబైల్ సబ్‌స్క్రైబర్లు స్వల్పంగా పెరిగారు. డిసెంబర్ నెల చివరినాటికి స్వల్పంగా పెరిగి 118.99 కోట్లకు చేరుకున్నట్లు టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ తాజాగా వెల్లడించింది. టెలికం దిగ్గజం జియోకు ఈసారి భారీఊరట లభించింది. గత సంవత్సరం నవంబర్ నెల చివరినాటికి 118.77 కోట్లుగా ఉండగా, వీరిలో పట్టణ ప్రాంతాల్లో ఉన్న మొబైల్ సబ్‌స్క్రైబర్లు 65.98 కోట్లు ఉన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో 52.72 కోట్లు ఉన్నారు. అలాగే వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్లు 114.86 కోట్ల నుంచి 115.06 కోట్లకు పెరిగినట్లు ట్రాయ్ వెల్లడించింది. గత సంవత్సరం చివరి నెలలో జియో నెట్‌వర్క్‌లోకి 39.06 లక్షల మంది చేరగా, ఎయిర్‌టెల్‌లోకి 10.33 లక్షల మంది జతయ్యారు. కానీ వొడాఫోన్ ఐడియా 17.15 లక్షల మంది వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్లను కోల్పోయింది. అలాగే ప్రభుత్వ టెలికాం సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్ 3.16 లక్షల మంది, ఎంటీఎన్ఎల్ 8.9 లక్షల మందిని కోల్పోయాయి. రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ 47.65 కోట్ల మంది సబ్‌స్క్రైబర్లతో అగ్రస్థానంలో ఉండగా, భారతీ ఎయిర్‌టెల్ 28.93 కోట్ల మంది, వొడాఫోన్ ఐడియా 12.63 కోట్ల మంది సబ్‌స్క్రైబర్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.



# బ్యాంకింగ్‌కు జెనరేటివ్ ఎఐ బూస్ట్!

**ముంబై, మార్చి 16:** ఆర్థిక సేవల రంగంలో, ముఖ్యంగా బ్యాంకింగ్‌లో ఉత్పాదకతను జెనరేటివ్ ఎఐ గణనీయంగా పెంచనుంది. ఫైనాన్షియల్ సర్వీసెస్ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చివేయనుందని, కస్టమర్‌తో అనుసంధానత, కార్యకలాపాల సామర్థ్యాన్ని మెరుగుపరచనున్నట్లు 'ఈవై' ఇండియా నివేదిక తెలిపింది. 2030 నాటికి ఫైనాన్షియల్, సర్వీసెస్ రంగంలో ఉత్పాదకతను 34-38 శాతం మేర, బ్యాంకింగ్‌లో ఉత్పాదకతను 46 శాతం మేర జెనరేటివ్ ఎఐ అధికం చేస్తుందని అంచనా వేసింది. ఈ మేరకు ఒక నివేదికనువిడుదల చేసింది. ఫైనాన్షియల్ సర్వీసెస్, రిటైల్, హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్ మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్, టెక్నాలజీ, ఆటోమోటివ్, ఇండస్ట్రియల్స్, ఎనర్జీ తదితర రంగాల్లోని 125కుపైగా ఉన్నత స్థాయి ఉద్యోగుల అభిప్రాయాలను ఈవై తన సర్వే కోసం సేకరించింది. 'జెనరేటివ్ ఎఐపై పెట్టుబడులు పెరుగుతున్నాయి. 42 శాతం కంపెనీలు ఎఐ కోసం ప్రత్యేకంగా బడ్జెట్‌ను కేటాయిస్తున్నాయి. వాయిస్ బాట్స్, ఇ-మెయిల్ ఆటోమేషన్, బిజినెస్ ఇంటెలిజెన్స్, వర్క్‌ఫ్లో ఆటోమేషన్‌లో జెనరేటివ్ ఎఐని వేగంగా అమలు చేస్తున్నాయి' అని ఈవై నివేదిక వివరించింది. కంపెనీలు కస్టమర్ సేవల్లో జెనరేటివ్ ఎఐని అత్యధికంగా వినియోగిస్తున్నాయి. 68 శాతం సంస్థలు కస్టమర్ సేవల్లో



జెనరేటివ్ ఎఐకి ప్రాధాన్యం ఇస్తున్నాయి. కార్యకలాపాల్లో 47శ్శాతం, అండర్‌రైటింగ్ కార్యకలాపాల్లో 32శాతం, అమ్మకాల్లో 26శాతం, ఐటిలో 21శాతం చొప్పున జెనరేటివ్ ఎఐ వినియోగానికి సంస్థలు ఇప్పటికే ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఈ కృత్రిమ మేధ అమలుతో కస్టమర్ల సంతృప్తి స్థాయిలు మెరుగుపడినట్లు 63శాతం కంపెనీలు తెలిపాయి. వ్యయాలను తగ్గించుకున్నామని 58శాతం కంపెనీలు వెల్లడించాయి. కోర్ బ్యాంకింగ్ వ్యవస్థలు, సిఆర్ఎం, రుణాల మంజూరు, కార్డ్ మేనేజ్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌లు ఇతర విభాగాల్లో జెనరేటివ్ ఎఐని సంస్థలు అమలు చేస్తున్నాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.